జిల్లాలో సహకార శాఖ ఇంకా గాడినపడలేదు. పలు అంశాలలో ప్రస్తుత అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు ఆ శాఖ అధికారుల నుంచి సహకారం లభించడం లేదు. అటు రాష్ట్ర, ఇటు జిల్లా స్థాయిలోనూ పాలక పెద్దల సూచనలను బేఖాతరు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో డీసీసీబీలో అనేక అవకతవకలు, అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలపై ఇటీవల విచారణ జరిగింది. డీసీఎంఎస్‌లో ఎరువుల వ్యాపారంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు, తాజాగా పొగాకు సమాఖ్యకు ఇన్‌చార్జి చైర్మన్ నియామకం.. ఇలా ఏ అంశాన్ని తీసుకున్నా సహకార శాఖ అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. జిల్లాలో అధికార పార్టీ ప్రజాప్రతినిధుల సూచనలకు విలువ ఇవ్వడం మాట అటుంచి జరుగుతున్న పరిణామాలు, తీసుకుంటున్న చర్యలపై వారికి కనీసం సమాచారం కూడా ఇవ్వడం లేదని తెలుస్తోంది.



అధికారపక్ష ఆకాంక్షలను పట్టించుకోని సహకార శాఖ అధికారులు

- కీలక అంశాలకు సంబంధించిన సమాచారాన్ని కూడా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లని వైనం
- డీసీసీబీపై విచారణ, డీసీఎంఎస్‌పై చర్యలు
- తాజాగా పొగాకు సమాఖ్య వ్యవహారంలోనూ అదే తీరు
- మంత్రి స్వామి సీరియస్

సహకరించం!

ఒంగోలు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సహకార శాఖలో విచిత్ర పరిస్థితి నెలకొంది. అక్కడ ఇంకా పాత పాలనే నడుస్తున్నదన్న విమర్శలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా ఇప్పటికీ వైసీపీ ప్రభుత్వంలో ఆ శాఖపై షాడో పెత్తనం చూపిన ఒక అధికారే అంతా తానై వ్యవహరిస్తున్నారు. అయితే శాఖకు సంబంధించి పలు అంశాలు తన దృష్టికి రావడంతో జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి సీరియస్ అయినట్లు తెలిసింది. రెవెన్యూ, పోలీసు, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల తరహాలో నిత్యం



ప్రజలతో సంబంధం కలిగి ఉండే అవకాశం లేకపోయినా లక్షలాది మంది రైతులకు ప్రాతినిథ్యం వహించే పీఏసీఎస్‌లు, డీసీసీబీ, డీసీఎంఎస్, పొగాకు సమాఖ్య, ఏఎంసీలు ఇతరత్రా సంస్థల పర్యవేక్షణలో సహకారశాఖ కీలకం. ఆయా సంస్థల నిర్వహణలో పాలనా, ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణలో ఆ శాఖ అధికారుల జోక్యం అధికం. అంతటి ప్రాధాన్యం కలిగిన సహకారశాఖపై కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది మాసాలు దాటినా నేటికీ జిల్లాలోని అధికారపక్షానికి పట్టు లభించడం లేదు.

ఇప్పటికీ అప్పటి అధికారులే

వివిధ అంశాలలో ఇటు జిల్లాలో, అటు రాష్ట్రస్థాయిలో సహకారశాఖ అధికారులు వారి ఇష్టప్రకారం వ్యవహరిస్తున్నారన్న చర్చ రాజకీయ, సహకార శాఖ వర్గాలలో

ఇప్పుడూ వైసీపీ వారికే పగ్గాలు

జిల్లా సహకార ఆడిట్ ఆఫీసర్ (డీసీఏవో) పరిధిలో జిల్లాలో పలు పీఏసీఎస్‌లలో ఇటీవల విచారణలు జరిగాయి. వైసీపీ వారిని వదిలేసి గతంలో టీడీపీ మద్దతుదారులు గెలుపొందిన సొసైటీల్లో అనేక అవినీతి, అక్రమాలు జరిగాయని రిపోర్టు చేస్తూ నివేదికలు రూపొందించి ఇబ్బందులు పాల్జేశారు. మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండానే ఒంగోలు టుబాకో ప్రాసెసింగ్ సొసైటీకి ఎన్నికలను జిల్లా సహకార శాఖ అధికారులు నిర్వహించారు. ఆ సొసైటీ పాలకవర్గం అంతా వైసీపీ మద్దతుదారులతో నిండిపోయింది. తాజాగా ఒంగోలు కేంద్రంగా ఉన్న రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్య (పొగాకు సమాఖ్య) పర్సన్ ఇన్‌చార్జి చైర్మన్ నియామకంలోనూ ఆ శాఖ అధికారుల తీరు ఆశ్చర్యం కలిగిస్తోంది.

మిగతా 6వ పేజీలో

ప్రతిష్ఠాత్మకమైన పొగాకు సమాఖ్యలో రాష్ట్రంలో పొగాకు పండే అన్ని ప్రాంతాల రైతులు సభ్యులుగా ఉంటారు. గత వైసీపీ పాలనలో టీడీపీ మద్దతుగా ఉండే సుమారు పదివేల మంది రైతులను తొలగించి పాలక మండలిని వైసీపీ కైవసం చేసుకుంది.

అంతా ఆ అధికారి ఇష్టారాజ్యం

అనంతరం పీఐసీ చైర్మన్‌గా కూడా నాడు చైర్మన్‌గా గెలుపొందిన వైసీపీ నాయకుడినే నియమించారు. నిజానికి పాలక మండలిలో డివిజనల్ కోఆపరేటివ్ అధికారి స్థాయి కలిగిన వారు ఎండీగా ఉండాల్సి ఉన్నా కేవలం వైసీపీ నాయకులతోనే పీఐసీ నియామకం గత ప్రభుత్వంలో జరిగింది. అది కూడా ఒక వ్యక్తినే నియమించారు. కాగా సదరు వైసీపీ నేత పీఐసీ గడువు ఈనెల 12తో ముగిసింది. పర్సన్ ఇన్‌చార్జిగా ప్రస్తుతం డీసీఏవో ఆఫీసులో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న వ్యక్తిని సహకారశాఖ అధికారి నియమించారు. కీలకమైన ఈ నియామకం విషయంలో జిల్లాకు చెందిన మంత్రి, ఇతర ప్రజాప్రతినిధులు ఎవరికీ సమాచారం తెలియదు. సాధారణంగా ఇలాంటి కీలక నియామకాల విషయంలో అధికారులు కచ్చితంగా టీడీపీలోని ముఖ్య ప్రజాప్రతినిధులను సంప్రదించి చేస్తుంటారు. అలాంటి చర్చ జరిగిన దాఖలాలు లేవు. అంతేకాక స్థాయి తక్కువగా ఉండే అసిస్టెంట్ రిజిస్ట్రార్‌ను నియమించడంపై విమర్శలు వస్తున్నాయి.


జీబీఎస్‌తో ఉలికిపాటు

- అలసందలపల్లిలో మొన్న మహిళ మృతి
- బేస్తవారపేటలో మరొకరికి లక్షణాలు
- గుంటూరులో చికిత్స.. క్షేమంగా ఇంటికి చేరిక
- ఆందోళన చెందుతున్న ప్రజానీకం
- గ్రామాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు



అలసందలపల్లిలో వైద్యులు, సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గులియన్ బారీ సిండ్రోమ్(జీబీఎస్) జిల్లా వాసులను భయపెడుతోంది. ఈ వ్యాధి ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ జిల్లాలో కొద్ది రోజుల్లోనే ఏకంగా రెండు కేసులు నమోదయ్యాయి. అందులో ఒక మహిళ మృతిచెందడంతో ఒక్కసారిగా అలజడి మొదలైంది. కొమరోలు మండలం అలసందలపల్లి గ్రామానికి చెందిన కమలమ్మ(50) గతనెల 28న



అనారోగ్యానికి గురయ్యారు. ఆ తర్వాత స్థానికంగానే వైద్యుడి వద్ద చూపించుకున్నారు. సాధారణంగా వచ్చే నొప్పులుగా భావించారు. అయితే రోజురోజుకూ అవి అధికం కావడంతో ఈనెల 2న గిద్దలూరులోని ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. అక్కడ ఆమెకు రోజు రోజుకూ కండరాల

మిగతా 6వ పేజీలో

కోలుకున్న బేస్తవారపేట యువకుడు

బేస్తవారపేటకు చెందిన యువకుడు ఈనెల 9న జీబీఎస్ వ్యాధి బారినపడ్డారు. విపరీతమైన నొప్పులు రావడంతో వెంటనే సమీపంలోని వైద్యశాలలో చూపించుకొని ఒంగోలులోని రిమ్స్‌కు వచ్చాడు. ఇక్కడి వైద్యులు ఆ యువకుడిని పరిశీలించి వెంటనే గుంటూరు జీజీహెచ్‌కు మెరుగైన వైద్యం కోసం పంపించారు. అక్కడ చికిత్స పొంది కోలుకున్నాడు. ఇపుడు స్వగ్రామానికి చేరుకున్నాడు. ఆ యువకుడితో డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జీబీఎస్ ఎప్పటి నుంచో ఉందని, సకాలంలో గుర్తిస్తే ఎలాంటి ప్రమాదకరం కాదని చెప్తున్నా ప్రజల్లో మాత్రం ఆందోళన నెలకొని ఉంది. సోమవారం డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు అలసందలపల్లి గ్రామాన్ని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని పరిశీలించారు. మృతిచెందిన కమలమ్మ కుటుంబసభ్యులను పరామర్శించారు.



పిడుగుపాటు బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులను అందిస్తున్న ఫ్రెండ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

స్నేహితులు

- సమాజ సేవలో ఫ్రెండ్స్ ఫౌండేషన్
- కరోనా సమయంలో ఏర్పాటు
- ఆరుగురితో మొదలుపెట్టి.. ప్రస్తుతం 200 మందితో సాయం
- వాట్సాప్ గ్రూపుగా ఏర్పడి సేవా కార్యక్రమాలు
- అనాథలకు ఆసరా... ఆర్థికంగా తోడ్పాటు
- యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న మిత్రబృందం

వివరాలు 7వ పేజీలో

మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణల పర్వం జోరుగా సాగుతోంది. ఇప్పటికే వందల ఎకరాలు పరులపాలైంది. రూ.కోట్ల విలువచేసే భూముల్లో పాగా వేసిన కబ్జారాయుళ్లు వాటిలో యథేచ్ఛగా పంటలు సాగు చేస్తున్నారు. కొందరు దర్జాగా బోర్లు సైతం వేశారు. సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడం వీరికి ఊతం ఇస్తోంది. ఏపార్టీ అధికారంలో ఉంటే ఆ పంచన చేరి ఆక్రమిత భూములను అనుభవిస్తున్నారు.



సోమరప్పాడు సమీపంలో సుబ్బన్నచెరువును ఆక్రమించి సాగు చేసిన సుబాబుల్ తోట

పార్టీ ఏదైనా.. పాగా మాదే!

- ఆక్రమణల చెరలో ప్రభుత్వ భూములు
- తాళ్లూరు మండలంలో వందల ఎకరాలు పరులపరం
- పట్టించుకోని అధికారులు

తాళ్లూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేస్తున్నారు. దేవునిమాన్యాలు, వాగు పోరంబోకు భూములను కూడా వదలడం లేదు. మండలంలోని గుంటిగంగ, నాగంబొట్లపాలెం, బొద్దికూరపాడు, మన్నేపల్లి తదితర గ్రామాల్లో ప్రభుత్వ భూములను పోటీపడి ఆక్రమించుకున్నారు. ఆ భూముల విలువ రూ.కోట్లలో ఉంటుంది. రికార్డుల్లో ప్రభుత్వ భూములుగా ఉన్నా ఆక్రమణదారులు మాత్రం తమవిగా అభివృద్ధి చేసి సాగు చేసుకుంటూ ఫలాలు పొందుతున్నారు.

కొన్ని చోట్ల పంటల సాగు.. మరికొన్ని చోట్ల ప్లాట్లు

సోమవరప్పాడు గ్రామానికి చెందిన సుబ్బన్న చెరువుసర్వే నంబర్లు 324, 325, 326లలోని 61.24ఎకరాలు,

మిగతా 6వ పేజీలో



మార్కాపురం మండలం నికరంపల్లి వద్ద ఆదివారం ట్రాలీ ఆటో బోల్తా పడడంతో తీవ్రగాయాలతో రోడ్డుమీద పడి ఉన్న కూలీలు

వేటగాళ్ల వలకు చిక్కడంతోనే చిరుత మృతి

- నిందితుల ఆచూకీ గుర్తించాం.. అరెస్టు చేస్తాం
- టైగర్ రిజర్వ్ ఫారెస్టు డీడీ సందీప్ కృపాకర్



వేటగాళ్లు వేసిన వలలో చిక్కుకొని మృతిచెందిన చిరుత

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 17 : పందుల కోసం వేటగాళ్లు వేసిన వలలో పడి చిరుత పులి మృతిచెందినట్లు టైగర్ రిజర్వ్ ఫారెస్టు డిప్యూటీ డైరెక్టర్ సందీప్ కృపాకర్ తెలిపారు. ఎర్రగొండపాలెం మండలం నల్లమల అడవి కొలుకుల బీట్ పరిధిలోని వరదరాజులస్వామి ఆలయ సమీపంలో ఆదివారం చిరుతపులి మృతి చెందిన సంగతి విదితమే. దాని కళేబరాన్ని సోమవారం డీడీ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరిసర గ్రామాల్లో ఉండే వేటగాళ్లు పందుల కోసం వేసిన వలలో చిరుతపులి చిక్కుకొని కొనఊపిరితో ఉన్న సమయంలో తమకు సమాచారం అందిందన్నారు. దాన్ని ప్రాణాలతో కాపాడేందుకు అటవీ సిబ్బంది, స్థానిక వెటర్నరీ డాక్టర్లతో కలిసి చేసిన ప్రయత్నాలు ఫలించలేదన్నారు. వన్యప్రాణుల చట్టం ప్రకారం అడవిలో అక్రమంగా ప్రవేశించి వలవేయడం నేరమన్నారు. వేటగాళ్ల ఆచూకీ తెలిసిందని వారిని అరెస్టు చేస్తామన్నారు. నేరం రుజువైతే 7 సంవత్సరాల జైలు శిక్ష ఉంటుందని కృపాకర్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఘటనా స్థలంలో చిరుత కళేబరానికి వెటర్నరీ డాక్టర్ శివారెడ్డి పోస్టుమార్టం నిర్వహించారు. ఘటనా స్థలాన్ని గంజివారిపల్లె ఫారెస్టు రేంజర్ సుబ్బారావు, సెక్షన్ ఆఫీసర్లు పరిశీలించారు.

ప్రాణాలు పోతున్నా.. మారరే..!

- ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినా ఆటోలవైపే మొగ్గు
- ప్రమాదాలు వెంటాడుతున్నా తీరుమార్చుకోని వ్యవసాయ కూలీలు

మార్కాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఒక వైపు వరుస ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నప్పటికీ వ్యవసాయ కూలీలు తీరు మార్చుకోవడం లేదు. పరిమితికిమించి ఇష్టారీతిన ఆటోల్లో ఎక్కుతూ మృత్యువును కొనితెచ్చుకుంటున్నారు. పోలీసు, రవాణాశాఖాధికారులు నిరంతరం పర్యవేక్షించి ప్రమాదకర ప్రయాణం వద్దని వారిస్తున్నా వినిపించుకోవడం లేదు. చివరికి ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినా వాటిలో ఎక్కడం లేదు. ప్రైవేటు వాహనాల వైపే మొగ్గు చూపుతూ ప్రాణాలు కోల్పోతున్నారు.

మిరప కోతలకు వేలాది మంది గ్రామాల బాట

మార్కాపురం డివిజన్‌లోని మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, కంభం, బేస్తవారిపేట, త్రిపురాంతకం తదితర మండలాల్లో మిరప కోతల సీజన్‌లో వేలాది మంది పట్టణం నుంచి కూలీలు వెళ్తున్నారు. ఏటా నవంబరు మొదలుకొని మార్చి వరకు కూలీలు మిరప కాయలు కోసేందుకు ఆటోల్లో గ్రామాలబాట పడుతుంటారు. ఈ క్రమంలో ఒక్కో పెద్ద ఆటోలో పరిమితికి మించి 30 మంది వరకు వెళ్తున్నారు. వాస్తవానికి 8 మందికంటే ఎక్కువగా అందులో అనుమతించడానికి వీలులేదు. కానీ కొందరు కూలీలను తరలించే మేస్త్రీలు అత్యాశతో నిబంధనలను అతిక్రమంచి ఆటోల్లో కూలీలను తరలిస్తున్నారు. ఒకవైపు ప్రమాదకర ప్రయాణమని తెలిసినా పనిచేసే ప్రదేశం వరకు ఆటోలు వెళ్తుండడంతో కూలీలు వాటి వైపే మొగ్గు చూపుతున్నారు. మార్కాపురం పట్టణంలోని విజయాటాకీస్, శ్రీనివాస థియేటర్ ప్రాంతాలు, ఎస్టేట్, తూర్పువీధి, ఆర్టీసీ బస్టాండ్ వెనుకవైపు, పూలసుబ్బయ్య, భగత్‌సింగ్, బాపూజీ కాలనీల నుంచి నిత్యం వేలాదిమంది కూలీలు మిరప కోతలకు వెళ్తున్నారు. ఆయా ప్రాంతాలకు ఉదయం 7.00 గంటలకల్లా ఆటోలు వెళ్లి 8.30 గంటలకల్లా పని ప్రదేశానికి

మిగతా 6వ పేజీలో



మార్కాపురంలో కూలీలను దగ్గరుండి బస్సు ఎక్కిస్తున్న పోలీసులు (ఫైల్)

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

- గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి
- టీడీపీలో చేరిన ఇద్దరు సర్పంచ్‌లు

6



పరిమితికి మించి ప్రమాదకరంగా ఆటోల్లో ప్రయాణిస్తున్న కూలీలు

ప్రాణాలు పోతున్నా.. మారరే..!

(5వ పేజీ తరువాయి)

తీసుకెళ్తాయి. సాయంత్రం మళ్లీ 6.00 గంటలకల్లా వారిని స్వస్థలాలకు తీసుకొస్తాయి.

ప్రమాదాలు చోటుచేసుకున్నా పట్టించుకోని వైనం

మార్కాపురం డివిజన్‌లో 2024-25 సీజన్‌లోనే ఇప్పటి వరకూ సుమారు 17 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. సుమారు 13 మంది మృత్యువాత పడ్డారు. పదుల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. ప్రమాదాలకు ఓవర్‌లోడే ప్రధాన కారణం. ఉదాహరణకు అప్పే ఆటోలనే తీసుకుంటే డ్రైవర్ సీటుకు రెండు వైపులా నలుగురు కూర్చుంటున్నారు. దీంతో మలుపుల వద్ద ఆటోలు తిరగడం కష్టమవుతోంది. అంతేకాక డ్రైవర్ ఒత్తిడికి గురి కావడంతో ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. ప్రమాదం జరిగిన ప్రతిసారీ పోలీసులు, రవాణాశాఖ అధికారులు ఆయా ప్రాంతాలకు వెళ్లి కూలీలకు ఆటోల్లో ప్రయాణించవద్దని అవగాహన కల్పిస్తున్నా పట్టించుకోకపోవడం లేదు. ఒకవైపు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా పనులకు వెళ్లే కూలీలకు చీమకుట్టినట్లైనా ఉండటంలేదు. మార్కాపురం పోలీసులు ప్రయోగాత్మకంగా ఒక అడుగు ముందుకేశారు. కూలీలను ప్రమాదాల బారినుంచి తప్పించేందుకు ఆయా గ్రామాలలో ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయించారు. గత నెలలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి నిత్యం 6 బస్సులు పంపుతున్నారు. తొలుత ఆర్టీసీ బస్సుల్లోనే వెళ్లినా మళ్లీ దొంగచాటుగా ఆటోల్లో కూలీలు ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం మార్కాపురం మండలంలోని నికరంపల్లి గ్రామ సమీపంలో కూలీల ఆటో బోల్తాకొట్టి పట్టణానికి చెందిన ఇద్దరు కూలీలు మృతిచెందారు. పది మంది వరకూ గాయపడ్డారు. ఇప్పటికైనా కూలీలు తమ ఆలోచన తీరును మార్చుకుంటే ప్రమాదాలను నివారించవచ్చు. అదేవిధంగా కూలీలను తరలించే ఆటోలపై పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

కూలీలను తరలించే వాహన డ్రైవర్లపై క్రిమినల్ కేసులు

మిరప కోతలకు కూలీలను తరలించే ఆటోలు, ప్రైవేటు వాహనాల డ్రైవర్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నాం. ఇప్పటికే ఉదయం వేళలో మార్కాపురం పట్టణంలోని శ్రీనివాస థియేటర్, పూల సుబ్బయ్య కాలనీ, కళాశాల రోడ్డు వద్ద నుంచి 6 వరకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశాం. సాధ్యమైన మేర కూలీలను తరలిస్తున్నాం. అవసరమైతే మరిన్ని బస్సులు ఏర్పాటు చేసేందుకు ఆర్టీసీ అధికారులు సిద్ధంగా ఉన్నారు. అయితే ప్రైవేటు వాహనాలకు అలవాటు పడిన కూలీలు ప్రమాదకర ప్రయాణంవైపే మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా ఆటోల్లో వెళ్తే పని ప్రదేశంలో దిగుతామని చెబుతున్నారు. ఆర్టీసీ బస్సులో వెళితే ఒకటి రెండు కిలోమీటర్లు పొలం వద్దకు నడిచినా సురక్షిత ప్రయాణమని వారికి అవగాహన కల్పిస్తున్నాం.

- పి.సుబ్బారావు, సీఐ, మార్కాపురం

సహకరించం!

(5వ పేజీ తరువాయి)

సాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ శాఖల పర్యవేక్షణలో ఉన్న అధికారులే ఇప్పటికీ కొనసాగుతుండటం అందుకు కారణం. గత వైసీపీ ప్రభుత్వంలో పీకలలోతు అవినీతిలో కూరుకుపోయిన డీసీసీబీ విషయంలో కూటమి ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుంటే తప్ప ప్రాథమిక విచారణకు కూడా రాష్ట్రస్థాయి అధికారులు సుముఖత వ్యక్తం చేయలేదు. ఈ విషయంలో కలెక్టర్ స్వయంగా ప్రభుత్వానికి లేఖ రాశారు. సాధారణంగా కలెక్టర్ లేఖకు రాష్ట్ర అధికారుల నుంచి తక్షణ స్పందన ఉండాలి. అందుకు విరుద్ధంగా వ్యవహారం సాగింది. తీరా విచారణకు అయిష్టంగానే ఉన్నతాధికారులు అనుమతి ఇవ్వగా అప్పటి సీఈవో మార్పు విషయంలో పెద్ద హైడ్రామా నడిచింది. ఆయనను సరెండర్ చేసే విషయంలో కలెక్టర్‌కు జిల్లా సహకార అధికారులు సరైన సమాచారం ఇవ్వలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

51 విచారణపై ప్రతిష్టంభన

చివరకు డీసీసీబీపై 51 విచారణకు అనుమతించిన రాష్ట్రస్థాయి అధికారులు విచారణాధికారుల విషయంలో జిల్లాకు చెందిన మంత్రి, కీలకంగా ఉన్న ఒంగోలు ఎమ్మెల్యే సూచనలు పట్టించుకోలేదు. ఉన్నతాధికారులు సూచించిన విచారణాధికారిని మార్చాలని వారు సంబంధిత మంత్రి అచ్చెన్నాయుడును కోరగా ఆ మేరకు చర్యలకు ఆయన ఉన్నతాధికారులకు సూచించినట్లు సమాచారం. అయితే నెలరోజులు గడుస్తున్నా మార్పు లేక 51 విచారణపై ప్రతిష్టంభన నెల కొంది. ప్రస్తుతం ఇన్‌చార్జి సీఈవోగా అప్కాబ్ నుంచి ఒక అధికారిణి పనిచేస్తున్నారు. రెగ్యులర్ సీఈవో నియామకంలోనూ ఉన్నతాధికారులు అలాగే వ్యవహరిస్తున్నట్లు సమాచారం. అలాగే మరో కీలకమైన జిల్లా మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లో వైసీపీ పాలనలో అనేక అక్రమాలు జరిగాయి. పొగాకు బోర్డు ద్వారా ఎరువుల అమ్మకాల వ్యవహారంలో అనివార్యమైన పరిస్థితుల్లో జిల్లా సహకార శాఖ అధికారులు విచారణకు ఆదేశించినా సరిగ్గా జరగలేదన్న విమర్శలు వచ్చాయి. అయినప్పటికీ విచారణాధికారి కూడా బాధ్యులపై చర్యలకు సిఫార్సు చేశారు. అయితే నామమాత్రంగా కేసు పెట్టారు. చివరకు రికవరీ పేరుతో ఆ వ్యవహారాన్ని వదిలేశారు.

సహకారశాఖ వర్గాల్లో విస్మయం

గతంలో పొగాకు సమాఖ్యకు పాలకవర్గ అధికారిగా డీఆర్ స్థాయి అధికారినైనా నియమించాలి. అవేమీ పట్టించుకోకుండా సహకారశాఖ అధికారులు కూటమి ప్రభుత్వ ప్రాధాన్యతలు, ప్రజాప్రతినిధుల ఆకాంక్షలను పట్టించుకోకుండా వ్యవహరిస్తుంటడంపై సహకారశాఖ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా డీసీసీబీ వ్యవహారంలో జరుగుతున్న పరిణామాలపై మంత్రి స్వామి, ఇతర ప్రజాప్రతినిధులకు కొంత అవగాహన ఉన్నా తాజాగా పొగాకు సమాఖ్యకు పీఐసీ నియామకం, డీసీసీబీలో రెగ్యులర్ సీఈవో నియామకం ప్రక్రియపై ఎలాంటి సమాచారం లేదని తెలిసింది. రెండు రోజుల క్రితం తన దృష్టికి ఈ అంశం రావడంతో సంబంధిత అధికారులపై మంత్రి డాక్టర్ స్వామి సీరియస్ అయినట్లు సమాచారం. ఇప్పటికైనా సహకారశాఖ నుంచి తగు సహకారం అధికార పక్షానికి లభిస్తుందా లేదా చూడాల్సి ఉంది.

జీబీఎస్‌తో ఉలికిపాటు

(5వ పేజీ తరువాయి)

నొప్పులు అధికమవడంతోపాటు మూడుసార్లు గుండెపోటుకు గురైనట్లు సమాచారం. మరోవైపు వైద్యసేవలు పొందుతూనే ఆమె కోమాలోకి వెళ్లడంతో వెంటిలేటర్ కూడా ఏర్పాటు చేశారు. అయినా ఆమె ఆదివారం సాయంత్రం మృతి చెందారు.

జీబీఎస్ వ్యాధి వివరాలు

● గులియన్ బ్యారీ సిండ్రోమ్ (జీబీఎస్) విచిత్రంగా ఉంటుంది. చూసేందుకు బాధితులు ఆరోగ్యంగానే ఉన్నట్లు కనిపిస్తారు. వైద్య పరీక్షల్లో వైటల్స్ అని పిలుచుకునే నాడి, రక్తపోటు వంటివి సాధారణంగానే కనిపిస్తాయి.

● పూర్తిగా వైరస్ బ్యాక్టీరియాతో సంక్రమణ తర్వాత ఈ వ్యాధి వస్తోంది.

● కాళ్లుచేతులు చచ్చుబడిపోవడం, నరాల బలహీనత, గొంతు పొడిబారిపోవడం, ఆహారం తీసుకోలేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి.

● రోగ నిరోధక వ్యవస్థ, నాడీ వ్యవస్థను దెబ్బతీయడంతో కండరాల బహీనత ఏర్పడుతుంది

● శ్వాస కోశ, జీర్ణశయాంతర వంటి ఇన్ఫెక్షన్లు ఈ వ్యాధికి సాధారణ ట్రిగ్గర్‌లు జీబీఎస్ వేగంగా తీవ్రమవుతుంది.

● ప్లాస్మా మార్పిడి, దీనిని ప్లాస్మాఫెరెసిస్ అని కూడా పిలుస్తారు. ఈ వ్యాధికి చికిత్సగా ఉపయోగిస్తారు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

● ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ● టీడీపీలోకి ఇద్దరు సర్పంచ్‌లు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



పార్టీలో చేరిన సర్పంచ్‌కి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి కంభం మండలం ఔరంగబాద్ సర్పంచ్ గోపిశెట్టి శేఖర్, మాజీ సర్పంచ్ వరికుంట్ల సుబ్బారావుతోపాటు పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాటుపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారు మాట్లాడుతూ వైసీపీ హయాంలో గెలిచినప్పటికీ, తమకు ఎటువంటి గుర్తింపు లేకుండా చేశారన్నారు. గ్రామపంచాయతీ నిధులను కాజేసి గ్రామాల అభివృద్ధికి తూట్లు పొడిచిన ఘనత జగన్‌రెడ్డిదేనని దుయ్యబట్టారు. గ్రామాల అభివృద్ధి ఎన్‌డీఏ కూటమితోనే సాధ్యమన్నారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అభివృద్ధిలో చూపిస్తున్న చొరవ అమోఘమన్నారు. కార్యక్రమంలో కంభం మండల అధ్యక్షులు తోట శ్రీనివాసులు, పార్లమెంటు నాయకులు కేతం శ్రీను, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, నంది శ్రీను, బోయిళ్ళ రోషన్‌బాబు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన ముక్తాపురం సర్పంచ్

గిద్దలూరు టౌన్ : ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితుడైన కొమరోలు మండలం ముక్తాపురం వైసీపీ సర్పంచ్ రావిపాటి రమణరెడ్డి సోమవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారందరికీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, బిజ్జాల తిరుమలరెడ్డి, గోడి ఓబులరెడ్డి, జయరాంరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

వేధిస్తున్న పోలీస్ సిబ్బంది కొరత

» న్యాయ పరిష్కారాల్లో తీవ్ర జాప్యం

» ఫిర్యాదుదారులకు ఇబ్బందులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలో పోలీస్ స్టేషన్‌లకు సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో స్టేషన్‌లను ఆశ్రయించిన ఫిర్యాదుదారులు న్యాయ పరిష్కారంలో జాప్యంతో ఇబ్బందులు పడుతున్నారు. చీరాల ఒకటవ పట్టణానికి రైల్వే స్టేషన్, బస్టాండ్, కూరగాయల మార్కెట్, ముంతావారి సెంటర్ నిత్యం ప్రజలు, వాహనదారులతో రహదారులు రద్దీగా ఉంటాయి. ఈక్రమంలో కొంత ట్రాఫిక్ సమస్యలు ఉంటాయి. అలాగే వాహనాలు చోరీతో పాటు, రోడ్డు ప్రమాదాల వివాదాలు అధికమే. అలాగే చీరాల చుట్టుపక్కల ఎక్కడ సమస్య జరిగినా ఆ కుటుంబ సభ్యులు, మద్దతు దారులు, లేదా పార్టీలు, వ్యక్తులు గడియార స్తంభం కూడలి వద్ద ధర్నా కార్యక్రమాలు చేస్తుంటారు. అంతేకాకుండా స్టేషన్ పరిధి ఒక వైపు జాండ్రపేట వరకు మరోవైపు చీరాల ఏరియా హాస్పిటల్ సమీపంలోని కుందేరు వరకు ఉండగా, గేటు అవతలి నుంచి వైకుంఠపురం, విఠల్‌నగర్, హరి ప్రసాద్‌నగర్ వంటి జోన్‌లు కూడా ఉన్నాయి. దీంతో తలెత్తిన సమస్యలు అధికంగా ఉండగా, గస్తీ నిర్వహించేందుకు విస్తీర్ణం కూడా ఎక్కువగానే ఉంది. స్టేషన్‌లో ప్రస్తుతం ఒక ఎస్‌హెచ్‌వో, ఒకరు ట్రాఫిక్ ఆర్ఎస్సై, ఇద్దరు స్టేషన్‌కు పరిమితం కాగా, మరొకరు రికవరీలకు సుప్రసిద్ధులుగా పేరు గాంచడంతో అవసరాలకు అనుగుణంగా అన్ని స్టేషన్‌లకూ వినియోగిస్తున్నారు. సుమారు 50 మంది మాత్రమే ఉండగా వీరిలో సెలవుల్లో ఉన్నవారు, రికార్డు వర్క్‌లు, దర్యాప్తు, ట్రాఫిక్ వగైరాతో పోల్చుకుంటే నానా యాతన అవుతుంది.

రెండవ పట్టణ పరిధిలో ఒక ఎస్‌హెచ్‌వో, ఇద్దరు ఎస్సైలు ఉండగా సుమారు 50 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. ఇక్కడ పేరాల, జయంతిపేట, జాన్‌పేట, ఐక్యనగర్, కొత్తపేట రోశయ్య నగర్, ఐఎల్‌టీడీ కాలనీతో పాటు శృంగారపేట, రామనగర్, ఆదినారాయణపురం వంటి ప్రాంతాలు స్టేషన్ పరిధిలో ఉన్నాయి. వీటిల్లో కొన్నిప్రాంతాల్లో సారా, కొట్లాట కేసులతోనే పోలీసులు తల మునకలవుతుంటారు. ఈక్రమంలో చాలీచాలని సిబ్బందితో పోలీసులు రోజులు గడుపుతున్నారు. చీరాల రూరల్ పరిధిలో ఈపూరుపాలెం, వేటపాలెం స్టేషన్‌లు పేరు చిన్నవే అయినా లా అండ్ ఆర్డర్ సమస్యలు అధికం. నిత్యం సివిల్, క్రిమినల్ కేసులు పేట్రేగుతుంటాయి. అక్రమ ఇసుక రవాణా, జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాలు అధికమే. అంతేకాకుండా ఈరెండు స్టేషన్‌లకు ప్రొటోకాల్ డ్యూటీలు కోకొల్లలు. ఈనేపథ్యంలో స్టేషన్‌లను ఆశ్రయిస్తున్న ఫిర్యాదుదారులు తలలు పట్టుకుంటున్నారు. పరిష్కారం కోసం స్టేషన్‌ల వద్ద ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈక్రమంలో సిబ్బందిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని బాధితులు కోరుతున్నారు.

రొంపేరు కాలువలో ట్రాక్టర్ బోల్తా

» ఒకరి మృతి, పలువురికి స్వల్పంగా గాయాలు

» ధాన్యం తరలించేందుకు వెళ్తుండగా ప్రమాదం



కారంచేడు వద్ద రొంపేరు కాలువలో బోల్తాపడిన ట్రాక్టర్



పోతురాజు మృతదేహం

కారంచేడు (పర్చూరు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రొంపేరు వాగులో ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి చెందగా పలువురు కూలీలు గాయపడిన ఘటన సోమవారం కారంచేడులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కారంచేడు గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ గన్నెపూడి పోతురాజు(42) మరికొంత మంది కూలీలతో కలసి ధాన్యం తరలించేందుకు వెళుతున్న నేపథ్యంలో ఈప్రమాదం జరిగింది. పోలీస్ స్టేషన్ సమీపంలోని రొంపేరు వాగుపై ఉన్న బ్రిడ్జిని ఎక్కించే క్రమంలో ప్రమాదానికి గురై పక్కనే ఉన్న కాలువలోకి బోల్తాపడింది. ఈప్రమాదంలో పోతురాజు ట్రాక్టర్‌తో పాటు నీటిలో పడిపోయి అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటీన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గురై ప్రాణాపాయస్థితిలో ఉన్న పోతురాజును కానిస్టేబుల్ యనమల బాల శంకరావు సీపీఆర్ నిర్వహించి 108లో చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు.

తప్పిన పెనుప్రమాదం

ప్రమాద సమయంలో ట్రాక్టర్‌లో ఐదుగురు కూలీలు ఉన్నారు. బ్రిడ్జిపై నుంచి కాలువలోకి ట్రాక్టర్ పడిపోయింది. అదృష్టవశాత్తు స్వల్పగాయాలతో కూలీలు బయట పడ్డారు. దీంతో పెను ప్రమాదం తప్పిందని ఊపిరిపీల్చుకున్నారు.

కాగా కొనఊపిరితో ఉన్న పోతురాజును కాపాడేందుకు కానిస్టేబుల్ బాలశంకరరావు అన్నివిధాలా ప్రయత్నించారు. నోటిలో నోరుపెట్టి ప్రాణ వాయువు అందించేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఆయన కృషిని స్థానికులు అభినందించారు.

జీతాలు చెల్లించండి మహాప్రభో

11 పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు ఏడు నెలలుగా అందని వైనం

బల్లికురవ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలను ప్రతి రోజు పరిశుభ్రం చేస్తున్న 11 పాఠశాలల ఆయాలకు ఏడు మాసాలుగా జీతాలు చెల్లింపులు చేయలేదు. దీంతో ఆయాలు జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వైదన, కొత్తపాలెం, అంబడిపూడి, ఉప్పుమాగులూరు, జమ్మలమడక, వల్లాపల్లి, కోటవారిపాలెం, బల్లికురవ గ్రామాలలో ఉన్న 11 పాఠశాలలకు జూలైలో నూతనంగా ఆయాలను నియమించారు. వారికి అప్పటి నుంచి జీతాలు మాత్రం చెల్లింపులు చేయడం లేదు. తమకు ఏడు నెలలుగా జీతాలు రావడం లేదని వారు ఎంఈవో కార్యాలయాన్ని సంప్రదించగా వారు మేము జిల్లా కార్యాలయానికి జీతాల ఫైల్ పంపామని అక్కడ అధికారులు సరిగ్గా స్పందించడం లేదని సమాదానం చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచీ పాఠశాలల్లో ఉన్న మరుగుదొడ్లు, ప్రాంగణం పరిశుభ్రం చేసే తమకు జీతాలు ఇవ్వకుంటే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆయాలు వాపోతున్నారు. నెలకి రూ. 6వేల వంతున జీతం రావాల్సి ఉందని వారు తెలిపారు. తమ తోటి పనిచేసే ఇతర పాఠశాలల ఆయాలకు నెలనెలా జీతాలు వస్తున్నాయని తమకు మాత్రమే జీతాలు ఎందుకు చెల్లించడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. జిల్లా అధికారులు జీతాల చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టాలని 11 పాఠశాలలకు చెందిన ఆయాలు కోరుతున్నారు.



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో ప్రతినిధులు

పోటీలతో బహుళ ప్రయోజనాలు

చీరాలటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పోటీల్లో పాల్గొనడం వలన శరీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం ఉంటుందని సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో కాకినాడ జెఎన్‌టీయూ ఆధ్వర్యంలో పవర్ లిఫ్టింగ్ (స్త్రీ, పురుషులు) ఇంటర్ కాలేజీ సెలక్షన్స్ ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా వేటపాలెం ఎస్ఐ వెంకటేశ్వర్లు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోటీల్లో గెలుపు ఓటములు సహజమని, రెండింటినీ ఒకేలా స్వీకరించి విజయాలకు బాటలు వేసుకోవాలని సూచించారు.

మంచినీటి పథకాలను శుభ్రం చేయండి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాలల్లో ఉన్న రక్షిత మంచినీటి పథకాలను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని ఎంపీడీవో బత్తిని సింగయ్య గ్రామాలలోని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం మండలంలోని అన్ని గ్రామాలలోని రక్షిత మంచినీటి పథకాలను ఆ యా గ్రామాలల పంచాయతీ కార్యదర్శులతో తనిఖీ చేయించారు. ట్యాంకులో పక్షుల కళేబరాలు, శరీరభాగాలు, పక్షుల మలం, ఇతర వ్యర్థాలు ఏ మైన ఉన్నాయని తనిఖీ చేశారు. వెంటనే ట్యాంక్‌లను శుభ్రం చేసి క్లోరినేషన్ చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలందరు కాచి చల్లార్చి వడకట్టిన నీటిని త్రాగాలని ఎంపీడీవో తెలిపారు. బర్డ్ ఫ్లూ వ్యాధి నివారణ దృష్ట్యా మరిగే నీటిలో బాగా ఉడికించిన చికెన్‌ను మాత్రమే తినాలని తెలిపారు.



ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

వేతనాలు పెంచాలని అంగన్‌వాడీల నిరసన

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల సమస్యలను పరిష్కరించి, వేతనాలు వెంటనే పెంచాలని కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక రామ్‌నగర్‌లోని ఐసీడీఎస్ ఒంగోలు ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఈ నిరసన కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. అంగన్వాడీ వర్కర్స్ గత సమ్మెలో ఇచ్చిన మినిట్స్ కాపీలకు ప్రభుత్వం వెంటనే జీవోలు ఇ వ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు కల్పన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి గతంలో అంగన్వాడీలు 42 రోజుల పాటు సమ్మె చేశారన్నారు. సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వటంతో అంగన్వాడీలు సమ్మె విరమించారన్నారు. నాడు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రభుత్వం వెంటనే జీవోలను విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. సీఐటీయూ ఒంగోలు నగర కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు అతి తక్కువ వేతనంతో జీవనం సాగిస్తున్నారన్నారు. ధరలు ఆకాశాన్నంటుతుండగా ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచకుండా 2019 నాటి వేతనాలనే నేటికి అమలు చేస్తోందన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని, మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చాలని, ఇందుకు సంబంధించిన జీవోలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు స్వామిరెడ్డి, యూనియన్ ఒంగోలు నగర అధ్యక్ష కార్యదర్శులు పద్మ, ఎనీమా, వి.సుబ్బమ్మ, నిర్మల, పద్మ, శేషమ్మ, సంధ్య, జ్యోతి, రాజేశ్వరి, శోభ, శ్రీదేవి పాల్గొన్నారు.

అంగన్వాడీల వేతనాలు పెంచాలి

మద్దిపాడు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి):అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా నాయకులు కాలం సుబ్బారావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాల వేతనాలు పెంచాలని చేసిన ధర్నాకు టీడీపీ, జనసేన మద్దతు ఇచ్చాయని, ఇప్పుడు వారు అధికారంలో ఉన్నందున తక్షణమే వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ మండల నాయకురాలు జయప్రద, ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, శారద, మాధవి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల రైతులకు సబ్సిడీపై షేడ్‌నెట్‌లు

● జిల్లాకు 150 యూనిట్లు మంజూరు

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కూరగాయలు, పూలు సాగుచేస్తున్న రైతులకు ప్రభుత్వం రాయితీపై షేడ్‌నెట్‌లను అందించనుంది. రాష్ట్ర పేదరిక నిర్మూలనా సంస్థ ద్వారా ఈ యూనిట్లను కూరగాయలు, పూలు సాగు చేస్తున్న రైతులకు సగం సబ్సిడీపై అందించనున్నారు. సాగులో షేడ్‌నెట్‌లను రైతులు ఉపయోగించటం వల్ల అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది. దీంతో సెర్ప్, వెలుగు ద్వారా జిల్లాలో 150 షేడ్‌నెట్‌లను రైతులకు సబ్సిడీపై అందించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రూ.3.30 లక్షల యూనిట్ విలువలో సగం సబ్సిడీగా రైతులకు ఈ యూనిట్లను అందించనున్నారు. రెండు రోజుల్లో లబ్ధిదారుల జాబితాను ఖరారు చేయాలని వెలుగు అధికారులకు సెర్ప్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. యూనిట్లను పొదుపు సంఘాలు, ఎఫ్‌పీవోల ద్వారా రైతులకు అందించనున్నారు. కూరగాయలు, పూలు, నర్సరీలు సాగుచేసే రైతులకు ఈ యూనిట్లు ఉపయోగకరంగా ఉంటాయని వెలుగు అధికారులు పేర్కొంటున్నారు.

పార్టీ ఏదైనా.. పాగా మాదే!

(5వ పేజీ తరువాయి)



తూర్పుగంగవరం-చీమకుర్తి వెళ్లేమార్గంలో వాగును ఆక్రమించి కట్టిన శాశ్వత భవనం

ఆదేగ్రామంలో సర్వేనెంబర్336, 337, 322/1లలోని 23.72 ఎకరాలను ఆక్రమించారు. సొంతంగా బోర్లు వేసుకుని పంటలు, సుబాబుల్ వంటి పంటలు సాగు చేస్తున్నారు. దీనికితోడు వాగుపోరంబోకు భూమిసర్వే నంబర్ 336లో 6.36 ఎకరాలు, 339లో6.72ఎకరాలు, 337లో 5.82 ఎకరాల భూమిని ఆక్రమించి సాగు చేస్తున్నారు. అదంతా రికార్డుల్లో చెరువుగా ఉంది. ఇదే గ్రామ రెవెన్యూ పరిధిలో తూర్పుగంగవరం-చీమకుర్తి ప్రధాన రోడ్డు మార్గంలో గల సర్వే నంబర్ 231/1,231/2లోని 2.36 ఎకరాల వాగు భూమిలో శాశ్వత భవనం, గేదెల షెడ్లు నిర్మించారు. కొంతస్థలంలో ప్లాట్లు వేసి అమ్మకానికి సిద్ధం చేశారు.

చెన్నకేశవస్వామి ఆలయ భూమి హాంఫట్

మన్నేపల్లి గ్రామంలో చెన్నకేశవస్వామికి చెందిన 63ఎకరాల భూములను దారంవారిపాలెం, విఠలాపురం, మన్నేపల్లి గ్రామాలకు చెందిన ఆక్రమణదారులు సాగు చేస్తున్నారు. చెన్నకేశవ స్వామికి చెందిన సర్వే నంబర్లు 130/1లో 6.02ఎకరాలు, 134లో 12.10ఎకరాలు, 457/1లో14.46 ఎకరాలు, 545లో 16.92 ఎకరాలు, 621/1లో 10.90 ఎకరాలు, 621/3లో0.63, 675/5లో 0.96 ఎకరాలతోపాటు మన్నేపల్లి చెన్నకేశవస్వామికి చెందిన భూములు కూడా అన్యాక్రాంతమయ్యాయి. ఇప్పటికి రెవెన్యూ రికార్డుల్లో చెన్నకేశవస్వామి పేరిటనే ఆ భూములు ఉన్నాయి. బొద్దికూరపాడు గ్రామానికి చెందిన చెరువులో దాదాపు 30 ఎకరాలు ఆక్రమణకు గురైంది. నాగంబొట్లపాలెం గ్రామంలో 675/5 లోని అటవీ భూములు, రెవెన్యూశాఖకు చెందిన పాపిరెడ్డికుంట, రామయ్య కుంటలో దాదాపు 14ఎకరాల భూమిని ఆక్రమించి సాగు చేస్తున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ భూములు ఆక్రమణలు జరిగిన గ్రామాల్లో విచారణ చేయిస్తాం. ఆ నివేదికలను జిల్లా యంత్రాంగానికి అందజేస్తాం. వారి సూచన మేరకు ఆక్రమణదారులపై చర్యలు తీసకుంటాం.

- జె.ఇమ్మానియేల్‌రాజు, ఇన్‌చార్జ్ తహసీల్దార్, తాళ్లూరు

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో స్మార్ట్‌జన్ విద్యార్థి ప్రతిభ



కప్‌ను అందుకొంటున్న భక్తి

సింగరాయకొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా అద్దంకిలో నిర్వహించిన జాతీయ స్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక స్మార్ట్‌జెన్ గ్లోబల్ స్కూల్‌కి చెందిన డి.భక్తి ప్రతిభ కనబరిచారు. తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. నిర్వాహకుల నుంచి కప్, ప్రశంసాపత్రాన్ని అందుకొన్నారు. భక్తిని పాఠశాల ఛైర్మన్ పి.శ్రీనివాసరావు, కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.గీతారాణి అభినందించారు.



కరోనా సమయంలో ఇంటింటికీ ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు, ఆహారం అందిస్తున్న ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యులు (ఫైల్)

స్నేహమంటే కలిసి తిరగడం కాదు.. కలిసి మాట్లాడుకోవడం కాదు. వారిలో వారికే సాయం చేసుకోవడమూ కాదు. నీడలేనివారికి మేమున్నామంటూ గొడుగై నిలవడమనీ, అన్నార్తులను ఆదుకోవడమనీ, అటువంటి స్నేహంలోనే మాధుర్యం ఉంటుందని చాటుతున్నారు కొండపికి చెందిన కొందరు యువకులు. 'ఇంతింతై వటుడింతై' అన్నట్లు కరోనా సమయంలో ఆరుగురితో సేవా కార్యక్రమాలు మొదలుపెట్టి ప్రస్తుతం 200 మందితో బృందంగా ఏర్పడి పేదలకు తోడ్పాటు అందిస్తున్నారు. పదిమందికి స్ఫూర్తిగా నిలుస్తున్న ఆ స్నేహితుల దాతృత్వాన్ని తెలిపే కథనం మీకోసం..

- సమాజ సేవలో ఫ్రెండ్స్ ఫౌండేషన్
- కరోనా సమయంలో ఏర్పాటు
- ఆరుగురితో మొదలుపెట్టి.. ప్రస్తుతం 200 మందితో సాయం
- వాట్సాప్ గ్రూపుగా ఏర్పడి సేవా కార్యక్రమాలు
- అనాథలకు ఆసరా... ఆర్థికంగా తోడ్పాటు
- యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న మిత్రబృందం



కొండపిలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూలింగ్ మినరల్ వాటర్ చలివేంద్రం (ఫైల్)

స్నేహితులు!

కొండపి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కొండపికి చెందిన 15 మంది ఒకే తరగతుల్లో చదువుకున్నారు. వీరిలో తొలుత చిరు వ్యాపారం చేసుకుంటున్న గొర్రెముచ్చు ఏడుకొండలు, స్థానికంగా పలు చిరు వ్యాపారాలు చేసుకుంటున్న స్నేహితులైన దేపూరి మస్తాన్, రాజారపు రవి, పేర్నపాటి వెంకటేశ్వర్లు, కడియం సుబ్రహ్మణ్యం, కొణిజేటి నరసింహారావు కలిసి కరోనా సమయంలో పేదలకు ఏదైనా సాయం చేయాలని భావించారు. కొండపిలోని నిరుపేదలైన వారికి ఆహారం, కరోనా మందులు, మాస్కులు అందించారు. 'ఫ్రెండ్స్ ఫౌండేషన్-కొండపి' పేరుతో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశారు. వీరితో చదివినవారు ఒకరికొకరు విషయాలను తెలుసుకుంటూ చైన్ లింక్ మాదిరిగా స్నేహితులంతా పెరిగిపోయారు. కొండపి పరిసర గ్రామాల్లోని 30 కిలోమీటర్లు పరిధిలోని గ్రామాలకు చెందిన 200 మంది ఈ గ్రూపులో చేరారు. కమిటీలో 15 మంది సభ్యులు క్రియాశీలకంగా పనిచేస్తున్నారు.

పలు కుటుంబాలకు ఆర్థికసాయం

- నేపాల్‌కు చెందిన వ్యక్తి పిడుగుపాటుకు ప్రాణాలు కోల్పోయి కుటుంబం రోడ్డున పడింది. ఆ కుటుంబానికి నిత్యావసర సరుకులు, ఆ కుటుంబంలోని చిన్నారికి రూ.50 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.
- కొండపికి చెందిన సహచర పూర్వ విద్యార్థి దున్నా ఎర్రకోటయ్య పేదరికంలో మరణిస్తే, స్నేహితుడి కుమార్తెకు రూ.50 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.
- జువ్విగుంటలో ఓ నిరుపేద కుటుంబంలో యజమాని చనిపోతే విషయం ఫౌండేషన్ దృష్టికి రావడంతో ఆ కుటుంబంలో బాలికకు రూ.50వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.

కొండపి ప్రాంతంలో అందించిన సేవలు

- కొండపిలో కరోనా సమయంలో నిత్యావసర సరకులు, మందులు, మాస్కులు నిరుపేదలైన 20 కుటుంబాలకు అందజేశారు.
- బ్లడ్ క్యాంప్ ఏర్పాటు చేసి రక్తదానం చేశారు. 25 మంది ఆపదలో ఉన్నవారికి మరో సంస్థ ద్వారా రక్తం దానం చేశారు. తలసేమియా, ఇతర ప్రాణాంతక వ్యాధులతో ఉన్నవారికి ఇపుడు కూడా రక్తం దానం చేస్తున్నారు.
- కొండపి బస్టాండ్ సెంటర్‌లో కూలింగ్ వాటర్ చలివేంద్రం ఏర్పాటు చేసి వేసవిలో ప్రయాణికుల దాహం తీరుస్తున్నారు.
- పోలిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ విద్యుత్ ఘాతానికి గురై నడవలేని స్థితిలో ఉంటే అతనికి వీల్‌ఛైర్ సాయం అందించారు.
- ముక్కోడిపాలెం గ్రామానికి చెందిన ఓ నిరుపేద ఒంటరి మహిళకు జీవనోపాధికోసం కుట్టుమిషన్ ఉచితంగా అందించారు.
- ప్రతి సంవత్సరం వినాయక చవితి సందర్భంగా 600 వినాయక మట్టి ప్రతిమలు అందిస్తూ పర్యావరణ హితానికి పాటుపడుతున్నారు.
- కొండపిలోని పలు స్కూళ్లలోని చిన్నారులకు పెన్నులు, నోటు పుస్తకాలు అందజేశారు.
- టంగుటూరులోని బీసీ హాస్టల్‌కు స్పోర్ట్స్ కిట్‌లు అందజేశారు.
- కొండపిలో చెత్త కుండీలు ఏర్పాటు చేశారు.
- కొండపిలోని సీహెచ్‌సీకి మెడికల్ కిట్‌లు అందజేశారు.



ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు పెన్నులు, పుస్తకాల పంపిణీ (ఫైల్)

మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తాం



చిన్నపాటి మెడికల్ షాపు నిర్వహించుకుంటున్నాను. పెద్దపెద్ద సాయాలు చేయలేమని తెలిసి కూడా కరోనా సమయంలో పేదలకు ఏదైనా చేయాలని ఆరుగురితో ఫౌండేషన్‌ను ప్రారంభించాం. సభ్యులు క్రమంగా పెరిగారు. అందరం నిజంగా ఆపదలో ఉన్నవారికి చిన్నపాటి సాయం అందిస్తున్నాం. ఇందులో ఎంతో తృప్తి ఉంది. అందరం కలిసి మంచి నిర్ణయాలు తీసుకుంటూ పేదలకు సాయం చేస్తున్నాం. ఇంకా సభ్యులు పెరుగుతున్నారు. అందరినీ కలుపుకుంటూ భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలనేది ఆకాంక్ష.

- రవి, ఫౌండేషన్ అధ్యక్షుడు, కొండపి

సాయంతోనే స్నేహం విలువ పెరుగుతుంది



ఏదో టైంపాస్ కోసం స్నేహాలు చేయకూడదు. నలుగురికి సాయం అందించడం ద్వారా స్నేహం విలువ పెరుగుతుంది. ఫలానా వాడి స్నేహితుడు అంటే గర్వంగా ఉంటుంది. ప్రైవేటు ఉద్యోగం, అదీ చిరుద్యోగం చేసుకుంటున్నాను. అయినా నాకు తోచిన సాయం చేయడం వల్ల సంతోషంగా ఉంటోంది. ఫ్రెండ్స్ ఫౌండేషన్ సమాజంలోని పేదల కోసం చిరు సాయం అందిస్తుండటం మంచి సంప్రదాయంగా పెట్టుకుంది. ఇంకా సేవలు కొనసాగించాలి.

- ఇ.సురేష్, కామేపల్లి, ఫౌండేషన్ సభ్యుడు

సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది



ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాను. నా స్నేహితుల ద్వారా ఫ్రెండ్స్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు చేస్తోందని తెలుసుకుని గ్రూపులో చేరాను. ఆపదలో ఉన్నవారికి నా వంతు సాయం అందిస్తున్నాను. పలు కార్యక్రమాలు చేస్తున్నపుడు చాలా ఆనందంగా ఉంటోంది.

- ఆర్.సుధాకర్, ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు, వర్దినేనివారిపాలెం



మర్రిపూడి గ్రామం వ్యూ

- దేవదాయ అధికారుల నిర్లక్ష్యంతో పదేళ్లుగా మర్రిపూడి ప్రజల ఇబ్బందులు
- గ్రామం మొత్తాన్ని నిషేధిత జాబితాలో చేర్చిన వైనం
- ఆస్తులున్నా అమ్ముకోలేని దుస్థితి
- రెవెన్యూ సదస్సులో సైతం లభించని విముక్తి
- 20న మండలస్థాయి సమీక్షా సమావేశం
- అందులోనైనా పరిష్కారం లభిస్తుందని ఆశలు

భూ 'బంధనాలు' తొలగేనా?

మర్రిపూడి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం మర్రిపూడి వాసులకు శాపంగా మారింది. 40 సెంట్లలో ఆలయాలు ఉండగా అంతవరకూ కాకుండా గ్రామంలోని స్థలాలు, భూముల మొత్తాన్ని నిషేధిత జాబితాలో చేర్చడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆస్తులున్నప్పటికీ అత్యవసరానికి అమ్ముకోలేకపోతున్నారు. పదేళ్లుగా అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆర్భాటంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులలోనైనా విముక్తి లభిస్తుందని ఆశించారు. కానీ సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంతో గ్రామస్థుల్లో అసహనం పెల్లుబుకుతోంది. అధికారుల నిర్లక్ష్యంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 45 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి రెండు నెలలు కావస్తున్నా గ్రామస్థుల ఉమ్మడి సమస్య పరిష్కారంపై దృష్టి సారించకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిపోయిన క్రయవిక్రయాలు

మర్రిపూడికి సంబంధించిన 547వ సర్వే నంబరులో 43.25 ఎకరాల భూమి గ్రామ కంఠం కింద ఉంది. గ్రామమంతా ఆసర్వే నంబరులోనే అనాదిగా విస్తరించింది. 2014 సంవత్సరంలో నిర్వహించిన మీభూమి గ్రామ సభలో దేవదాయశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. 1,000కిపైగా నివాస గృహాలు ఉండే మర్రిపూడి గ్రామకంఠం భూమిని 22ఏ నిషేధిత జాబితాలో చేర్పించారు. కేవలం 40 సెంట్ల భూమిలో పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి, రాధారుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి దేవాలయాలు నిర్మితమై ఉన్నాయి. ఆ 40 సెంట్లను సబ్‌డివిజన్ చేయకుండానే గ్రామం మొత్తాన్ని నిషేధిత జాబితాలో చేర్చడంతో క్రయవిక్రయాలు నిలిచిపోయాయి.

ఆస్తులున్నా అత్యవసరానికి అమ్ముకోలేని దుస్థితి

దేవదాయ శాఖ అధికారుల అనాలోచిత నిర్ణయం కారణంగా గ్రామస్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆస్తులున్నప్పటికీ అత్యవరానికి అమ్ముకోలేకపోతున్నారు. పిల్లల విద్య, వివాహాలకు ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యం బారిన పడిన కొందరు మెరుగైన చికిత్స కోసం చేతిలో చిల్లిగవ్వ లేక మృత్యువాతపడిన ఘటనలూ ఉన్నాయి. ఈనేపథ్యంలో రెండు నెలల క్రితం 'ఆస్తులున్నా అమ్ముకోలేరు!' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమవడంతో కొంతమేర కదలిక వచ్చింది. రెవెన్యూ అధికారులు దేవాలయ భూమిని సబ్ డివిజన్ చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపి చేతులు దులుపుకున్నారు. దేవదాయశాఖ అధికారులు సైతం గ్రామ కంఠం భూమిని నిషేధిత జాబితానుంచి తొలగించేందుకు తమకు అభ్యంతరం లేదని రెవెన్యూ అధికారులకు తెలిపారు. కానీ ఇంతవరకూ నిషేధిత జాబితా నుంచి తొలగించకపోవడం గ్రామస్థులను మనోవేదనకు గురిచేస్తోంది. ఈనెల 20వ తేదీన కొండపి నియోజకవర్గ టీడీపీ కీలక నేత, రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలపై అన్నిశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో పదేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్థులు సమస్యను సత్య దృష్టికి తీసుకెళ్లేందుకు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దేవదాయశాఖ బంధనాల నుంచి మర్రిపూడి గ్రామానికి విముక్తి కల్పించాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

దీర్ఘకాలిక భూ సమస్యలను పరిష్కరించండి

- కలెక్టర్ అన్సారియాకు సీసీఎల్ఏ ఆదేశం
- కొండపి నియోజకవర్గంలో సమస్యలను ఇటీవల రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్లిన సత్య

కొండపి/టంగుటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కొండపి నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాను సోమవారం సీసీఎల్ఏ సెక్రటరీ ఎన్.ప్రభాకరరెడ్డి ఆదేశించారు. గత నెలలో రెవెన్యూ మంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశంలో కొండపి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని సమస్యలను రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య వివరించారు. ప్రధానంగా జరుగుమల్లి, కొండపి, పొన్నలూరు మండలాల్లో ఆర్ఎస్ఆర్‌లో యర్రకండ్రిక, గర్భకండ్రికగా నమోదైన భూములను రిజిస్టర్ చేసుకునే విధంగా అవకాశం కల్పించాలని కోరారు. పొన్నలూరు మండలం చెన్నిపాడుకు సంబంధించిన రెవెన్యూ రికార్డులు కనిపించకపోవడం, దీని వలన ప్రజలు పడుతున్న ఇబ్బందులను మంత్రికి సత్య వివరించారు. సర్వీస్ ఈనాం భూములను 22ఏ(1)(సి) జాబితా నుంచి తొలగించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి తగు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ ఉన్నతాధికారులను ఆదేశించారు. వాటన్నింటినీ పరిశీలించి పరిష్కరించాలని సీసీఎల్ఏ సెక్రటరీ కలెక్టర్‌ను ఆదేశించారు.



శానిటరీ అధికారులతో సమావేశంలో కమిషనర్ వెంకటేశ్వరరావు

చెత్త సేకరణపై ప్రత్యామ్నాయ చర్యలు

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : క్లీన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) కింద గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెత్త సేకరణ ఆటోలు ఆగిపోయే అవకాశాలు ఉన్నాయి. దీంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై శానిటరీ అధికారులు దృష్టి సారించాలని కమిషనర్ డాక్టర్ కే.వెంకటేశ్వరరావు శానిటరీ అధికారులను ఆదేశించారు. సోమవారం శానిటరీ అధికారులతో సమావేశం అయిన కమిషనరు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చెత్త సేకరణకు రెడ్డి అండ్ రెడ్డి ఏజెన్సీ నుంచి క్లాప్ ఆటోలు ఏర్పాటు చేయగా, అందుకు సంబంధించి అప్పట్లో జరిగిన ఒప్పందాలు, ఇతరత్రా అంశాల దృష్ట్యా వారం రోజుల్లో చెత్త ఆటోలు ఆగే పరిస్థితి ఉందన్నారు. అయితే నగరంలో ప్రజా రోగ్యం దృష్ట్యా పారిశుధ్యం మెరుగులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని తెలిపారు. అందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లవైపు ఇన్‌స్పెక్టర్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఫుట్ కార్టులు ఎన్ని ఉన్నాయి. అవసరమైతే గతంలో మాదిరిగా ట్రాక్టర్ల ద్వారా చెత్త సేకరణ జరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చే వరకు అవసరమైన ఏర్పాట్లలో సిబ్బంది పనిచేయాలని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనరు డొక్కా పెద కొండయ్య, శానిటరీ సూపర్‌వైజర్లు షేక్ బాబ్జి, పిచ్చయ్యతోపాటు ఇతర శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

చీమకుర్తిలో శాంతి కల్యాణం



మంగళసూత్రాన్ని భక్తులకు చూపిస్తున్న అర్చకులు



కల్యాణమహోత్సవంలో పాల్గొన్న భక్తులు

భారీగా హాజరైన భక్తులు

చీమకుర్తి,ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): గెలాక్సీపురంగా ప్రసిద్ధిగాంచిన చీమకుర్తి పట్టణంలో పార్వతీపరమేశ్వరుల శాంతి కల్యాణం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. పట్టణంలోని పర్వతవర్ధిని సమేత సాక్షిరామలింగేశ్వరస్వామి ఆలయప్రాంగణంలో నిర్వహించిన ఈ కల్యాణమహోత్సవంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. తొలుత స్వామివారి ఉత్సవమూర్తుల విగ్రహాలను ఊరేగింపుగా పట్టణంలోని వేణుగోపాలస్వామి మందిరానికి తీసుకువెళ్లి అభిషేకాలు, విశేషపూజలు నిర్వహించిన అనంతరం ఇసుకవాగు సెంటర్‌లో ఉన్న సాక్షిరామలింగేశ్వరస్వామి ఆలయంకు తీసుకువచ్చి కల్యాణమహోత్సవాన్ని అంగరంగా వైభవంగా జరిపారు. లోకసంరక్షణార్థం ఆలయ ప్రాంగణంలో ఏటా నిర్వహిస్తున్న ఈ 23వ శాంతి కల్యాణాన్ని ఆలయ అర్చకులు సోమరాజుపల్లి కోటేశ్వరశర్మ,రాఘవేంద్రశర్మల పర్యవేక్షణలో నిర్వహించారు.రాత్రివేళ స్వామివారి నగరోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గురుస్వామి కొండేపు అంకమ్మరావు,శివసేవకులు,భక్తులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ



పాత మార్కెట్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లిం సంఘాల నాయకులు

వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలని ముస్లిం ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పాత వక్ఫ్ విధానాన్నే కొనసాగిస్తూ అన్యాక్రాంతమైన భూములను కాపాడాలని కోరారు. ముస్లిం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పాత మార్కెట్ సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వచ్చే నెల 10నుంచి జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో వక్ఫ్ సవరణ చట్టాన్ని తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. ఎన్‌డీఏలో భాగస్వామిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం తేనున్న చట్టాన్ని ఆమోదించకుండ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పఠాన్ కరీముల్లా, న్యాయవాది కరీముల్లా, సయ్యద్ ఇస్మాయిల్, షేక్ మహ్మద్ రఫీ, సయ్యద్ హుస్సేన్, అమీర్, మహ్మద్ ఆషిక్, పఠాన్ మసూద్ ఖాన్, షేక్ షబ్బీర్, షేక్ రహమాన్, సయ్యద్‌హుస్సేన్ తదితరులు ఉన్నారు.



సంఘీభావం తెలుపుతున్న నూతన కమిటీ సభ్యులు

బీసీ ఆరామక్షేత్రాల అభివృద్ధి కమిటీ నియామకం

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : బీసీ ఆరామక్షేత్రం నూతన కమిటీని సోమవారం ఒంగోలు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కొఠారి నాగేశ్వరరావు, ప్రధాన సలహాదారుగా రాచగర్ల వెంకట్రావు, గౌరవ సలహాదారులుగా కుంచాల వెంకటేశ్వర్లు, అధ్యక్షులుగా జంపని రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా గోళ్ల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా మస్తాన్‌వలి, యలమంద, పెరంబదూరు వరలక్ష్మి, కోశాధికారిగా నాయుడు జనార్దన్‌రావు, కార్యదర్శులుగా బత్తుల కృష్ణమూర్తి, చంబళ్ళ అశోక్ కుమార్, పిల్ల మధు, సంయుక్త కార్యదర్శిగా అన్నపురెడ్డి సుధాకర్, పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.



కలెక్టరేట్ ఎదుట న్యాయం చేయాలని ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ మహిళలు

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ధర్నా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మండలం దేవరపాలెం పంచాయతీ పరిధిలోని బక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన యానాది కుటుంబంపై దాడి చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాలో గిరిజన నాయకుడు పేరం సత్యం, బహుజన నాయకులు ఇస్తర్ల శంకర్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దాసరి రవి, ఎంఆర్‌పీఎస్ నాయకుడు బల యలమందబాబులు మాట్లాడుతూ ఎస్టీ యానాది కులానికి చెందిన చేవూరి సుబ్బాయమ్మ కుటుంబంపై దాడి చేయడం దారుణంగా ఉందన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై అజయ్‌బాబు

హెల్మెట్ ధరించి తోటివారికి ఆదర్శంగా నిలవండి

సంతనూతలపాడు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి తోటివారికి ఆదర్శంగా నిలవాలని ఎస్సై వి.అజయ్‌బాబు తెలిపారు. జిల్లా ఎస్పీ ఏఆర్.దామోదర్ ఆదేశాల మేరకు సోమవారం సంతనూతలపాడులో ద్విచక్రవాహనాలు నడుపుతూ హెల్మెట్ ధరించని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. హెల్మెట్ ధరిస్తే రోడ్డు ప్రమాదాల నుంచి బయటపడతారని ఎస్సై తెలిపారు. అదేవిధంగా వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ ఇన్సూరెన్స్ పొల్యూషన్ ధ్రువీకరణ పత్రం, లైసెన్స్‌ను తప్పనిసరిగా వెంటఉంచుకోవాలని తెలిపారు. లైసెన్స్‌లేని పలువురిపై కేసునమోదులు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సాంస్కృతిక కళాజాతరను జయప్రదం చేయాలి

మార్చి 16న ఒంగోలులో జరిగే మాలల సాంస్కృతిక కళాజాతరను జయప్రదం చేయాలని మాలమహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండేలా కృష్ణ తెలిపారు.

ప్రజల అర్జీలపై దృష్టి సారించండి

జేసీ గోపాలకృష్ణ



మీ కోసంలో అర్జీదారుల సమస్యలను వింటున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజలనుంచి వచ్చే అర్జీల పరిష్కారంపై సంబంధిత శాఖల అధికారులు దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యలను జేసీ గోపాలకృష్ణకు విన్నవించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన వినతులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మీకోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యల పరిష్కారానికి శాశ్వతపరిష్కారం చూపాలన్నారు. ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటికి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలన్నారు. వచ్చిన అర్జీలను గడువులోపు పరిష్కరించాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని సూచించారు. అధికారులు ప్రతిరోజు లాగిన్ అయ్యి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలన్నారు. అర్జీలకు సరైన పరిష్కారం చూపుతూ రీ ఓపెన్ కాకుండా చూసుకోవాలని జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమలో డీఆర్వో చిన ఓబులేషు, డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, పార్థసారథి, వరకుమార్, విజయజ్యోతితో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.

● 45 ఏళ్ల నుంచి తన ఆధీనంలో ఉన్న అసైన్‌మెంట్ భూమికి ఇతరులు డీకే పట్టా తెచ్చుకున్నారని అర్థవీడు మండలం పాపినేనిపల్లికి చెందిన కే కాశయ్య ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 791లో ఐదు ఎకరాల అసైన్‌మెంట్ భూమిని 45 ఏళ్ల సాగు చేసుకుంటున్నానని, ఆ భూమిని గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి అనే మహిళ డీకే పట్టా తెచ్చుకొని తనను భూమిలోకి రాకుండా అడ్డుకుంటోందని ఫిర్యాదు చేశారు. తనకు న్యాయంచేసి ఆదుకోవాలని విన్నవించారు.

● తనను మానసికంగా వేధించడమే కాకుండా అన్యాయంగా సస్పెండ్ చేయించారని హోంగార్డు కే రమేష్ ఫిర్యాదు చేశారు. తన స్వగ్రామమైన ఉప్పుగుండూరులో పంచాయతీ స్థలం ఆక్రమించి నిర్మాణం చేపట్టడంతో దానిపై ఫిర్యాదు చేశాననే కారణంతో అనేక వేధింపులకు గురిచేశారన్నారు. 18 సంవత్సరాలుగా నిజాయితీగా సేవలు అందించానని, అందువల్ల తనకు న్యాయం చేసి ఆదుకోవాలని కోరారు.

● పెరుగుతున్న నిత్యావసర ధరలను అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి కోరారు. ధరలు పెరుగుదల వల్ల సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆహార భద్రతా చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి ధరలు తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

వినికిడి యంత్రం అందజేత

దర్శి మండలం పోతవరం గ్రామానికి చెందిన యెనుముల చిన్న ఏడుకొండలుకు జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ వినికిడి యంత్రాన్ని అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్ సెల్‌లో వృద్ధుడైన ఏడుకొండలు శ్రవణ యంత్రం(వినికిడి) కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై స్పందించిన జేసీ వెంటనే దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారి అర్చనను వెంటనే వినికిడి యంత్రం సమకూర్చాలని సూచించారు. వెంటనే వినికిడి యంత్రాన్ని సమకూర్చడంతో జేసీ గోపాలకృష్ణ అందజేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారి అర్చన తదితరులు ఉన్నారు.

నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చి మోసం

ఒంగోలు క్రైం,ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చి నగదు తీసుకొని మోసం చేసారని బాధితుడు ఎస్పీ ఏఆర్.దామోదర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదులు పరిష్కారకార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 81 మంది తమ ఫిర్యాదులు అందజేశారు. పల్నాడు జిల్లాకు చెందిన ఓ వ్యక్తి వద్ద ఒంగోలు చెందిన ఓ వ్యక్తి ఉద్యోగం పేరుతో మోసం చేసి డబ్బులు తీసుకున్నాడని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. రైల్వే ఉద్యోగం అని చెప్పి నకిలీ అపాయింట్ మెంట్ ఆర్డర్ ఇచ్చి తనను మోసం చేశాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

అదే విధంగా వాట్సప్ కాల్‌లో ఫోన్ చేసి తాము సీబీఐ అధికారులమని బెదిరించి సుమారు రూ. 36 లక్షల నగదు బదిలీ చేయించుకున్నారని కనిగిరికి చెందిన ఓ వ్యక్తి ఎస్పీకి ఫిర్యాదు చేశారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులపై పోలీసు అధికారులు చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో సీఐలు శ్రీకాంత్‌బాబు, హజరత్తయ్య, పాండురంగారావు సిబ్బంది పాల్గొన్నారు.

సంచార జాతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

నగర మేయర్ గంగాడ సుజాత



సంచారజాతుల సంక్షేమ సంఘం మహాసభలో మాట్లాడుతున్న నగర మేయర్ సుజాత

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సంచార జాతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఒంగోలు మేయర్ గంగాడ సుజాత అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లోసోమవారం సంచార జాతుల సంక్షేమ సంఘం మహాసభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు, రాష్ట్ర అధ్యక్షుడు గుండ్రెడ్డి బాలాజీ అధ్యక్షతన జరిగిన సభలో సుజాత మాట్లాడుతూ సంచార జాతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంచార జాతుల అభివృద్ధికోసం జీవో తెచ్చారన్నారు. 32 కులాలను కలిపి ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయడమే కాకుండా వృత్తి నైపుణ్యశిక్షణలు,రూ. 30వేల వంతున రుణాలు ఇచ్చిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సహకారంతో సంచార జాతులకు రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, ఆధార్ కార్డులు, రుణాలు ఇప్పించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పొగడ్త చిన్న చెంచయ్య, కేత చలపతి, రేవూరి అబ్రహం తదితరులు ఉన్నారు.

నేడు ఏడుగుండ్లపాడులో క్యాన్సర్‌పై అవగాహన

● **హాజరుకానున్న ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్**

మద్దిపాడు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి):క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన కల్పిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేయడానికి అధికారులు ఏడుగుండ్లపాడులో ఏర్పాట్లను ముమ్మరం చేశారు. మంగళవారం జరగనున్న అవగాహన కార్యక్రమంలో భాగంగా హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వెంకటేశ్వర్లు సోమవారం స్థానిక వైద్య సిబ్బందితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. గ్రామ సెంటర్‌లో ఉన్న రచ్చబండ వద్ద ప్రజలతో రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్, సినీ నటి గౌతమి క్యాన్సర్‌పై ముఖాముఖి నిర్వహిస్తారని డీఎంహెచ్‌వో తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లను స్థానిక ఎస్సై శివరామయ్యతో ఆయన చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్, స్థానిక శాసనసభ్యులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

సోమవారం ఏర్పాట్ల పరిశీలనలో గ్రామ సర్పంచ్ శిల్పా సౌందర్య, మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య శాఖ వైద్యులు శ్రావణ్ కుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు బాప్టిస్ట్ ఫీల్డ్ అసోసియేషన్ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన తెలుగుబాప్టిస్ట్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు తెలుగు బాప్టిస్ట్ ఫీల్డ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సోమవారం ఎన్నికయింది. టీబీసీసీ అధ్యక్షులు రెవరెండ్ భాగ్యానంద్, సెక్రటరీ రెవరెండ్ టి. శిఖామణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఒంగోలు ఫీల్డ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెవరెండ్ టి.దైవాదీనం, వైస్ ప్రెసిడెంట్‌గా జి.తిమోతి, సెక్రటరీగా కే. శేఖర్ బాబు, జాయింట్ సెక్రటరీగా టి. సుధాకర్, కోశాధికారిగా టి.సామ్యేల్‌ను ఎన్నుకున్నారు. కాగా కార్యవర్గ సభ్యులుగా పి. కిరణ్‌బాబు, డేవిడ్ ప్రసాద్, జాన్ పిచ్చయ్య, ఆర్. అహరోన్‌ను ఎన్నుకున్నారు. ఫీల్డ్ జనరల్ కౌన్సిల్ మెంబర్‌గా జి. రాజ్‌విమల్‌లను ఎన్నుకున్నారు.

వరిగడ్డి సరఫరాకు టెండర్లు దాఖలు చేసుకోవాలి

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): చదలవాడ వద్ద ఉన్న పశుక్షేత్రానికి వరిగడ్డి అందించేవారు ఆన్‌లైన్లో టెండర్లు దాఖలు చేసుకోవాలని క్షేత్ర డీడీ బి.రవి సోమవారం తెలిపారు. మొత్తం 100 మెట్రిక్ టన్నుల వరిగడ్డి అవసరం ఉందన్నారు. గడ్డి అందించదలచుకున్న వారు మార్చి 3 లోగా టెం డర్లు దాఖలు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు9392901049లో సంప్రదించాలని డీడీ కోరారు.

విద్యార్థుల ప్రతిభ

ఒంగోలులోని పీవీఆర్ గ్రౌండ్స్‌లో ఈ నెల 16న జరిగిన బాలోత్సవం వేడుకల్లో కనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులు సాధించారు. ఏక పాత్రాభినయంలో కోమట్ల పూజ వైష్ణవి తృతీయ బహుమతి, వ్యాస రచన, చిత్ర లేఖనం విభాగాల్లో అక్కల శివకార్తీక ద్వితీయ బహుమతులు సాధించినట్లు గైడ్ టీచర్ కె.ఝాన్సీలక్ష్మీ తెలిపారు.

ఏకేయూ వీసీని కలిసిన భూపాల్‌రెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జాతీయ స్థాయిలో విశిష్ట వ్యక్తులుగా గుర్తింపు పొందిన రాచర్ల మండలం యడవల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ఎం. రామ్‌భూపాల్‌రెడ్డి సోమవారం స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ డీవీఆర్‌మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబులను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డికి ఆంధ్రకేసరి యూనివర్శిటీ క్యాలెండర్‌ను బహూకరించారు.

22న జరిగే సెమినార్‌ను విజయవంతం చేయండి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం వ్యవస్థాపకనేత తవనం చెంచయ్య వర్ధంతి సందర్భంగా ఈనెల 22వతేదీన స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగే సెమినార్‌ను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాకార్యదర్శి కంకణాల ఆంజనేయులు కోరారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సోమవారం సెమినార్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సంపన్నులకు వరాలు చూపి సామాన్యులపై భారాలు మోపిందని ఆరోపించారు. ఆ అంశాలను చర్చ చేసి బడ్జెట్‌లో గ్రామీణ పేదలకు నిధులు పెంచే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, ఊసా వెంకటేశ్వర్లు, కేజీ మస్తాన్, వెల్లంపల్లి ఆంజనేయులు, గుమ్మా బాలనాగయ్య తదితరులు ఉన్నారు.

నేటి నుంచి నక్ష సర్వే ప్రారంభం

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణాల ఆదాయ వనరుల పెంపు, ఆర్థిక బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం పలికింది. ఈ మేరకు దేశ వ్యాప్తంగా నక్ష సర్వే కార్యక్రమాన్ని మంగళవారం లాంఛనంగా ప్రారంభించనుంది. తొలుతగా రాష్ట్రంలోని 153 నగరపాలక సంస్థలను ఎంపిక చేయగా, ఆ కార్యక్రమాన్ని మంగళవారం దేశ వ్యాప్తంగా ప్రధాని వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్. విజయ్‌కుమార్, కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, మేయగర్ గంగాడ సుజాత హాజరవుతారని కమిషనరు డాక్టర్ కే. వెంకటేశ్వరరావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీమకుర్తి,ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మర్రిచెట్లపాలెంలో 33 కేవీ కొత్తలైన్ పనులు జరుగుతున్నందున మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నాం రెండుగంటల వరకూ మర్రిచెట్లపాలెం పరిధిలోని గ్రానైట్ ఫ్యాక్టరీలు, గృహలకు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.



కొండపిలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి

● **యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సత్యవతి**

కొండపి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కార్యకర్తలకు వెంటనే వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వై.సత్యవతి డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ కొండపి, మర్రిపూడి, పొన్నలూరు మండలాల కార్యకర్తలు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సత్యవతి మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలపై పనిభారం పెరిగిందన్నారు. అందుకు తగినట్లు వేతనాలు ఇవ్వడం లేదన్నారు. సంక్షేమ పథకాలు కూడా వర్తింపచేయడం లేదని విమర్శించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం కొండపి ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఐ.పోలమ్మ, నాయకులు టి.పద్మ, రామలక్ష్మి, హైమావతి, వెంకటరమణ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరులో..

టంగుటూరు : అంగన్వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి బెల్లం శేషమ్మ డిమాండ్ చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆమె మాట్లాడారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.రాము, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కె.హేమలత, సుభాషిణి, కృష్ణవేణి, కాత్యాయని, ప్రసన్న, శకుంతల, లక్ష్మి, పద్మ, విజయ, యశోధ వరమ్మ తదితరులు పాల్గొన్నారు,



రీసర్వేను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

రీసర్వేను పరిశీలించిన జేసీ

మద్దిపాడు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలో రీ సర్వే చేస్తున్న భూములను సోమవారం జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పరిశీలించారు. కొలచనకోట గ్రామంలో ఆయన మాట్లాడుతూ భూమి యజమాని ఎవరు అని ప్రశ్నించగా హైదరాబాద్‌లో ఉంటారని సమాధానం ఇవ్వగా భూ యజమాని లేకుండా ఎట్టి పరిస్థితుల్లో సర్వే నిర్వహించరాదని ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ఎట్టి పరిస్థితులలో జాయింట్ ఎల్పిఎంలు ఇవ్వరాదన్నారు. అనంతరం గడియపూడి గార్లపాడు పునరావాస కాలనీ సమీపంలో ఉన్న బఫర్ గూడెంలో నిల్వ ఉంచిన బియ్యం బస్తాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సర్వే రికార్డుల అధికారి గౌస్ భాషా, ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, తహసీల్దార్ సుజన్ కుమార్, రఫీ, మండల సర్వేయర్ అంజనాదేవి పాల్గొన్నారు.

అదేవిధంగా గుళ్లాపల్లి గ్రామంలోని ఓం శ్రీ భావనా సాయివేర్‌హౌస్ బఫర్ గోడౌన్‌ను ఆయన తనిఖీ చేసి స్టాక్ వివరాలను పరిశీలించారు. అక్కడి బియ్యం వివరాలను పరిశీలించి, జిల్లాలోని 10 మండల స్టాక్ పాయింట్లకు వాటిని రవాణా చేయటానికి హమాలీలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అదేవిధంగా సీసీ కెమేరాలు, స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని, గోతాల నుంచి కారిపోయిన బియ్యం సేకరించి శుభ్రపరచి భద్రపరచాలని సిబ్బందికి సూచించారు.

బడ్జెట్ ప్రతుల దహనం

కొండపి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం నాయకులు సోమవారం కొండపిలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా ఈనెల 20వ తేదీ వరకు పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆందోళనల్లో ప్రజలు పాల్గొనాలని జిల్లా నాయకుడు కేజీ మస్తాన్ కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు పాల్గొన్నారు.

కోళ్ల ఫాం పరిశీలన

పొన్నలూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ వ్యాపిస్తున్న నేపథ్యంలో మండలంలోని పర్చూరివారిపాలెం గ్రామంలోని కోళ్లఫారాన్ని చౌటపాలెం పశువైద్యాధికారి శివరామకృష్ణ సోమవారం పరిశీలించారు. యజమాని శ్రీనివాసులుతో మాట్లాడి తగిన సూచనలు ఇచ్చారు.

క్రైం సమాచారం

యువకుడి అనుమానాస్పద మృతి

ఒంగోలు క్రైం,ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి):యువకుడు అనుమానస్పద రీతిలో మృతి చెందాడు. ఈ ఘటన త్రోవగుంటలోని అశోక్ లైలాండ్ షోరూం సమీపంలో జరిగింది. సుమారు 30 ఏళ్ల వయసు గల యువకుడు కాలు విరిగింది. తలపై గాయం అయింది. నోటి వెంట రక్తం వచ్చింది. రోడ్డు పక్కన మృతదేహం పడి ఉంది. ఆదివారం రాత్రి 1.30 గంటల సమయంలో మృతదేహన్ని పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలాన్ని సీఐ అజయ్‌కుమార్ తన సిబ్బందితో పరిశీలించారు. ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడం లేక, వాహనంలో నుంచి కిందకు పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అదే క్రమంలో యువకుడిని హత్య చేసి ఇక్కడ పడవేసి ఉంటారా అనే అనుమానాలు ఉన్నాయి. దీంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. ఒంగోలు తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వాహనచోదకుడు మృతి



వాయిల రాము (ఫైల్)

సింగరాయకొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడటంతో తీవ్రగాయాలై ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన పాకల రోడ్డులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పాకల పంచాయతీ పరిధిలోని క్రాంతినగర్‌కు చెందిన వాయిల రాము(40) పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని ఓ సీఫుడ్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఐదేళ్ల నుంచి సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని సాయినగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆదివారం ఆయన తండ్రి వర్థంతి కావడంతో ఉదయం సాయినగర్ నుంచి క్రాంతినగర్ వెళ్లాడు. తిరిగి రాత్రికి బైక్‌పై ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో పాకల రోడ్డులో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. అయన్ను 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. రాముకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

మంచికలపాడులో జూదరుల అరెస్ట్

చీమకుర్తి,ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచికలపాడు గ్రామ పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం పోలీసులు ఆకస్మికదాడి నిర్వహించారు.సీఐ సుబ్బారావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ దాడిలో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొన్నారు. వారి వద్దనుంచి రూ.40,500 నగదును స్వాధీనపరుచుకున్నారు.

అవీ..ఇవీ

కట్టెల ట్రాక్టర్ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి


మృతి చెందిన బాబురావు

తర్లుపాడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కట్టెల ట్రాక్టర్ ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని చెన్నారెడ్డిపల్లె సమీపంలో సోమవారం జరిగింది. ద్విచక్ర వాహనంపై చెన్నారెడ్డిపల్లె నుంచి బైకుపై తర్లుపాడు వస్తున్న గరికపాటి బాబూరావు(50)ను కట్టెల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని తర్లుపాడు ఎస్ఐ బ్రహ్మనాయుడు పరిశీలించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. మృతుడిది మీర్జపాట గ్రామానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. మృతుడికి భార్య, కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. మృతుడు చిన్నపాటి వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తాడు. బాబురావు మృతితో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు బోరున విలపిస్తున్నారు.

అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న శివాపురం గ్రామస్థులు

మార్కాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రైతుల పశువుల దొడ్ల స్థలాలను అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని పెద్దారవీడు మండలం శివాపురం గ్రామానికి చెందిన రైతులు సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన ఆనెకాళ్ల వెంకటరంగారెడ్డితో పాటు మరో పదిమంది ఎనిమిది దశాబ్దాలుగా సర్వే నెంబర్ 491లోని 87 సెంట్ల భూమిలో పశువుల పాకలు, గడ్డివాములు, ఎరువుల దిబ్బలు వేసుకొని ఉంటున్నారు. కానీ ఆనెకాళ్ల చిన్నరామిరెడ్డి, వెంకటేశ్వర్లు అనే వ్యక్తులు అక్రమంగా ఆ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారని బాధితులు ఫిర్యాదు చేశారు. తమను అక్కడనుంచి గడ్డివాములు, దొడ్లు తొలగించాలని దౌర్జన్యం చేస్తున్నారన్నారు. పూర్తిస్థాయిలో విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఇక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు మొత్తం 28 అర్జీలు దాఖలయ్యాయి. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని పలువురు అధికారులు పాల్గొన్నారు.

6వ తరగతి ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

పెద్ద దోర్నాల,ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశపరీక్ష నిర్వహణ తేదీ మార్చినట్లు గమనించాలని ప్రిన్సిపాల్ శంకర్‌సింగ్ భరద్వాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రకటించిన ప్రకారం ఫిబ్రవరి 25న నిర్వహించాల్సి ఉంది. కానీ ఉన్నతాధికారులు మార్చి 2వ తేదీకి మార్చినట్లు ఆయన తెలిపారు. పరీక్షా సమయం ఉదయం గం.11.30 నుండి గం.1.30 వరకు, స్థలం అడ్మిట్ కార్డులో తెలిపినట్లుగానే జరుగుతాయన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కంభం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కంభం బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టి.చాముండేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ప్రవేశానికి విద్యార్థులు 4వ తరగతి పాసై ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే 2012 నుండి 2014 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఇంటర్ విద్యార్థులైతే 2024-25లో 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులు తమ జిల్లాలోనే దరఖాస్తు చేసుకోవాలని, కుటుంబ సంవత్సర ఆదాయం లక్ష రూపాయలకు మించి ఉండకూడదన్నారు. దరఖాస్తు చేసుకున్నవారు 5వ తరగతి వారికి ఏప్రిల్ 6వ తేదీ ఉదయం 10 గంటల నుండి 12గంటల వరకు, ఇంటర్ విద్యార్థులకు అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి 4.30 గంటల వరకు రాతపరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థుల ఆధార్, ఫొటో, రేషన్‌కార్డు, కులధ్రువీకరణ పత్రంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 7815805491 సంప్రదించాలన్నారు.

కంభంలో మంచినీటి చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గుండయ్య

కంభం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కంభం పట్టణంలో లయన్స్‌క్లబ్ కార్య దర్శి పేర్లి గుండయ్య సోమవారం మంచినీటి చలివేంద్రాన్ని ప్రారంభించారు. డాక్ట ర్ జంపాల మల్లికార్జునరావు జ్ఞాపకార్థం బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గిద్దలూరు విద్యార్థుల అద్భుత ప్రదర్శన

- ఒంగోలులో జరిగిన బాలోత్సవంలో అవార్డుల పంట


ఎస్పీ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న విద్యార్థిని

గిద్దలూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పీవీఆర్ మున్సిపల్ హైస్కూలులో జరిగిన జిల్లాస్థాయి బాలోత్సవ ద్వితీయ పిల్లల పండుగ సందర్భంగా నిర్వహించిన పోటీలలో గిద్దలూరు విశ్వభారతి పాఠశాలకు చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనపరిచారు. 12 విభాగాలలో బహుమతులు సాధించారు. విశ్వభారతి పాఠశాలకు చెందిన విద్యార్థులు రైతేరాజు అనే జానపద నృత్యాన్ని ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు మొదటి బహుమతి లభించింది. కథ, రచన పోటీలో ప్రశాంత్‌కు మొదటి బహుమతి, విచిత్ర వేషాదారణ పోటీలో గంటా హస్వితకు ద్వితీయ బహుమతి, టైమ్స్ ప్రాజెక్టులో సైతం ద్వితీయ బహుమతి, కోలాట విభాగంలో విశ్వభారతి విద్యార్థులకు మొదటి బహుమతి, సెల్ఫీ విభాగంలో నసిఫాకు ద్వితీయ బహుమతి, మ్యాప్ పాయింటింగ్‌లో గురుచరితకు ద్వితీయ బహుమతి, ఉర్దూ వ్యాసరచన పోటీలో, వక్తృత్వ పోటీలో సైతం ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. పట్టణ వ్యవసాయం నూతన ఆవిష్కరణ విభాగంలో శివానందకు మొదటి బహుమతి లభించినట్లు కరస్పాండెంట్ రంగస్వామిరెడ్డి, ప్రిన్సిపాల్ బండారు ఆదిలక్ష్మి పేర్కొంటూ విజేతలైన విద్యార్థులను అభినందించారు.

దాడులకే ఎక్సైజ్‌శాఖ పరిమితం

- మద్యం ఇస్తున్న దుకాణాలపై చర్యలు కరువు
- అధికారుల తీరుపై ఎన్నెన్నో అనుమానాలు



గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బెల్టు దుకాణాలపై ఎక్సైజ్‌శాఖ అధికారులు గట్టిగానే చర్యలు చేపడుతున్నారు. ఇటు పోలీసులు సైతం విస్తృత దాడులు నిర్వహిస్తున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేస్తున్నారు. అయితే ఇదంతా నాణేనికి ఒక వైపు మాత్రమే. మరోవైపు ఈ బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేస్తున్న ప్రధాన దుకాణాలవైపు మాత్రం ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. దీంతో ఆ శాఖ తీరుపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఎక్సైజ్ శాఖ పరిధిలోని కొంత మంది అధికారుల తీరు వలన ప్రభుత్వ లక్ష్యం నీరుగారి పోతుందన్న విమర్శలున్నాయి. నియోజకవర్గంలో బెల్టు దుకాణాలు మద్యం అక్రమ అమ్మకాలు, సారా తయారీకి సంబంధించి వందలాది కేసులు నమోదవుతున్నాయి. వాటి మూలాలను మాత్రం అధికారులు గుర్తించలేకపోతున్నారు. మామూళ్లకు కక్కుర్తిపడి కేవలం బెల్టు దుకాణాలపై నామమాత్రంగా దాడులు చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం పాలసీని మార్చింది. అప్పటివరకు ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసింది. జిల్లాలో 217 మద్యం దుకాణాలు ఉండగా గిద్దలూరు నియోజకవర్గంలో 23 దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. బెల్టుదుకాణం లేకుండా చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అప్పటివరకు ఉన్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను రద్దు చేసి తిరిగి ఎక్సైజ్‌శాఖను పునరుద్ధరించింది. మద్యం అక్రమ రవాణా, సారా నియంత్రణే ఎక్సైజ్‌శాఖ లక్ష్యం. పోలీసులు సైతం ఇదే పనిమీద ఉన్నారు. తరచూ విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. బెల్టు దుకాణాలపై దాడులు కొనసాగిస్తున్నారు. పెద్ద ఎత్తున కేసులు నమోదయ్యాయి. ఇంత చేస్తున్నా బెల్టు దుకాణాలకు మద్యం సరఫరా చేస్తున్న మద్యం దుకాణాలపై చర్యలు తీసుకున్న దాఖలాలు మాత్రం లేవు. మద్యం దుకాణాలు దక్కించుకోవడంతోనే ఆశించిన లాభాలు రావని కొందరు వ్యాపారులు భావిస్తున్నారు. వారంతా సిండికేట్‌గా ఏర్పడి ఆయా ప్రాంతాలను గుప్పిట్లో పెట్టుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి ఒకరికి మూడు మద్యం సీసాలకు మించి మద్య సీసాలు విక్రయించరాదనే నిబంధన ఉంది. ఈ నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. నచ్చిన వారికి నచ్చినంత మద్యం ఇస్తున్నారు. దీనిపై ఎక్సైజ్ శాఖకు స్పష్టమైన సమాచారం ఉన్నా పట్టించుకోకపోవడం శోచనీయం. ఇది కూడా బెల్టు షాపులు పెరిగిపోవడానికి ఒక కారణంగా తెలుస్తోంది. బెల్టు దుకాణాలకు మద్యం సరఫరా చేస్తే దుకాణాల లైసెన్సు రద్దు చేస్తామని సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హెచ్చరించారు. దుకాణం వద్ద తాగేందుకు ప్రభుత్వం ఎటువంటి పర్మిట్ రూములకు అనుమతి ఇవ్వలేదు. అక్కడే తాగేందుకు అవకాశం ఇస్తే ప్రభుత్వానికి అదనంగా ఆదాయం వచ్చేది. అయితే ఎక్కడికక్కడే మద్యం దుకాణాల చుట్టూ తాగేందుకు అనాధికారికంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగుతున్న వారితో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఖాళీస్థలాలు, క్రీడామైదానాలు మందుబాబులకు అడ్డాలుగా మారాయి.

వైభవంగా ఆంజనేయుని విగ్రహ ప్రతిష్ఠ

ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరుటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని ఆదర్శ విద్యా సంస్థల ఆవరణలో ఆ సంస్థల అధినేత బుడత తిమ్మయ్య నూతనంగా ఏర్పాటు చేసిన 16 అడుగుల శ్రీఅభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం రెండు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హోమాలు నిర్వహించారు. పూజల్లో ఆదర్శ విద్యాసంస్థల అధినేత బుడత తిమ్మయ్య, ఆయన కుమారుడు బుడత హరికిషన్ యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్, రాష్ట్ర బీసీ నాయకులు బైలడుగు బాలయ్య, మండల, పట్టణ పార్టీ అధ్య క్షులు మార్తాల సుబ్బారెడ్డి, సయ్యద్ షానేషావలి, టీడీపీ నాయకులు పాముల వెంకటరమణ, దుత్తా బాలీశ్వరయ్య, నంది శ్రీను, రామసుబ్బయ్య, మహిళ నాయకురాలు బొంతా లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

బహుముఖ ప్రజ్ఞాశాలి ఓబులయ్య

గిద్దలూరు టౌన్ : రచయితగా, నటుడిగా, నంది అవార్డు గ్రహితగా పత్తి ఓబులయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి అని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం టీడీపీ కార్యాలయం వద్ద ఓబయ్య రచించిన సెల్ పురాణం, జగదేక సుందరి, నాటకాలను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచర్ల మండలం జేపీ.చెరువు గ్రామానికి చెందిన పత్తిఓబులయ్య గత 50 సంవత్సరాలుగా కర్నూలులో నివాసం ఉంటూ అనేక నాటకాలు, రచయితగా, నటుడిగా రాణించారన్నారు. 10కి పైగా పుస్తకాలను రాయడంతోపాటు ప్రతి సంవత్సరం నంది అవార్డులు పొందే నాటకాలను తన దర్శకత్వంలో తీసుకు రావడం మనందరికి గర్వకారణమన్నారు. రంగస్థలం ప్రముఖ నటీమనులు, రత్నశ్రీ, తిరుమలతేజలను సత్కరించి నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, యలమంద, గురుమూర్తి, పుట్టా మహేష్ తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అశోక్‌రెడ్డి

వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి). రోగులకు వైద్యం అదించడంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి వైద్యులను హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలను ఆయన సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలో స్టోర్ రూమ్‌లో వెంటిలేటర్‌లు నిరుపయోగంగా పడేసి ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐసీయూ యూనిట్‌కు తాళం వేసి ఉండడంతో వెంటనే ఓపెన్ చేయించి ఎందుకు వినియోగించడం లేదని ఆరా తీశారు. ఐసీయూలో ఏసీల కొరత కారణంగా వినియోగించలేక పోతున్నామని వైద్యులు తెలియజేశారు. దీంతో త్వరలో ఏసీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఐసీయూను అందుబాటు లోకి తీసుకురావాలని కోరారు. చిన్నపిల్లల వార్డులో పరిస్థితులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ కేంద్రానికి వెళ్లి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. మండలంలోని నికరంపల్లి వద్ద ఆదివారం మిరపకూలీల ఆటో తిరగబడి మృతి చెందిన మృతదేహాలను మార్చురీలో పరిశీలించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.


వైద్యసేవల గురించి అడిగి తెలుసుకుంటున్న నారాయణరెడ్డి

వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ



ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ

మార్కాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రకాశ వరదాయని అయిన పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణానికి వచ్చే బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.2 వేల కోట్లు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ డిమాండ్ చేశారు. వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతం పశ్చిమ ప్రకాశమన్నారు. ఈ ప్రాంతానికి వర్షాధారం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదన్నారు. దీంతో తీవ్ర కరవు ఛాయలు అలముకున్నాయన్నారు. ఈ ప్రాంతం భవిష్యత్తులో ఎడారిగా మారే ప్రమాదకర పరిస్థితి ఉంద ని శాస్త్రవేత్తలు చెబుతున్నా రని అన్నారు. శాశ్వత పరిష్కారం వెలిగొండతోనే సాధ్యమన్నారు. గత 29 సంవత్సరాలుగా నిర్మాణం కొనసాగుతున్న ప్రాజెక్టు ఏదైనా ఉందంటే అది వెలిగొండ మాత్రమేనన్నా రు. అధికారంలో ఎవరు న్నా కల్లబొల్లి మాటలు చెప్పి కాలయాపన చేస్తున్నారే తప్ప ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చిత్తశుద్ధి చూపడంలేదన్నారు. కూటమి ప్రభుత్వం వెలిగొండను పూర్తిచేస్తామని గద్దెనెక్కిందన్నారు. వచ్చే వార్షిక బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలన్నారు. మరీ ముఖ్యంగా ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసిత గ్రామాల ప్రజలకు పరిహారం అందజేయాలన్నారు. ప్రాజెక్టు పట్ల నిర్లక్ష్యంవహిస్తే భవిష్యత్తులో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వి.హనుమారెడ్డి, పార్టీ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య, జిల్లా నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె ఖాశిం, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాణాల రామయ్య, డాక పుల్లయ్య, పి.కొండయ్య, చిత్తారి పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

- తహసీల్దార్ శాంతికి వినతిపత్రం అందజేత


తహసీల్దార్‌ను వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం తహసీల్దారు కిన్నెర శాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కనీసవేతనం రూ.20 వేలు ఇవ్వాలని, గ్రాట్యూటి అమలు చేయాలని, సంక్షేమ పథకాలు అంగన్‌వాడీలకు వర్తింజేయాలని, మినీఅంగన్‌వాడీలను మెయిన్ అంగన్ వాడీలుగా మార్చాలని, పెండింగుకోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వై సుబ్బమ్మ, వెంకటరత్నమ్మ, రాజేశ్వరీ, వెంకటలక్ష్మీ, ముంతాజ్‌బేగం, పద్మ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

గిద్దలూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): డిమాండ్ల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట నేలపై బైటాయించి ధర్నా చేశారు. అంగన్‌వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు డి.స్వర్ణకుమారి, కార్యదర్శి ఎ.మున్నా మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీని అమలు చేయాలని, మిని సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జిఒ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు విజయలక్ష్మి, బాలమ్మ, రమణమ్మ, సీఐటీయూ నాయకులు ఆవులయ్య, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

సమస్యలను పరిష్కరించాలి

గిద్దలూరు టౌన్ : అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరింప చేయాలని బేస్తవారపేట ఐసిడిఎస్ కార్యాలయ పరిధిలోని అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు సరళ, సెక్రటరీ సుబ్బమ్మ, ఎఐటియుసి నాయకులు స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. హామీ ఇచ్చిన విధంగా కూటమి నేతలు సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుని ఏర్పాట్లు చేయాలని ఆవినతిపత్రంలో పేర్కొన్నారు.

జీతాలు పెంచాలని ధర్నా

ఎర్రగొండపాలెం : చాలిచాలని జీతాలతో పనిచేయలేమని, తాము చేస్తున్న పనికి తగ్గట్టుగా జీతాలు పెంచాలని సోమవారం ఎర్రగొండపాలెంలో ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు అంగన్వాడీవర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గత ప్రభుత్వంలో సమ్మె చేసినప్పటికీ, అప్పటి ముఖ్యమంత్రి స్పందించలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జీతాలు పెంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెప్పారన్నారు. తమ సమస్యను గుర్తించి పరిష్కరించాలని కోరారు. అనంతరం సీడీపీవోకు, తహసీల్దార్ కార్యాలయంలోనూ వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సీఐటీయూ డివిజన్ నాయకులు రఫీ, అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు మల్లేశ్వరి, కార్యదర్శి అరుణకుమారి, సుబాషిణి, సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లమలలో నిలిచిన ట్రాఫిక్

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : నల్లమల్ల అటవీప్రాంతంలో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై సోమవారం అర్థరాత్రి వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఈ ఘటన కొర్రపోలు- రోళ్లపెంట మధ్యలో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్నూలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బ్రేక్ ఫెయిల్ కావడంతో రోడ్డుకు అడ్డంగా తిరిగింది. ఈ క్రమంలో రెండు వైపుల వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి. పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి వెళ్లి ట్రాఫిక్ క్రమబద్ధీకరించే చర్యలు చేపట్టారు. అర్ధరాత్రి సమయంలో బస్సును రోడ్డుకు పక్కకు తీసుకురావడంతో వాహనాల రాకపోకలు యథాతథంగా కొనసాగాయి.

ఏకేయూ వీసీని కలిసిన భూపాల్‌రెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జాతీయ స్థాయిలో విశిష్ట వ్యక్తులుగా గుర్తింపు పొందిన రాచర్ల మండలం యడవల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ఎం. రామ్‌భూపాల్‌రెడ్డి సోమవారం స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ డీవీఆర్‌మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబులను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డికి ఆంధ్రకేసరి యూనివర్శిటీ క్యాలెండర్‌ను బహూకరించారు.

విష్ణుమూర్తి అలంకరణలో వేణుగోపాలుడు

తర్లుపాడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులో వెలసిన శ్రీ రుక్మిణి సత్యభామ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం గరుడ వాహనంపై మహావిష్ణువు అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. కారంపూడి వెంకట రమణాచార్యులు, కూనపులి వెంకటశర్మ, మోహన్ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవమూర్తులను రథంపైకి తీసుకొచ్చి తర్లుపాడు పురవీధుల్లో మేళతాళాలతో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు వార్లుపోసి కాయాకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదాతలు జవ్వాజి విజయభాస్కర్‌రావు, ధర్మపత్ని శేషుకుమారి, జవ్వాజి సాయికృష్ణ, ధర్మపత్ని హేమసాయి లక్ష్మీలు స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, వివిధ వాహనాల ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

నదీశ్వరుడి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ

గిద్దలూరు : రాచర్ల మండలం సురభేశ్వరకోన దేవస్థానంలో నందీశ్వర విగ్రహ ప్రాణప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గతంలో గుప్తనిధుల కోసం నందీశ్వర విగ్రహాలన్ని తవ్వి చివరకు విగ్రహాన్ని కూడా అపహరించిన విషయం తెలిసిందే. దాంతో భక్తులు, కమిటీ ప్రతినిధులు అదేస్థానంలో నందీశ్వర విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను ప్రత్యేక పూజలతో నిర్వహించారు. దొంగతనాల నివారణ కోసం బీజేపీ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్ ఆధ్వర్యంలో పలువురు దాతలు, జనసేన, టీడీపీ నాయకులు దేవస్థానానికి రెండు సీసీ కెమెరాలు అందజేశారు. ఆయా కార్యక్రమాలలో జనసేన అధ్యక్షులు బాలకృష్ణ, చిన్ని సేవాసంస్థ అధ్యక్షులు శ్రీకాంత్, దేవస్థాన కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో జగదాంబ, పూజల్లో పాల్గొన్న భక్తులు

గిద్దలూరు : రాచర్ల మండలం అనుమలపల్లి గ్రామంలో శ్రీజీవనమూర్తిస్వామి జెండా మహోత్సవ వేడుకలు సోమవారం అత్యంత వైభవంగా నిర్వ హించారు. స్వామి వారికి భక్తులు పెద్దఎత్తున పూజలు నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి స్వామి వారి జెండా మహోత్సవంలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఎడ్ల బలప్రదర్శన పోటీలను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రారంభించారు. పెద్దఎత్తున భక్తులు రావడంతో ఆకవీడు రోడ్డుకు వెళ్లే వాహనాలను పోలీసులు ఇతర గ్రామాల వైపు మళ్లించారు. కార్యక్రమంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షులు కె.యోగానంద్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కుప్పా రంగ నాయకులు, టీడీపీ నాయకులు రెడ్డి కాశిరెడ్డి, జీవనేశ్వర్‌రెడ్డి, వెంకటపతి, కాశయ్య, శ్రీనివాసరెడ్డి, తదితరులతో పాటు కూటమి నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం పట్టణంలో వెలసిన జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో జగదాంబ అష్టమ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు రెంటచింతల వరుణ్‌తేజశర్మ వేకువజామున అమ్మ వారికి పంచామృత విశేష అభిషేకాలు, శ్రీచక్ర సహిత కుంకుమార్చన 108 మంది మహిళా భక్తబృందంతో లలిత సహస్ర నామస్తోత్ర పారాయణం, లక్ష పుష్పార్చణ నిర్వహించారు. మార్కండేశ్వరస్వామికి అర్చకులు ఆంజనేయశర్మ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.


గరుడ వాహనంపై వేణుగోపాలుడు

పెద్దదోర్నాల : స్థానిక శ్రీ చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయంలో శివస్వాములు విళక్కి మహోత్సవ వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు బిదరే రాంప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ఉభయదాతలు రావికింది లక్ష్మీ నరసింహారావు, గోనుగుంట్ల అరవింద్ దంపతులు ఆదిదంపతులు శివపార్వతీదేవి అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక రథంపై గౌరీశంకరుల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో శివస్వాములు శంకర్‌రెడ్డి, పండు, ఆర్.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ముండ్లమూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపాడు - పోలవరం మధ్య ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈప్రమాదంలో గాయపడిన పోలవరం గ్రామానికి చెందిన రెడ్డెం నరసింహారెడ్డి, వగ్గంపల్లి మురళీలను ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. క్షతగాత్రులు ముండ్లమూరు నుంచి పోలవరంకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. ఈక్రమంలో వేంపాడు సమీపంలో అద్దంకి వైపు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడినవారిని అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఒంగోలుకు తరలించారు.

ఆటో ఢీకొని ..

ముండ్లమూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగనపాలెంకు చెందిన గుడిపాటి శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలయ్యాయి. అద్దంకి వైపు వెళుతున్న ఆటో మోటారు సైకిల్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108లో అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

విద్యుత్ మోటార్ చోరీ

పామూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురంలో నాలుగు రోజుల క్రితం వీరంరెడ్డి మస్తాన్‌రెడ్డికి చెందిన పొలంలో ఉన్న విద్యుత్ మోటార్‌ను చోరీ చేసినట్టు బాధిత రైతు తెలిపారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి మరో మోటార్ కూడా చోరీకి గురైంది. పోలీసు శాఖ తగు చర్యలు తీసుకొని దొంగతనాలకు నివారించాలని బాధిత రైతు కోరుతున్నారు.

కెనరా బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

తాళ్లూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంకు సేవలను ఖాతాదారులు వినియోగించుకోవాలని ఆబ్యాంకు మేనేజర్ పి.ధర్మసాయి తెలిపారు. డిపాజిట్ వారోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం తాళ్లూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఈసందర్భగా మేనేజర్ మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. ఖాతాదారులు, ప్రజలు బ్యాంక్‌కు సహకరించి డిపాజిట్లు పెంచాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రవల్లిక, ఫీల్డ్ ఆఫీసర్ అరవింద్, బ్యాంక్ మిత్ర, గోల్డ్ అప్రైజర్ జి.సురేష్ , తదితరులు పాల్గొన్నారు.

భూనష్టపరిహారంపై రెవెన్యూ శాఖ తాత్సారం

పామూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పామూరులోని శ్రీమదన వేణుగోపాలస్వామి, శ్రీవల్లీ భుజంగేశ్వరస్వామి దేవస్థానాలకు సంబంధించిన భూములలో జాతీయ రహదారి నిర్మాణంతో నష్టపరిహారం రూ.కోటి 95 లక్షలు విడుదలపై రెవెన్యూ శాఖ తాత్సారం చేస్తుందని విమర్శలు వస్తున్నాయి. ఆరు సంవత్సరాల క్రితం రెవెన్యూ రికార్డుల ఆధారంగా అప్పటి అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం హైవే అథారిటీ జాయింట్ కలెక్టర్ ద్వారా నష్టపరిహార అవార్డు ప్రకటించారు.

అయితే, ఇంతవరకు దేవస్థాన ఖాతాలో నగదు జమ చేయలేదు. దీనిపై అప్పట్లో దేవస్థాన పాలకమండలి సభ్యులు మంత్రులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా నష్టపరిహార సొమ్మును దేవాలయ ఖాతాలో జమయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని పాలకమండలి సభ్యులు, భక్తులు కోరుతున్నారు.

జ్ఞానజ్యోతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

తాళ్లూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జ్ఞానజ్యోతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో జి.సుబ్బయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 18 నుండి 20 వరకు మొదటి విడతగా, 22నుండి 25 వరకు రెండవవిడత జ్ఞానజ్యోతి కార్యక్రమ నిర్వహణపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణతరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణకు హాజరయ్యే అంగన్‌వాడీ టీచర్లకు భోజనవసతి, రవాణ ఖర్చులు చెల్లిస్తున్నట్టు చెప్పారు.

ఐసీడీఎస్ సీడీపీవో భారతి మాట్లాడుతూ మండలంలోని అన్నిగ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు తప్పనిసరిగా శిక్షణలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఎల్.సుధాకర్‌రావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, సీఆర్‌పీలు శ్రీమన్నారాయణ, చంద్రిక, శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించనివారికి పెట్రోల్ పోయొద్దు!

పామూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు పెట్రోల్ పోయవద్దని సీఐ ఎం.భీమానాయక్ సూచించారు. సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో పెట్రోల్ బంకుల నిర్వాహకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ హెల్మెట్‌లు ధరించాలన్నారు. నిబంధనలు పాటించకుండా హెల్మెట్ ధరించని వారికి పెట్రోల్ పోయవద్దని చెప్పారు. లూజ్ పెట్రోల్ విక్రయాలను ప్రోత్సహించవద్దన్నారు. సమావేశంలో ఎస్ఐ టి.కిశోర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

- నూతన విద్యా విధానం అమలు
- మారనున్న రూపురేఖలు
- పెరగనున్న ఉన్నత పాఠశాలలు

కురిచేడు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యా విధానంలో మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పాఠశాల సముదాయాలు కొత్తరూపు సంతరించుకోనున్నాయి. విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలన్న లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సమూలంగా పునర్ వ్యవస్థీకరించింది. ప్రతి క్లస్టర్‌లో ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్యలో ఏకరూపత ఉండేలా నూతన సముదాయాలు ఏర్పాటుకానున్నాయి. దీంతో కురిచేడు మండలంలో విద్యా వ్యవస్థ రూపురేఖలు మారనున్నాయి. ఈ నూతన విద్యావిధానంతో ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య పెరగంతో పాటు డ్రాపౌట్స్ సంఖ్య తగ్గే అవకా శాలున్నాయి.

కురిచేడు మండలంలో 51 ప్రాథమిక, ఆరు ప్రాథమికోన్నత, ఆరు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 1నుంచి 2వతరగతి వరకు 529 మంది, 3 నుంచి 5 వరకు 995 మంది, 3 నుంచి 10 వరకు 5470 మంది విద్యార్థులు ఉన్నారు. గత సంవత్సరం వరకు ప్రాథమిక పాఠశాలల్లో 1, 2 తరగతులు ఉంచి మూడో తరగతి నుంచి ఉన్నత పాఠశాలల్లో చేర్చారు. దీంతో విద్యార్థులు తమ గ్రామానికి దూరంగా ఉన్న ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి రావడంతో డ్రాపౌట్స్ పెరిగింది. నేడు మారనున్న విద్యావిధానంతో ఉన్నత పాఠశాలల సంఖ్య పెరగడంతో ఉన్నత విద్యకు ఆవకాశాలు మెండుగా ఉన్నాయి.



వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

నూతన విద్యావిధానంలో 1 నుంచి 2 వరకు ఫౌండేషన్ పాఠశాలలు 14 ఏర్పాటు కానున్నాయి. 1 నుంచి 5 వరకు బేసిక్ ప్రాథమిక పాఠశాలలు 17 ఏర్పడనున్నాయి. 1 నుంచి 5 వరకు మోడల్ ప్రాథమిక పాఠశాలలు 19 ఏర్పాటు కానున్నాయి. 6 నుంచి 10 వరకు ఉన్నత పాఠశాలలు 9 ఏర్పాటు కానున్నాయి. మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో ఐదుగురు ఉపాధ్యాయులు ఉండనుండటంతో ఆ పాఠశాలల్లో విద్యా విధానం బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

మండలంలోని పడమర వీరాయపాలెం, నమశ్శివాయపురం, పడమరగంగవరం గ్రామాల్లో ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నత పాఠశాలలుగా మారనున్నాయి. కురిచేడు ఉర్దూ, ఆవులమంద, పడమర నాయుడు పాలెం ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలు మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా మారనున్నాయి. ఈ పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఐదుగురు ఉపాధ్యాయులు ఉంటారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది. ఉన్నత పాఠశాలల నుంచి 3,4,5 తరగతులను విడదీయడంతో అవి ప్రాథమిక పాఠశాలల్లో విలీనం కానున్నారు. ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10 తరగతులు మాత్రమే ఉండనున్నారు. ఈ విధానం విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

మండలంలో ఆరు క్లస్టర్లు ఉండగా, నేడు మూడు క్లస్టర్లుగా మారుతున్నాయి. వైఆర్ జడ్పీ, బాలికల ఉన్నత పాఠశాల, దేకనకొండ, పొట్లపాడు, కల్లూరు, పడమర నాయుడు పాలెం ఉన్నత పాఠశాలలు క్లస్టర్ పాఠశాలలుగా ఉన్నాయి. నూతన విద్యా విధానంలో క్లస్టర్ల సంఖ్య కుదించి ఉపాధ్యాయులకు మంచి శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం దృష్టిసారించింది. అందుకనుగుణంగా మండలంలో ఆరు క్లస్టర్లను మూడింటికి కుదించారు.

వైఆర్ జడ్పీ, కల్లూరు, పొట్లపాడు ఉన్నత పాఠశాలల్లో క్లస్టర్లు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు ఉన్నతాధికారులకు పంపారు. దీంతో ఉపాధ్యాయులకు మంచి శిక్షణ అందనున్నది. మండలంలో ఇప్పటివరకు 233 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. నూతన విద్యావిధానంతో ఉపాధ్యాయుల సంఖ్య 293 మందికి పెరగనున్నది. దీంతో 60 మంది ఉపాధ్యాయుల కొరత ఉంటుంది. తద్వార మండలానికి 60 మంది ఉపాధ్యాయులు కొత్తగా రానున్నారు. ప్రభుత్వం మెగా డీఎస్సీతో నూతన ఉపాధ్యాయులను నియమిస్తుందని ప్రకటనలు వెలువడుటంతో నిరుద్యోగుల్లో ఆశలు, తమ పిల్లలకు మంచి విద్య అందుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశాభావంతో ఉన్నారు. ఏదిఏమైనా నూతన విద్యా విధానం విద్యార్థులకు మంచి గుణాత్మక విద్యను అందించడానికి సిద్ధం అవుతున్నది.

నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- త్వరితగతిన బాలికల హాస్టల్‌ను పూర్తిచేయాలి
- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

పామూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బాలికల హాస్టల్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి, సకాలంలో పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పామూరులోని పాత ఆస్పత్రి ప్రాంగణంలో రూ. కోటి 94 లక్షల నిధులతో బాలికల వసతి గృహం నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఈఈ మన్నయ్యతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆరు నుంచి ఇంటర్ విద్యను అభ్యసించే బాలికల కోసం ఏర్పాటుచేసే వసతి గృహాన్ని అన్ని సౌకర్యాలతో నిర్మిస్తున్నట్టు చెప్పారు. రానున్న విద్యా సంవత్సరంలో దీనిని పూర్తి చేయాలని సూచించారు. అలాగే, స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్‌లో రూ.8 లక్షలతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే కాంట్రాక్టర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమాల్లో యారవ శ్రీను, బొల్లా నరసింహారావు, మద్దిశెట్టి రవి, సయ్యద్ అమీర్‌బాబు, ఆర్‌ఆర్ రఫి, వై.ప్రసాద్‌రెడ్డి, షేక్ ఖాజారహంతుల్లా, డీవీ మనోహర్, ఉప్పలపాటి హరిబాబు, ఇర్రి కోటిరెడ్డి, పందిటి హరీష్, పువ్వాడి రామారావు, డోలా శేషు, షేక్ హాజీగౌస్, మెంటా నరసింహారావు, పిడుగు శ్రీను, బండ్ల నారాయణ, వాయినేని రాఘవ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేవీ రమణయ్య, జనసేన జిల్లా కార్యదర్శి వై.రహీముల్లా, పంచాయతి కార్యదర్శి జీవీ అరవింద, సమగ్రశిక్ష ఏఈ జి.ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



బాలికల హాస్టల్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కాగా, కనిగిరిలోని డయాలసిస్ కేంద్రం ఆధునికీకరణ కోసం పామూరు పట్టణానికి చెందిన టీడీపీ మైనార్టీ సంఘం నాయకులు షేక్ షంషూర్ రూ.25 వేల నగదును ఎమ్మెల్యే ఉగ్రకు అందజేశారు.

డీఎల్‌డీవోపై ఫిర్యాదు

పామూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పామూరు చెత్త సంపద కేంద్రంలో శనివారం జరిగిన స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న డీఎల్‌డీవో కె.శ్రీనివాసరెడ్డి హేళనగా మాట్లాడారని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రకు ఫిర్యాదుచేశారు. చెత్త సంపద కేంద్రంలో కాంట్రాక్ట్ శానిటరి మేస్త్రీగా విధులు నిర్వహిస్తున్న దివ్యాంగుడైన షేక్ ఈమాంసాను విధుల్లోకి రావద్దంటూ హేళనగా మాట్లాడారని పంచాయతీ కార్యదర్శి జీవీ అరవింద, ఈమాంసాలు తెలిపారు. బాలికల వసతి గృహం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ఉగ్రకు సచివాలయం సిబ్బంది ఫిర్యాదు చేశారు. దివ్యాంగుడిని పనిలో ఎలా పెట్టుకొన్నారని కార్యదర్శిపై మండి పడ్డారని తెలిపారు. రాజకీయ నాయకులు చెబితే పెట్టుకొన్నామని చెప్పగా ఎంపీ, ఎమ్మెల్యేలు చెప్పేది ఏమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. సచివాలయ. సిబ్బందికి సెలవులు ఇవ్వడానికి పంచాయతీ కార్యదర్శి ఏం అధికారం ఉందని డీఎల్‌డీవో పేర్కొన్నారని తెలిపారు. ఇంటి పన్నుల టార్గెట్ పూర్తి చేయకుండా కార్యాలయంలో బాతాఖాని చేస్తున్నారా అంటూ మండిపడ్డారని ఫిర్యాదుచేశారు.

పాలకుల వైఫల్యంతోనే జిల్లా వెనుకబాటు

- వలసలు, కరువును నివారించాలంటే వెలుగొండ పూర్తి చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య

కనిగిరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పాలకులు వైఫల్యంతోనే ప్రకాశం జిల్లా వెనుకబడిపోయి వలసలు, కరువులో ముందుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.రెండు వేల కోట్లు కేటాయించి, నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని కోరుతూ సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భగా సీపీఐ జిల్లాకార్యవర్గ సభ్యుడు యాసిన్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఈశ్వరయ్య మట్లాడారు. 1996లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారన్నారు. నాలుగుసార్లు ఆయన సీఎం హోదాలో ఉండి ప్రాజెక్టును పూర్తిచేయలేక పోయారని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీ ఇచ్చిని జగన్‌మోహన్‌రెడ్డి కూడా పూర్తి చేయలేకపోయారన్నారు. కనిగిరి ప్రాం



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు గుజ్జుల ఈశ్వరయ్య

తంలో వలసలు ఆగిపోవాలంటే బీళ్ళ భూములన్నీ సాగులోకి రావాలన్నారు. అందుకు వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేయటంతోనే సాధ్యమవుతుందని చెప్పారు. సీపీఐ జిల్లాకార్యదర్శి వర్గ సభ్యుడు వై.రవీంద్రబాబు మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టుకు వెంటనే నిధులు కేటాయించాలన్నారు. దాంతో పాలేటిపల్లి, మోపాడు, పునుగోడు, గొల్లపల్లి రిజర్వాయర్‌లకు నీరు అందుతుందన్నారు. తద్వార ఈ ప్రాంతంలో భూములన్నీ సాగులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌వెంకట్రావు, వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డికి అందజేశారు.

రైతులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు

- కేంద్ర, రాష్ట్ర పథకాలకు తప్పనిసరి
- ముమ్మరంగా నమోదు ప్రక్రియ

దొనకొండ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆధార్‌కార్డు, విద్యార్థులకు ఆపార్‌కార్డు మంజూరు చేసిన విధంగానే రైతులకు 11 అంకెల ప్రత్యేక గుర్తింపు కార్డు జారీ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ఇందులోభాగంగా మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో వ్యవసాయశాఖ సిబ్బంది గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఏపీఎఫ్ఆర్(ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజస్ట్రీ) రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

నమోదు చేసే విధానం

గ్రామాల్లోని రైతులు ఫార్మర్ రిజస్ట్రీలో నమోదు చేసుకునేందుకు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డుతో లింక్ అయిన ఫోన్‌తో రైతు సేవా కేంద్రానికి వెళ్లాలి. అక్కడ వ్యవసాయశాఖ సిబ్బంది ఆన్‌లైన్‌లో రిజస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు. రైతు మొబైల్ నెంబర్‌కు మూడుసార్లు వచ్చే ఓటీపీ ఆధారంగా ఈ ప్రక్రియ పూర్తవుతుంది.



రైతు సేవా కేంద్రంలో రిజస్ట్రేషన్ చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

ఏపీఎఫ్ఆర్‌తో ఉపయోగాలు

ఏపీఎఫ్ఆర్‌లో 11 అంకెల కార్డులు పొందిన రైతుల పేర్లు ఆయా రైతుసేవా కేంద్రాల్లో రిజస్ట్రేషన్ అవుతాయి. రైతులకు చెందిన భూముల పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయి. నమోదు పూర్తి చేసుకున్న రైతులకు పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీలపై వ్యవసాయ యంత్ర పరికరాలు, రాయితీలపై సూక్ష్మ పోషకాలు, సూక్ష్మసేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం తదితర పథకాల్లో రైతులు నేరుగా లబ్ధిపొందే అవకాశం కలుగుతుంది. కరువు, వర్షాభావంతో పంటలు నష్టపోతే ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ పరిహారం కూడా రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమచేసేందుకు ఏపీఎఫ్ఆర్ రిజస్ట్రేషన్ ఎంతో ఉపయోగపడుతుంది.

ప్రభుత్వ పథకాలకు గుర్తింపు కార్డు తప్పనిసరి



లక్ష్మీనారాయణ, ఏవో దొనకొండ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఏపీఎఫ్ఆర్ రిజస్ట్రేషన్ నమోదు రైతులకు ఎంతో ఉపయోగకరం. మండలంలోని 14 సచివాలయాల పరిధిలో ఇప్పటికే 1461 మంది రైతులకు నమోదు చేశాం. ప్రభుత్వ పథకాలు పొందాలంటే రైతులు తప్పనిసరిగా 11 అంకెల ఏపీఎఫ్ఆర్ కార్డులు పొందాలి. ప్రస్తుతం ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సెటిల్‌మెంట్ భూములున్న రైతులకే రిజస్ట్రేషన్ చేస్తున్నాం. అసైన్‌మెంట్ భూములున్న రైతులకు త్వరలో ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసే అవకాశం ఉంది. గ్రామాల్లో వ్యవసాయ సిబ్బందిని రైతులు సంప్రదించి రిజస్ట్రేషన్ చేసుకోవాలి.

బీసీ రుణాల కోసం దరఖాస్తుల పరిశీలన

ముండ్లమూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందినవారు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బీసీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ పత్రాలను సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆర్.జనార్దన్ సమక్షంలో ముండ్లమూరు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ అధికారులు పరిశీలించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న దరఖాస్తులు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించారు. ఉమా మహేశ్వర అగ్రహారం, పోలవరం, ముండ్లమూరు, శంకరాపురం, వేంపాడు, నాయుడుపాలెం గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులు హాజరయ్యారు.

నారాయణస్వామి దేవస్థాన ఆదాయం రూ.లక్షా 25 వేలు

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం శ్రీనారాయణస్వామి ఆదివారం ఆదాయం రూ.1,25,512 లు వచ్చినట్లు ఈవో నరసింహాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.52,190. లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.22,410, అన్నదాన విరాళాల ద్వారా రూ.34.364, పంచామృత అభిషేకం విరాళాం ద్వారా రూ.16,548 వచ్చినట్లు ఈవో తెలిపారు.



భోజనం రుచి చూస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): భోజనం ఎలా ఉంది తల్లీ అంటూ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి విద్యార్థినిని ప్రశ్నించారు. సోమవారం నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ క్రమంలో మండలంలోని కంచర్లవారిపల్లి హైస్కూల్‌ను సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం (డొక్కా సీతమ్మ పథకం) ఏవిధంగా అమలు జరుగుతుందో పరిశీలించారు. నేరుగా భోజనం వడ్డించే వద్దకు వెళ్ళిన ఎమ్మెల్యే ఓ విద్యార్థిని ప్లేట్‌లో ఉన్న అన్నం తీసుకుని భుజించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం హైస్కూల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న హాస్టల్ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్స్‌ను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలి

కనిగిరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ ఏఐటీయూసీ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈమేరకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా యూనియన్ మహిళలు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ శాఖామంత్రి నారా లోకేష్ అంగన్‌వాడీ వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. వచ్చే శాసనసభ సమావేశాల్లో తీర్మానం చేసేలా కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో 45 రోజులపాటు అంగన్‌వాడీ వర్కర్‌లు చేసిన సమ్మెకాలంలో వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శైలజ, కుమారి, దీపిక, పద్మ, జులేఖ, దుర్గా, స్వాతి, దేవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ లలిత్‌సాగర్‌కు ఉత్తమ అవార్డు

దర్శి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ యూరాలజీ వైద్యంలో ఉత్తమ సేవలందించినందుకు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే టైమ్స్ ఐకానిక్ ఆఫ్ హెల్త్ కేర్ అవార్డును ఆయన దక్కించుకున్నారు. రాష్ట్రంలో కిడ్నీ సర్జన్‌గా ఆయన ఐదో స్థానంలో నిలిచారు. ఇప్పటి వరకు మొత్తం ఏడువేల ఆపరేషన్లు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. విశాఖపట్టణంలో జరిగిన టైమ్స్ మెగా కార్యక్రమంలో కేంద్ర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు చేతుల మీదుగా డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ ఉత్తమ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో ఆయన సతీమణి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా డాక్టర్ కడియాల లలిత్ సాగర్ మాట్లాడుతూ ఈ అవార్డు రావటం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తానని చెప్పారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. పలువురు టీడీపీ నాయకులు ఆయనను అభినందించారు.



కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ కడియాల లలిత్‌సాగర్. పక్కన డాక్టర్ లక్ష్మి

వెలిగొండకు రూ.2వేల కోట్లు కేటాయించాలి

దొనకొండ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు ఈ ఏడాది ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించి మొదటి టన్నెల్ ద్వారా నీరు విడుదల చేయాలని రైతు సంఘం మండల నాయకుడు చిరుపల్లి అంజయ్య డిమాండ్ చేశారు. దొనకొండలోని పలు ప్రాంతాల్లో రైతులతో కలిసి సోమవారం కరపత్రాలు ఆవిష్కరిస్తూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ ప్రాజెక్టు శంకుస్థాపన చేసి 30 సంవత్సరాలు గడుస్తున్నా కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ ప్రచారం కోసం, ఓట్లకోసం ఉపయోగించుకోవటం తప్ప నిధులు కేటాయించి పూర్తిచేయాలనే చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 20న తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు పి.కోటయ్య, కె.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు దాసరి కోటేశ్వరరావు, మట్టి కొండయ్య, మేకల దావీదు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరుచేయాలి


సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర నాయకుడు ఊసా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సీఎస్‌పురం తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇళ్ల స్థలాల కోసం ఎన్నో ఏళ్లుగా పేదలు అర్జీలు పెట్టుకుంటున్నా పట్టించుకోవడంలేదన్నారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఊసా రాజ్యం, గుర్రం లక్ష్మయ్య, పోలా అన్నయ్య, తిరుపతమ్మ, నాగమ్మ, సీఐటీయూ కార్యకర్తలు అంకంరావు, కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కూల్చివేస్తామంటే మేమెలా బతకాలి



ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న బాధితులు

కనిగిరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు కూలదోస్తామంటూ మిషన్లు తీసుకువచ్చి బెదిరిస్తుంటే మెమెలా బతకాలి అంటూ రైల్వేలైన్ నిర్వాసిత బాధితులు ఆర్డీఓ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బాధితులు మాట్లాడుతూ 25 ఏళ్ళుగా ప్రభుత్వం కేటాయించిన డీకే పట్టా భూమిలో ఇళ్ళు నిర్మించుకుని కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్‌లో ఏడు గృహాలకు చెందిన స్థలాలు పోతున్నాయన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఖాళీ చేయాలంటున్నారని వాపోయారు. ఇటీవల జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే వచ్చినపుడు తమ సమస్యను విన్నవించటంతో స్థలం కేటాయించి ఇళ్ళు కట్టించే ఏర్పాటు చేస్తామని చెప్పినట్లు ఆర్డీవోకు వివరించారు. అప్పట్లో గ్రామ రెవెన్యూ అధికారి ప్రస్తుత స్థలంలో ఇళ్ళు లేవని నివేదిక ఇవ్వటం ఎంతవరకు సబబు అని అన్నారు. ప్రభుత్వమే పట్టాలు మంజూరు చేసినప్పుడు తప్పుడు నివేదిక ఎలా ఇస్తారని బాధిత మహిళలు ప్రశ్నించారు. ప్రజాసంఘాల నేతలు బడుగు వెంకటేశ్వర్లు, పీవీ శేషయ్యలు మాట్లాడుతూ సంబంధిత ప్రదేశాన్ని పునఃపరిశీలించి పేదలకు న్యాయం చేయాలన్నారు. ఆర్డీవో సానుకూలంగా స్పందించి తహసీల్దార్ రవిప్రకాష్‌ను సంబంధిత స్థలాన్ని పరిశీలించాలని సూచించారు. జిల్లాజాయింట్ కలెక్టర్ దృష్టికి మరోమారు తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని బాధితులకు హామీ ఇచ్చారు.



● గుంటూరు బ్రాంచ్ కెనాల్‌కు నీటి సరఫరా

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
బాపట్ల జిల్లా వార్తలు
5
మంగళవారం 18 ఫిబ్రవరి 2025



నీటి విడుదలపై.. నియంత్రణ ఏదీ?

నాగార్జున సాగర్ జలాశయంలోని నీటి వినియోగంపై నియంత్రణ కొరవడింది. ఇరు రాష్ట్రాలు ఇష్టారాజ్యంగా నీటిని వినియోగించుకుంటున్నాయి. 95 రోజుల్లో 122 టీఎంసీల నీటిని వాడేశారు. సాగర్ నీటి మట్టం 538 అడుగులకు పడిపోయింది. నవంబరు 12న పూర్తి స్థాయిలో నీటి మట్టం ఉండగా రోజురోజుకూ పడిపోతోంది. నీటిని పొదుపుగా వాడటంలో అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రతి రోజూ సాగర్ నుంచి 20,998 కూసెక్కుల నీటిని వాడేస్తున్నారు. కుడి కాలువకు 10 వేల కూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ఇదే స్థాయిలో తెలంగాణ కూడా నీటిని వినియోగించుకుంటున్నది. ఇరు రాష్ట్రాలు పోటీ పడి సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తుండటం తో వేసవిలో పరిస్థితి ప్రమాదకరంలో పడవచ్చనే అభిప్రాయాన్ని జలవనరుల నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

- అవసరం లేని కాలువలకూ నీటి విడుదల
- వాగుల్లో పారుతున్న కృష్ణా జలాలు
- కుడి కాలువకు 10వేల క్యూసెక్కుల నీటి సరఫరా
- 538 అడుగులకు పడిపోయిన సాగర్ నీటి మట్టం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ సాగు దాదాపు పూర్తయింది. ఖరీఫ్‌కు సంబంధించి మిరప సాగు మాత్రమే ఉంది. మిరపకు మార్చి ఆఖరు వరకు నీటి సరఫరా అవసరం ఉందని అంచనా. పల్నాడు జిల్లాలో రబీలో వరి సాగు కూడా పెద్ద ఎత్తున చేశారు. ఈ రెండు పంటలకు నీటి అవసరం ప్రధానంగా మార్చి చివర వరకు ఉంది. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలో రబీలో వేసిన మొక్కజొన్న, పొగాకు వంటి ఇతర పంటలు చివరి దశకు వచ్చాయి. వాటికి నీటి అవసరం లేదు. ఈ నేపథ్యంలో సాగర్‌లో ఉన్న నీటిని పొదుపుగా వాడాల్సిన అవసరం ఉండగా ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న వాదన రైతుల నుంచి కూడా వ్యక్తమవుతోంది. కుడి కాలువ పరిధిలో అన్ని మేజర్లు, మైనర్ల పరిధిలో సాగునీరు అవసరం లేదు. పంటలు ఉన్న ప్రాంతాన్ని గుర్తించి ఆ పరిధిలోనే నీటిని సరఫరా చేయాల్సి ఉంది. అయితే ఖరీఫ్‌లో అన్ని పంటలు వేసినప్పుడు ఎలా అయితే నీరు వదులుతారో, అదే విధంగా దాదాపు అన్ని కాలువలకు నీటి సరఫరా జరుగుతోంది. వరి నాట్లు కూడా పూర్తయ్యాయి. మిరపకు ఆరు తడులు సరిపోతాయి. వరికి కూడా వార బందీ అమలు చేసినా సాగునీరు సరిపోతుందనేది అంచనా. పంటలు సాగు చేసిన ప్రాంతాలకు మాత్రమే సాగు నీరు సరఫరా చేసే విధంగా జలవనరుల శాఖ ప్రణాళికను రూపొందించాల్సి ఉంది. కొన్ని ప్రాంతాల్లో పంటలు లేకున్నా సాగునీరు పొలాల్లో వృధాగా ప్రవహిస్తోంది. అలాగే వాగుల్లో కూడా నీరు పెద్ద ఎత్తున ప్రవహిస్తున్నది. అవసరం ఉన్న కాలువలకు మాత్రమే నీటిని సరఫరా చేసేందుకు చర్యలు లేవు. కొన్ని కాలువలకు నీటి సరఫరాను నిలిపివేసేందుకు షట్టర్లు లేవని చెబుతున్నారు. దీని వలన అవసరం లేని ప్రాంతాలకు కూడా నీటి సరఫరా జరుగుతోంది.

అధికారులు దృష్టి సారించాలి

ఏ కాలువ పరిధిలో ఏ ఏ పంటలు సాగులో ఉన్నాయి. ఏ మేరకు నీటి సరఫరా అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేయాల్సి ఉంది. పంటలు లేని ప్రాంతంలోని కాలువకు నీటి సరఫరా నిలిపివేయాల్సి ఉంది. వార బందీ అంశాన్ని కూడా అధికారులు పరిశీలించాలి. మిరప.. వరి సాగు ఉన్న ప్రాంతాలను గుర్తించి అయా ప్రాంతాలకు నీటిని సరఫరా చేయడం వలన నీటి వృధాను అరికట్టే అవకాశం ఉంది. ఈ మేరకు జలవన రుల శాఖ అధికారులు స్పందిస్తేనే వేసవి కూడా సాగర్‌లో నీటి నిల్వ ఉంటుంది. లేకుంటే తాగు నీటికి గడ్డు పరిస్థితులు నెలకొనే ప్రమాదం పొంచి ఉంది.

సాగర్‌లో నీటి నిల్వ ఇలా..

నాగార్జున సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు. సోమవారం 538.1 అడుగులు నమోదైంది. పూర్తి స్థాయి నీటి సామర్థం 312.05 టీఎంసీలు కాగా 184.39 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాగర్‌లోకి నీటి ప్రవాహం లేదు. జలాశయం నుంచి 20,998 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి కాలువకు 10,000 కూసెక్కులు.. ఎడమ కాలువకు 8,718 కూసెక్కులు.. ఎస్ఎల్‌బీసీకి 2,000 కూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. పంటల అవసరాలను గుర్తించి నీటి సరఫరా చేయకుంటే, సాగర్‌లో ఉన్న నీటి నిల్వ నిండుకోవడం ఖాయం. ఉన్న నీటి నిల్వ 512 అడుగులకు తగ్గితే 136 టీఎంసీల నీటి నిల్వ ఉంటుంది. అంటే ఈ స్థాయికి నీటి మట్టం చేరే వరకు ఇంకా 45 టీఎంసీల నీటిని మాత్రమే వినియోగించుకునే అవకాశం ఉంది. ఇప్పటికైనా నీటి సరఫరాపై జలవనరుల శాఖ అధికా రులు అప్రమత్తం కాకుంటే వేసవిలో తాగు నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉంది. దీనిని ఇప్పటికైనా అధికారులు గుర్తించి మేల్కోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



నాగార్జున సాగర్ జలాశయంలో పడిపోయిన నీటి నిల్వ



వైసీపీ ప్రభుత్వం సృష్టించిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఇప్పటికీ గందరగోళంలోనే కొనసాగుతూనే ఉంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నెలకొన్న గందరగోళాన్ని సరి చేసేందుకు కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టినప్పటికీ, అది ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతోంది.

సచివాలయం.. గందరగోళం!

- హేతుబద్ధీకరణపై ప్రభుత్వం మల్లగుల్లాలు
- మాతృ సంస్థల్లో విలీనం చేయాలని డిమాండ్
- మల్టీ పర్పస్ ఫంక్షనరీస్ పేరుతో పని భారం
- స్పష్టమైన జాబ్ చార్ట్ విడుదల చేయాలని డిమాండ్
- మంత్రి డోలాకు విన్నవించిన సచివాలయ ఉద్యోగులు

గుంటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను సృష్టించింది. పరిపాలనను ప్రజలకు చేరువ చేయడం అన్న పేరుతో రూపొందించిన ఈ వ్యవస్థ నిర్వహణ, పనివిధానానికి సంబంధించి విధివిధానాలు రూపొందించకుండా మొత్తంగా వ్యవస్థను గందరగోళం చేసింది. 2019లో కేవలం రెండు నెలల వ్యవధిలో లక్షా 30వేల మంది ఉద్యోగులను రిక్రూట్ చేసుకుని వారందరినీ గందరగోళంలో పడవేసింది. ఐదేళ్లపాటు వారిని పలు రకాల సేవల్లో వినియోగించుకున్న గత ప్రభుత్వం వారికి నిర్దిష్టమైన జాబ్ చార్టును కూడా రూపొందించకుండా నిర్లక్ష్యం చేసింది. ఉద్యోగులతో సంబంధం లేని పనుల్లో కూడా వాడుకుంటూ వారితో వెట్టి చాకిరీ చేయించుకుంది. గ్రామ పంచాయతీలకు సమాంతర వ్యవస్థలా సచివాలయాలను నడిపి పంచాయతీరాజ్ వ్యవస్థను నీరుగార్చింది. కనీసం వారికి డీడీవో అధికారాలు కూడా ఇవ్వకుండా చాకిరీ చేయించుకుంది. గతంలో సచివాలయ ఉద్యోగులకు సర్వీస్ అంశాలు మాతృశాఖ నుంచి జీతం మరొక శాఖ నుంచి పర్యవేక్షణ చేసిన పరిస్థితి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం సృష్టించిన ఈ గందరగోళాన్ని తొలగించి, ఉద్యోగులను హేతుబద్ధీకరించడానికి ప్రయత్నిస్తున్న కూటమి ప్రభుత్వం సవాళ్లను ఎదుర్కొంటోంది.



మిగులు ఉద్యోగులను ఏం చేయాలి?

గుంటూరు జిల్లాలో ప్రస్తుతం 568 సచివాలయాలు ఉండగా 4,780 మంది ఉద్యోగులు, పల్నాడు జిల్లాలో 537 సచివాలయాల్లో 4,494 మంది, బాపట్ల జిల్లాలో 477 సచివాలయాల్లో 4,240 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. మొత్తంగా మూడు జిల్లాల్లో 1,582 సచి వాలయాల్లో 13,514 మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన హేతుబద్ధీకరణ వల్ల ఒక్కో సచివాలయానికి సగటున ఏడుగురు ఉద్యోగులు సరిపోతారు. దీంతో జిల్లాలోని మొత్తం సచివాలయాల్లో 11,074 మంది ఉద్యోగులు సరిపోతారు. ఇంకా 2,440 మంది ఉద్యో గులు మిగులుతారు. ఇలా మిగిలిన ఉద్యోగులను ఏం చేస్తారనేది ఉద్యోగులను వెంటాడుతున్న ఆందోళన.

మాతృ శాఖకు పంపాలంటూ వేడుకోళ్లు

రాష్ట్ర సచివాలయంలో గ్రామ, వార్డు సచివాలయాల శాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో సచివాలయ ఉద్యోగులు తమ గోడును ఏకరువు పెట్టారు. సచివాలయ ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్ హోదా కల్పించాలని విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హేతుబద్ధీకరణలో చెబుతున్న మల్టీ పర్పస్ ఉద్యోగుల విధానాన్ని తొలగిం చాలని ఉద్యో గులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఈ విధానంలో సొంత శాఖ విధులతో పాటు ఇతర శాఖల విధుల భారం కూడా ఉద్యోగులపై పడుతుందని ఉద్యోగులు వాపోతున్నారు. సచివాలయ ఉద్యోగులపై సచివాలయం పర్యవేక్షణ మాత్రమే ఉండాలని, మాతృశాఖ, సచివాలయం రెండింటి పర్యవేక్షణ ఉంటే అది గతంలో మాదిరిగా గందరగోళానికి దారి తీస్తుందని అంటున్నారు. సచివాలయ ఉద్యోగులకు నిర్దిష్టమైన జాబ్ చార్టును రూపొందించి అమలు చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం పంచాయతీరాజ్ వ్యవస్థలో ఆరు గ్రేడులుగా ఉన్న పంచాయతీ కార్యదర్శులను 3 గ్రేడులకు కుదించాలని గ్రేడ్- 1,2 జోనల్ పోస్టులను గ్రేడ్- 1గా, గ్రేడ్- 3,4,5లను గ్రేడ్- 2గా, గ్రేడ్-6ను గ్రేడ్-3గా మార్చాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. సచివాలయం, పంచాయతీ డీడీవో, కన్వీనర్ బాధ్యతలు నిర్వహించే ఉద్యోగులకు హోదాకు తగినట్లుగా సీనియర్ అసిస్టెంట్ పే స్కేలు ఇవ్వాలని కోరారు.

హేతుబద్ధీకరణకు సంబంధించి గత నెల రోజులుగా కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అది ఇప్పటి వరకూ ఒక కొలిక్కి రాలేదు. ఉద్యోగుల హేతబద్ధమైన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని, శాస్త్రీయమైన పరిష్కారం కనుగొనలేకపోతే సమస్య మరింత జఠిలమయ్యే ప్రమాదం ఉంది.

ముంచుకొచ్చిన.. మృత్యువు

- ఆటోను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు
- ముగ్గురు మహిళా కూలీల మృతి
- ఎనిమిది మందికి గాయాలు
- క్షతగాత్రులును గుంటూరు జీజీహెచ్‌కి తరలింపు

వారంతా రెక్కాడితేగానీ.. డొక్కాడని మహిళా కూలీలు. పొద్దునే లేచి, చద్ది కూడు తిని పొలం పనులకు పోయి పొట్ట నింపుకునే వారు. రోజూలాగే ఆ రోజూ చకచకా ఇంటి పనులు ముగించుకొని పొలం పనులకు పయనమయ్యారు. కానీ వారికి తెలియదు వారెళుతుంది తిరిగిరాని లోకానికని. కూలీలందరూ ఓ ఆటోలో కిక్కిరిసి కూర్చున్నారు. వారికి తెలుసు అలా వెళ్లడం ప్రమాదకరమని, ఏదైనా జరిగితే భారీ మూల్యం చెల్లించాల్సిం దేనని.. పది రూపాయలు మిగులుతాయని ప్రమాదంపైనే ప్రయాణమయ్యారు. ఉదయాన్నే రోడ్డును పొగ మంచు కమ్మేసింది. 'ఇదిగో అబ్బాయ్ జాగ్రత్తగా నడుపూ..' అని అంటూనే ఉన్నారు. ఈలోపే దట్టమైన మంచును చీల్చుకొచ్చిన ఓ బస్సు వారి ఆటోను ఢీ కొట్టింది. ముగ్గురు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు..



ప్రమాదానికి గురైన ఆటో



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు



మృతులు అల్లంశెట్టి అరుణ,తోట సీతారాములు, కుర్రా నాంచారమ్మ

సమన్వయంతో పని చేయాలి

● పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆర్‌వో నాగలక్ష్మి

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు సమ న్వయంతో విధులు నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో ప్రిసై డింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, జిల్లా రెవె న్యూ అధికారి ఖాజావలితో కలిసి ఆమె పాల్గొన్నారు. ప్రిసై డింగ్ అధికారులు ఎన్నికలు జరిగే ముందురోజు డిస్ట్రిబ్యూష న్ సెంటరు నుంచి పూర్తి స్థాయిలో పోలింగ్ సామగ్రి తీసుకొని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటింగ్‌కు సంబంధించిన పూర్తి ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ రోజు ఉదయం 8 గంటల సమయానికి ఓటింగ్ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సమయంలో జరుగుతున్న అన్ని విషయాలపై నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం స్పందిస్తూ పోలింగ్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే ప్రిసైడింగ్ అధికారి డైరీతో పాటు, ఇతర నాన్ స్టాట్యూటరీ, స్టాట్యూటరీ ఫారంలను సక్రమంగా పూర్తి చేసుకొని, బ్యాలెట్ బాక్స్‌లు సక్రమంగా సీజ్ చేసి రిసెప్షన్ కేంద్రాల్లో అప్పగించాలన్నారు. పోలింగ్ మెటీరియల్ తీసుకున్నప్పటి నుంచి తిరిగి వాటిని రిసెప్షన్ కేంద్రాల్లో అప్పగించే వరకు ప్రిసైడింగ్ అధికారులు అలసత్వం, నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ విధులు కేటాయించిన ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులను ఫిబ్రవరి 20వ తేదీ నాటికి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి అందేలా పోస్ట్ ద్వారా గానీ, స్వయంగా గానీ అందించాలన్నారు. దరఖాస్తులు అం దించిన వారి చిరునామాకు పోస్టల్ బ్యాలెట్ మెటీరియల్ పోస్ట్ ద్వారా అందించటం జరుగుతుందని, ఓటు నమోదు చేసి పోస్టల్ బ్యాలెట్ కవర్లు మార్చి 2వ తేదీ నాటికి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరే విధంగా పోస్ట్ చేయాలన్నారు.

సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ మాట్లాడుతూ పోలింగ్ పూర్తి అయిన తరువాత బ్యాలెట్ పేపర్ వినియోగానికి సంబంధించిన ఫారాలు, ఇతర ఫారాలు పూర్తి స్థాయిలో పోలింగ్ కేంద్రాల్లోనే పూర్తి చేసిన తరువాత మాత్రమే రిసెప్షన్ కేంద్రాలకు బయలుదేరి రావాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు నిర్దేశించిన విధంగా పోలింగ్ కేంద్రాలలో పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేస్తూ ప్రిసైడింగ్ అధికారికి అవసరమైన సహకారం అందించాలన్నారు. సమావేశంలో ప్రిసైడింగ్ అధికారులకు, మైక్రో అబ్జర్వర్లు నిర్వర్తించాల్సిన విధులు, బ్యాలెట్ బాక్సులు ఓటింగ్‌కు సిద్ధం చేసే విధానం, సీల్ వేసే విధానంపై మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్, వీడియో చిత్రాల ద్వారా శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లుగా విధులు కేటాయించిన అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ

గురజాలలో.. వైసీపీకి షాక్!

- టీడీపీలో చేరిన వైసీపీ చైర్మన్, కౌన్సిలర్లు
- వైస్ చైర్మన్‌గా భారతి ఎన్నిక

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పరిధిలోని పిడుగురాళ్లలో వైసీపీకి ఆ పార్టీ కౌన్సిలర్లు భారీ షాక్ ఇచ్చారు. సోమవారం 17 మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక ఈ నెల 3, 4 తేదీలలో వాయిదా పడటం, తిరిగి ఈ నెల 17వ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సంసిద్ధమవుతున్న తరుణంలో ఊహించని విధంగా వైసీపీ కౌన్సిలర్లు ఆ పార్టీతో తెగతెంపులు చేసుకొని (మిగతా 8వ పేజీలో)



ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు

ఎన్టీఆర్ విగ్రహానికి గ్రీజు

పోలీసులకు టీడీపీ నేతల ఫిర్యాదు

మార్టూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహానికి గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి నల్లటి గ్రీజును పూశారు. అనైతిక చర్యలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి, వెంటనే శిక్షించాలని పోలీసు అధికారులకు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేశారు. కార్యక్రమంలో నాయకులు తాటి నాగేశ్వరరావు, తొండెపు ఆదినారాయణ, షేక్ రజాక్, కామినేని జనార్దన్, గొట్టిపాటి వెంకట్రావు, కమ్మ శివ నాగేశ్వరరావు, కొర్రపాటి హరనాథ్, కాకోలు వెంకటేశ్వర్లు, మువ్వా సాంబయ్య, కన్నెగంటి శ్రీను, గుర్రం శ్రీను, గట్టా యానాదిరావు, కనమర్లపూడి సీతారామాంజనేయులు, పున్నారావు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూసి ఉన్న గ్రీజు

ఉత్తమ ఆహారపు అలవాట్లతో ఒత్తిడి దూరం

● ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఆహారపు అలవాట్లతో ఒత్తిడి దూరం అవుతుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు తెలిపారు. సోమవారం వర్సిటీ కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ, ఫుడ్ సైన్స్ డైటెటిక్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఎదురుగావున్న ఉజ్వలహోంలో 'ఒత్తిడి ఉపశమనంపై పౌష్టిక ఆహార ప్రభావం' అంశంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సీఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ బి.భవిత అధ్యక్షత వహించారు. ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ యువత ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటుపడి అనారోగ్యాలను కొనితెచ్చుకుంటున్నారని, చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హోమ్ నిర్వాహకులు సిస్టర్ రోజిలీనా సీఎస్ఆర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మందూరు వెంకటరమణ, డాక్టర్ డి. జలజకుమారి, కౌన్సిలర్ ఎం. రూప, ఫుడ్ సైన్స్ న్యూట్రిషన్ విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ రహదారిపై ముప్పవరం ఫ్లైవోవర్ పక్కనున్న అప్రోచ్ రోడ్డుపై ప్రవహిస్తున్న సాగర్ జలాలు

రోడ్డెక్కిన సాగర్ జలాలు

వాహన చోదకుల అవస్థలు

పంగులూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : సాగర్ జలాలు 16వ నెంబరు జాతీయ రహదారిపై ముప్పవరం ఫ్లైవోవర్ పక్కన అప్రోచ్ రోడ్డుపై ప్రవహించడంతో వాహన చోదకులు అవస్థలు పడ్డారు. ముప్పవరం నుంచి బైటమంజులూరు వైపు వెళ్లే ప్రధాన రహదారిలో సాగర్ జలాలు ముప్పవరం అప్రోచ్ రోడ్డుపై ప్రవహించాయి. ఈ రెండు గ్రామాల మధ్య రోడ్డు దాటి దిగువకు ఉన్న సాగర్ మైనర్ కాలువలో ప్రవహించే నీటిని రైతులు తమ పంట పొలాలు తడుపుకునేందుకు వినియోగిస్తున్నారు. ఈ కాలువ నీరు దిగువకు పోకుండా పొలాలు తడుపుకునే రైతులు అడ్డుకట్ట వేయడమో లేక కాలువలోకి సాగర్ జలాలు మిక్కటంగా ప్రవహించిన కారణమో సాగర్ జలాలు సోమవారం రోడ్డెక్కి ప్రవహించాయి. దీంతో ఈ రహదారిలో రాక పోకలు సాగించిన వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

భూ వ్యత్యాసాల సవరణకు సహకరించాలి



బూదవాడలో భూముల ఆన్‌లైన్ వ్యత్యాసాలపై పరిశీలన చేస్తున్న తహసీల్దార్ సింగారావు

పంగులూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్‌లో చోటు చేసుకున్న భూ వ్యత్యాసాల సవరణకు రైతులు సహకరించాలని తహసీల్దార్ పీ సింగారావు కోరారు. సోమవారం మండలంలోని బూదవాడ గ్రామంలో రైతు ఈమని వీరారెడ్డికి చెందిన సర్వే నెంబరు 132లో 0.86 సెంట్ల విస్తీర్ణం ఆన్‌లైన్‌లో నమోదు కావాల్సి ఉండగా 0.45 సెంట్ల విస్తీర్ణం నమోదు చేశారు. ఈ విషయమై సవరణ కోసం వీరారెడ్డి దాఖలు చేసిన అర్జీని పరిశీలించిన తహసీల్దార్ క్షేత్ర స్థాయిలో ఆధీనంలో ఉన్న భూమిని రికార్డులతో సరిపోల్చారు. సమీప రైతులతో చర్చించి దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించారు. భూ వివాదాల విషయంలో న్యాయబద్ధంగా వ్యవహరిస్తామని, రైతులు తమకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్వేయర్లు, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

23న ప్రతిభామూర్తుల కార్యక్రమం

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అద్దంకి ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన స్థానిక చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో ఉదయం 10 గంటలకు ప్రతిభామూర్తులు - మధురస్మృతులు కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు పీసీహెచ్ కోటయ్య సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

రేపు విద్యుత్ అదాలత్

అద్దంకి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలిక, అపరిష్కృత విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19వ తేదీ ఉదయం 10-30 గంటలకు స్థానిక శింగరకొండ రోడ్డులోని విద్యుత్ కార్యాలయం వద్ద విద్యుత్ అదాలత్ జరుగుతుందని ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. విద్యుత్ అదాలత్‌కు సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ విక్టర్ ఇమ్మానుయేల్ హాజరవుతారని తెలిపారు. అద్దంకి సబ్ డివిజన్ పరిధిలోని అద్దంకి టౌన్, అద్దంకి రూరల్, కొరిశపాడు, జె.పంగులూరు మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు హాజరై తమ సమస్యలకు తక్షణ పరిష్కారం పొందవచ్చని ఈఈ మస్తాన్‌రావు తెలిపారు.

దివ్యాంగుల హక్కులపై అవగాహన ఉండాలి



దివ్యాంగ విద్యార్థులతో న్యాయవాది రామకృష్ణారెడ్డి

చినగంజాం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి, సమాజంలో ఉన్నతంగా బతకాలని చీరాల న్యాయవాది ఆసోది రామకృష్ణారెడ్డి, ఏపీఎం గద్దె పెద్దసుబ్బారావులు అన్నారు. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలోని దివ్యాంగ విద్యార్థినులు వారి హక్కుల పట్ల సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలోని 6వ తరగతి బాలికలకు బాలల హక్కులు, బాల వివాహాలు వలన కలిగే నష్టాలు, వరకట్నం, నేడు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై వారు అవగాహన కల్పించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రామాల్లో దివ్యాంగుల జీవన శైలిపై కమిటీతో సర్వే చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో చేసిన సర్వేని హైకోర్టుకు పంపనున్నట్లు తెలిపారు. కేజీబీవీలో పలువురు దివ్యాంగ విద్యార్థినులను గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి, పారా లీగల్ మండల వలంటీర్ ఎం.వీ.రామారావు, టీడీపీ నాయకులు పర్వతరెడ్డి పార్థసారిధి పాల్గొన్నారు.

పోలీసులు వేధిస్తున్నారంటూ తల్లీకొడుకుల ఆత్మహత్యాయత్నం

పంగులూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలవలపాడు గ్రామానికి చెందిన ఇమాం వలి, అతని తల్లి గాలీబీ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఇమాం వలికి సల్మాతో కొన్నేళ్ల కిందట వివాహం కాగా, స్పర్ధలతో రెండేళ్లుగా విడివిడిగా ఉంటున్నారు. వీరికి ఏడాదిన్నర కుమార్తె ఉంది. పెద్ద మనుషుల ద్వారా ప్రయత్నించినా భార్య కాపురానికి రాలేదని, న్యాయపరంగా విడాకులు కోరిన తనతోపాటు తన తల్లి, మరికొందరిపై రేణంగివరం పోలీస్ స్టేషన్‌లో సల్మా ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ వినోద్‌బాబు తమను తరచూ పోలీస్ స్టేషన్‌కు పిలిచి ఇబ్బంది ఇబ్బంది పెడుతున్నారని ఆరోపిస్తూ ఇమాం వలి సోమవారం పురుగుమందు తాగే ప్రయత్నం చేయగా, కొడుకు చేతిలో డబ్బాను లాక్కొని తల్లి గాలీబీ పురుగు మందు తాగింది. వెంటనే ఆమెను అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. ఈ విషయమై ఎస్ఐ వినోద్‌బాబు మాట్లాడుతూ భార్య సల్మా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, నోటీసు ఇచ్చేందుకు స్టేషన్‌కు పిలిపించినట్లు చెప్పారు. తాను ఎలాంటి ఇబ్బందికీ గురిచేయలేదని తెలిపారు.

తరచూ రైలు ప్రమాదాలు

- బండి నుంచి జారిపడి కొందరు
- పట్టాలు దాటుతూ మరికొందరు
- ఈనెలలో ఇప్పటికే ఎనిమిది మరణాలు



చీరాల రైల్వేస్టేషన్

చీరాలటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : చీరాల రైల్వే స్టేషన్ పరిధిలో రైలు ప్రమాదాలు రోజు రోజూ పెరుగుతున్నాయి. నిర్లక్ష్యంగా రైళ్లలో ప్రయాణాలు చేస్తూ కొందరు, చూడకుండా పట్టాలు దాటుతూ మరి కొందరు మృత్యువాత పడుతున్నారు. ఈక్రమంలో కదిలే రైళ్ల నుంచి జారిపడి మృతి చెందిన వారి ఆధారాలు సేకరించేందుకు రైల్వే అధికారులకు నానా యాతన పడుతున్నారు. వీరిలో ఎక్కువ మంది బీహార్, రాజస్థాన్ ఇతర దూరప్రాంతాలకు చెందిన వారై ఉంటున్నారు. లోకల్‌గా పట్టాలు దాటుతూ మృతి చెందిన వారి ఆధారాలు కూడా సుమారు 3 నుంచి 5 రోజులు పడుతుంది. దాదాపు ప్రతినెలలో కనీసం 5 నుంచి 8 వరకు పట్టాలపై మృతి చెందుతున్నారు. అయితే ఈనెలలో ఇప్పటికే సుమారు 8మంది మరణించారు. ఇటీవల ఓ లెక్చరర్ పట్టాలు దాటుతూ మరణించగా, మరుసటి రోజు ఇద్దరు, సోమవారం ఉదయం ఒకరు మృతి చెందారు. ఈక్రమంలో ఆధారాలు లేని మూడు మృతదేహాలను ఇప్పటికే రైల్వే పోలీసులు చీరాల ఏరియా హాస్పిటల్‌కు తరలించి వారి బంధువులెవరో తెలుసుకునే పనిలో పడ్డారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రయాణికులు ప్రమాదాలబారిన పడకుండా ఉండాలంటే అసలు ముందు వారిలో చైతన్యం రావాలని విశ్లేషకులు చెప్తున్నారు. కొందరు బాధ్యతలు మరిచి నిర్లక్ష్యంగా రైళ్లల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు. రైళ్లలో మెట్ల వద్ద కూర్చుని అజాగ్రత్తగా ఉంటూ ప్రమాదాలబారిన పడుతున్నారు. అంతేకాకుండా లోకల్‌గా ఉన్న ప్రజలు పట్టాలు దాటే క్రమంలో నిబంధనలేవీ పట్టించుకోవడం లేదు. చూడకుండా సిగ్నల్స్ గమనించకుండా పట్టాలు దాటుతూ ప్రమాదాలబారినపడుతున్నారు. పట్టాలు దాటే క్రమంలో ప్రజల్లో అవగాహన రావాలి. అలాగే రైళ్లలో ప్రయాణిస్తున్న వారు మెట్ల వద్ద కూర్చోనివ్వకుండా చర్యలు చేపట్టాలి. లేకుంటే ఈసంఖ్య మరింత పెరిగే అవకాశం లేకపోలేదు.



సోమవారం మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

రోడ్డు ప్రమాదంలో నూజివీడువాసి మృతి

- మరో ఇద్దరికి స్వల్పగాయాలు
- బెంగళూరు నుంచి వస్తుండగా మార్టూరు వద్ద ఘటన



ప్రమాదానికి గురైన కారు



కృష్ణ (ఫైల్)

మార్టూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు మండల పరిధిలో జాతీయరహదారిపై సోమవారం ఉదయం జరిగిన కారు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందగా, మరో ఇద్దరు వ్యక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రమాదానికి గురైన కారు ఏలూరు జిల్లా నూజివీడుకు చెందినదిగా పోలీసులు గుర్తించారు. ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన జూలూరి కృష్ణ (35), కాగా స్వల్పగాయాలతో బయటపడిన అతని తమ్ముడు జూలూరి వంశీకృష్ణ, బంధువు కొప్పురావూరి వివేకానంద మహర్షిగా పోలీసులు తెలిపారు. కృష్ణకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు, అబ్బాయి ఉన్నారు. ముందువెళుతున్న గుర్తుతెలియని వాహనాన్ని వెనుక నుంచి కారు బలంగా ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కారు మధ్య సీటులో నిద్రిస్తున్న కృష్ణకు బలమైన గాయాలు కావడంతో అతను మృతి చెందారు. కారును నడుపుతున్న కృష్ణ తమ్ముడు వంశీకృష్ణ, మరో వ్యక్తి కే వివేకానంద మహర్షి స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. వారిని 108 వాహనంలో చిలకలూరిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం వారు మణిపాల్ హాస్పిటల్‌కు వెళ్లినట్లు తెలిసింది. ఇదిలావుండగా కారులోని ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో వారిద్దరూ ప్రాణాలతో బయటపడ్డారని పోలీసులు తెలిపారు. కారు ఢీకొన్న ముందున్న వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. ఉదయం సమయంలో మంచుగా ఉండటం, డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి నిద్రమత్తులో ఉండడం తదితర కారణాలతో ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

నూజివీడు నుంచి బెంగళూరు వెళ్లి వస్తుండగా ప్రమాదం

నూజివీడులో నూసర్లవారివీధిలో వైశ్యఫార్మా మెడికల్స్ వ్యాపారం నిర్వహిస్తున్న జూలూరి కృష్ణ, తమ్ముడు వంశీకృష్ణ, విజయవాడలో ఉంటున్న బంధువు వివేకానంద మహేష్‌తో కలిసి శుక్రవారం రాత్రి కారులో బెంగళూరులో ఉంటున్న చెల్లెలు వద్దకు వెళ్లారు. తన దగ్గర ఉన్న చెల్లెలు కారును ఆమెకు ఇచ్చి ఆమె దగ్గర ఉన్న తమ కారును తీసుకొని తిరిగి ఆదివారం రాత్రి వారు నూజివీడుకు కారులో బయలు దేరారు. మార్టూరు వద్ద వారి కారు ప్రమాదానికి గురైంది. మృతి చెందిన కృష్ణ తండ్రి సీతారామాంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శవపంచనామా అనంతరం కృష్ణ మృతదేహానికి ప్రభుత్వ వైద్యులు పోస్టుమార్టమ్ చేశారు. తరువాత బంధువులకు అప్పగించారు. ఎస్ఐ సైదా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొట్టు ట్రాక్టర్‌ను ఢీకొన్న టిప్పర్

- రోడ్డుపై బోల్తా
- ముగ్గురుకి స్వల్ప గాయాలు
- తప్పిన పెను ప్రమాదం
- ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా తొలగిస్తున్న సీఐ



రోడ్డుకు అడ్డంగా పడిపోయిన పొట్టు ట్రాక్టర్‌ను తొలగింప చేస్తున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : వరి పొట్టు లోడుతో వస్తున్న ట్రాక్టర్ ను ఓవర్ టేక్ చేసే క్రమంలో టిప్పర్ ఢీ కొనటంతో ట్రాక్టర్ బోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు సోమవారం సాయంత్రం అద్దంకి పట్టణం కు సమీపంలో కలవకూరు రోడ్డు లో రామకూరు నుండి వరి పొట్టుతో అద్దంకి వస్తున్న ట్రాక్టర్ ను వెనుక నుండి వస్తున్న టిప్పర్ ఓవర్ టేక్ చేస్తూ ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ బో ల్తా పడింది. ప్రమాదం జరుగుతున్నట్లు గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ మరో ఇద్దరు యువకులు ట్రాక్టర్ పై నుండి దూకటం తో స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ట్రాక్టర్ బొ ల్తా పడ్డ సమీపంలో విద్యుత్ స్థంభం ఉంది. పొరపాటున విద్యుత్ స్థంభం ఢీ కొని ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని స్థానికులు అభి ప్రాయపడుతున్నారు. ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే సిఐ సుబ్బరాజు సంఘటనాస్థలానికి చేరుకొని రోడ్డు కు అడ్డంగా ఉన్న పొట్టు ట్రాక్టర్ ను క్రేన్ సహాయంతో తొలగింప జేసి ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా చేశారు.

ఇదిగో బెంగళూరు హైవే

- అవిగో టిడ్కో ఇళ్లు
- ఇక మీకు కావాలన్నా స్థలాలు దొరకవు
- ఇదీ అద్దంకిలో రియల్ వ్యాపారులు, బ్రోకర్‌ల మాయాజాలం
- కొనుగోలుకు ముందుకు రాని ప్రజలు



అద్దంకి పట్టణ సమీపంలో నాగులపాడు రోడ్డులో వేస్తున్న వెంచర్

అద్దంకి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని పుంజుకునేలా చేసేందుకు వ్యాపారులు, దళారులు అష్టకష్టాలు పడుతున్నారు. ఇదిగో విజయవాడ - బెంగళూరు హైవే పనులు జోరుగా సాగుతున్నాయి. టిడ్కో ఇళ్ల నిర్మాణం త్వరలో ప్రారంభం కానున్నాయి. భవిష్యత్‌లో స్థలాలు కావాలన్నా దొరకవు... త్వరపడండి అంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఊదరగొడుతున్నారు. అయినా కొనుగోలుదారులు మాత్రం పెద్దగా ఆసక్తి చూపటం లేదు. అద్దంకి సమీంలో గుండా విజయవాడ - బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. దీంతో అద్దంకి పట్టణం నుంచి రేణింగవరం రోడ్డు, నాగులపాడు రోడ్డు, మేదరమెట్ల రోడ్డు, వేలమూరిపాడు రోడ్డులలో వెంచర్‌లు ఇబ్బడిముబ్బడిగా వేస్తున్నారు. ఇక శింగరకొండ సమీపంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అత్యధిక శాతం నిర్మాణ పనులు జరిగాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టిడ్కో ఇళ్ల నిర్మాణం పునఃప్రారంభం అయ్యే అవకాశం ఉండడంతో శింగరకొండ రోడ్డులో కూడా వెంచర్ లు వెలుస్తున్నాయి. ఇలా అద్దంకి చుట్టూ వెంచర్‌లు పెద్ద ఎత్తున వెలుస్తున్నాయి. గత రెండు దశాబ్దాలుగా అద్దంకిలో రియల్ ఎస్టేట్ ధరలకు అడ్డూ అదుపూ లేకుండా పెరిగాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాజధాని ప్రాంతంపై కొనుగోలుదారులు ఆసక్తి చూపారు. దీంతో అద్దంకి ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ధరలు ఒకింత తగ్గాయి. ఈ నేపథ్యంలో మరలా రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని పుంజుకునే విధంగా చేసేందుకు వ్యాపారులు కష్టపడుతున్నారు. కాని కొనుగోలుదారులు మాత్రం పెద్దగా ఆసక్తి చూపటం లేదు.





అద్దంకి సమీపంలో నిర్మాణంలో ఉన్న విజయవాడ-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు .. శింగరకొండ సమీపంలో టిడ్కో ఇళ్లు

హైవేపై ఆగిన అఘోరీ కారు

ఆమెను చూసేందుకు గుమిగూడిన ప్రజలు



జేవీపాలెం వద్ద హైవేపై విశ్రాంతి కోసం ఆగిన మహిళా అఘోరీ

పంగులూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కొంత కాలంగా తెలుగు రాష్ట్రాలలోని పలు నగరాలు, పట్టణాల్లో సంచరిస్తూ హడావుడి సృష్టిస్తున్న మహిళా అఘోరీ సోమవారం జేవీపాలెం సమీపంలో జాతీయ రహదారి పక్కన కారులో కనిపించారు. కారు ముందు భాగంలో అఘోరి, నాగసాధు, సనాతన ధర్మ అని ఇంగ్లీషులో రాసి, తోరణం, మధ్యలో త్రిశూలం, శివలింగం, పుర్రె బొమ్మలతో పెయింటిగ్ వేసి జెండా కట్టి ఉన్న కారును చూసిన ప్రజలు కారువద్దకు చేరుకున్నారు. అఘోరీ కారు ఆగిన విషయాన్ని హైవే పెట్రోలింగ్ సిబ్బంది ద్వారా తెలుసుకున్న రేణంగివరం పోలీసులు అక్కడకు చేరుకున్నారు. కారులో ఉన్నది మహిళా అఘోరి అని గుర్తించిన పోలీసులు ఆమెతో మాట్లేడే ప్రయత్నం చేశారు. తను విశాఖ వైపు నుంచి చెన్నై వెళ్తున్నానని, కొంత సమయం విశ్రాంతి తీసుకుని బయలుదేరి వెళతానని చెప్పడంతో పోలీసులు గుమికూడిన ప్రజలను అక్కడ నుంచి పంపించివేశారు. సోమవారం మధ్యాహ్నం ఒకటిన్నర సమయంలో ఆగిన కారులో ఉన్న అఘోరీ కిందికి దిగుతుందేమో, ఏమైనా హడావుడి చేస్తుందేమోనని సమీపంలో కాపు కాసిన పోలీసులు మూడున్నర సమయంలో అక్కడి నుంచి కారును స్వయంగా నడుపు కుంటూ బయలు దేరడంతో సదరు సమాచారాన్ని పై అధికారులకు చేరవేసిన పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.



వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన భారతి

గురజాలలో.. వైసీపీకి షాక్

(5వ పేజీ తరువాయి)

మున్సిపల్ చైర్‌పర్సన్‌తో సహ టీడీపీ కండువా కప్పుకున్నారు. వైసీపీ హయాంలో ఎన్నికలు జరగనీయకుండా వైసీపీకి చెందిన వారే ఒక్కొక్కరు నామినేషన్ వేయడంతో 33 మంది సభ్యులు వైసీపీ కౌన్సిలర్లు కావడంతో పురపాలక సంఘం వైసీపీ ఖాతాలో జమ అయింది. మరో ఏడాదిలో ఎన్నికలు వుండగా ఇప్పుడు 17 మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరడంతో వైసీపీకి షాక్ ఇచ్చినట్లు అయింది.

మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా భారతి ఏకగ్రీవ ఎన్నిక

పిడుగురాళ్ల పురపాలక సంఘం 30వ వార్డు కౌన్సిలర్‌గా వున్నం భారతి వైస్‌చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి వి మురళీకృష్ణ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. వైసీపీకి చెందిన 17 మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరుకాగా 30వ వార్డు కౌన్సిలర్ వున్నం భారతి పేరును 28వ వార్డు కౌన్సిలర్ గర్రె నాగేశ్వరరావు ప్రతిపాదించగా 20వ వార్డు కౌన్సిలర్ కొత్త తులసి బలపరచగా మిగిలిన సభ్యులు ఆమోదం తెలిపారు. దీంతో వున్నం భారతిని వైస్‌చైర్మన్‌గా ధృవీకరిస్తూ ప్రత్యేక అధికారి మురళీకృష్ణ నియామకపత్రాన్ని భారతికి అందజేశారు. అనంతరం 17 మంది కౌన్సిలర్లు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో పార్టీలో చేరారు.

అభివృద్ధి యరపతినేనితోనే సాధ్యం

- చైర్మన్ చినసుబ్బారావు

గురజాల నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతోనే సాధ్యమవుతుందని తామంతా టీడీపీలో స్వచ్ఛందంగా చేరుతున్నామని చైర్‌పర్సన్ కొత్త చినసుబ్బారావు, మరికొందరు కౌన్సిలర్లు తెలిపారు. సోమవారం పిడుగురాళ్ల పట్టణ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో అభివృద్ధే తారక మంత్రంగా తాను పనిచేస్తున్నానని, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నికకు వైసీపీ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా వున్నం భారతిని ఎన్నుకోవడం జరిగిందన్నారు. వైసీపీ ఐదేళ్ల అరాచకపాలనలో అనేక విధ్వంసాలకు పాల్పడ్డారే తప్ప అభివృద్ధి జోలికి వెళ్లలేదన్నారు. పురపాలక సంఘ భవనానికి తమ హయాంలోనే 2 కోట్ల రూపాయలు మంజూరు చేయించానన్నారు. రాబోయే ఐదేళ్లకు ఏమేమి అభివృద్ధి సాధించాలో ప్రణాళిక ప్రకారం ముందుకు పోతున్నామన్నారు. టిడ్కో గృహాలు, రహదారుల విస్తరణ, మంచినీటి పథకానికి నిధులు మంజూరు చేయడం తెలుగుదేశం పార్టీ ఘనత అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చినగంజాం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాలెం, పెదగంజాం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మంగళవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ పడవల ఘననారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపాలెం విద్యుత్ కేంద్రం నుంచి పెదగంజాం విద్యుత్ కేంద్రానికి వెళ్లే లైన్‌లో విద్యుత్ వైర్లు, నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చినగంజాం, పల్లెపాలెం, రాజుబంగారుపాలెం, కొత్తపాలెం, పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిల్లోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్‌లతో ఎస్ఐ వెంకటేశ్వర్లు

వేటపాలెంలో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్‌లు

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్‌లను ఎస్ఐ వెంకటేశ్వర్లు పట్టుకున్నారు. అర్ధరాత్రి సమయంలో ఇసుక రవాణా చేస్తున్నట్లు అందిన విశ్వసనీయసమాచారంతో సిబ్బందితో దాడులు నిర్వహించి పందిళ్లపల్లి జంక్షన్‌లో మూడు ట్రాక్టర్‌లను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్‌లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వేధిస్తున్న పోలీస్ సిబ్బంది కొరత

» న్యాయ పరిష్కారాల్లో తీవ్ర జాప్యం

» ఫిర్యాదుదారులకు ఇబ్బందులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలో పోలీస్ స్టేషన్‌లకు సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో స్టేషన్‌లను ఆశ్రయించిన ఫిర్యాదుదారులు న్యాయ పరిష్కారంలో జాప్యంతో ఇబ్బందులు పడుతున్నారు. చీరాల ఒకటవ పట్టణానికి రైల్వే స్టేషన్, బస్టాండ్, కూరగాయల మార్కెట్, ముంతావారి సెంటర్ నిత్యం ప్రజలు, వాహనదారులతో రహదారులు రద్దీగా ఉంటాయి. ఈక్రమంలో కొంత ట్రాఫిక్ సమస్యలు ఉంటాయి. అలాగే వాహనాలు చోరీతో పాటు, రోడ్డు ప్రమాదాల వివాదాలు అధికమే. అలాగే చీరాల చుట్టుపక్కల ఎక్కడ సమస్య జరిగినా ఆ కుటుంబ సభ్యులు, మద్దతుదారులు, లేదా పార్టీలు, వ్యక్తులు గడియార స్తంభం కూడలి వద్ద ధర్నా కార్యక్రమాలు చేస్తుంటారు. అంతేకాకుండా స్టేషన్ పరిధి ఒక వైపు జాండ్రపేట వరకు మరోవైపు చీరాల ఏరియా హాస్పిటల్ సమీపంలోని కుందేరు వరకు ఉండగా, గేటు అవతలి నుంచి వైకుంఠపురం, విఠల్‌నగర్, హరి ప్రసాద్‌నగర్ వంటి జోన్‌లు కూడా ఉన్నాయి. దీంతో తలెత్తిన సమస్యలు అధికంగా ఉండగా, గస్తీ నిర్వహించేందుకు విస్తీర్ణం కూడా ఎక్కువగానే ఉంది. స్టేషన్‌లో ప్రస్తుతం ఒక ఎస్‌హెచ్‌వో, ఒకరు ట్రాఫిక్ ఆర్ఎస్సై, ఇద్దరు స్టేషన్‌కు పరిమితం కాగా, మరొకరు రికవరీలకు సుప్రసిద్ధులుగా పేరు గాంచడంతో అవసరాలకు అనుగుణంగా అన్ని స్టేషన్‌లకూ వినియోగిస్తున్నారు. సుమారు 50 మంది మాత్రమే ఉండగా వీరిలో సెలవుల్లో ఉన్నవారు, రికార్డు వర్క్‌లు, దర్యాప్తు, ట్రాఫిక్ వగైరాతో పోల్చుకుంటే నానా యాతన అవుతుంది.



చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్

రెండవ పట్టణ పరిధిలో ఒక ఎస్‌హెచ్‌వో, ఇద్దరు ఎస్సైలు ఉండగా సుమారు 50 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. ఇక్కడ పేరాల, జయంతిపేట, జాన్‌పేట, ఐక్యనగర్, కొత్తపేట రోశయ్య నగర్, ఐఎల్‌టీడీ కాలనీతో పాటు శృంగారపేట, రామనగర్, ఆదినారాయణపురం వంటి ప్రాంతాలు స్టేషన్ పరిధిలో ఉన్నాయి. వీటిల్లో కొన్నిప్రాంతాల్లో సారా, కొట్లాట కేసులతోనే పోలీసులు తల మునకలవుతుంటారు. ఈక్రమంలో చాలీచాలని సిబ్బందితో పోలీసులు రోజులు గడుపుతున్నారు. చీరాల రూరల్ పరిధిలో ఈపూరుపాలెం, వేటపాలెం స్టేషన్‌లు పేరు చిన్నవే అయినా లా అండ్ ఆర్డర్ సమస్యలు అధికం. నిత్యం సివిల్, క్రిమినల్ కేసులు పేట్రేగుతుంటాయి. అక్రమ ఇసుక రవాణా, జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాలు అధికమే. అంతేకాకుండా ఈరెండు స్టేషన్‌లకు ప్రొటోకాల్ డ్యూటీలు కోకొల్లలు. ఈనేపథ్యంలో స్టేషన్‌లను ఆశ్రయిస్తున్న ఫిర్యాదుదారులు తలలు పట్టుకుంటున్నారు. పరిష్కారం కోసం స్టేషన్‌ల వద్ద ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈక్రమంలో సిబ్బందిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని బాధితులు కోరుతున్నారు.



జలవనరుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ మోహనరావు

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయం ద్వారా చేపట్టిన ఉత్పత్తులను వినియోగిస్తే ఆరోగ్యం ఎంతో బాగుంటుందని పర్చూరు ఏడీఏ మోహనరావు అన్నారు.సోమవారం యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం జలవనరుల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రంలో రైతులు సాగుకు అవసరమైన అన్నిరకాల కాషాయాలు, ద్రావణాలను అందుబాటులో ఉంచామన్నారు. అదేవిధంగా రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. తక్కువ ఖర్చుతో, నాణ్యమైన ఉత్పత్తులు సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఏవో మేరీ మరియమ్మ, ఏడీపీఎం మోహన్, ఎంటీ వెంకటేశ్వర్లు, కోటిబాబు పాల్గొన్నారు.

స్వయం సంఘాల వివరాలను నమోదు చేయాలి



యాప్ వినియోగంపై వీవోఏలకు సూచనలిస్తున్న ఏపీఎం

పంగులూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని స్వయం సహాయక సంఘాల పూర్తి వివరాలను వీవోఏలు ఎన్ఆర్ఎల్ఎం పోర్టల్‌లో నమోదు చేయాలని ఏపీఎం జ్యోతి ప్రసాద్ సూచించారు. వెలుగు కార్యాలయంలో సోమవారం లోకోస్ యాప్ వినియోగంపై వీవోఏలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డ్వాక్రా సంఘాలకు రుణాల పంపిణీ, రికవరీపై స్త్రీనిధి మేనేజర్ టి.శ్రీనివాసరావు సమీక్ష చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తీసుకున్న రుణాలు నిర్ధీత సమయంలో తిరిగి చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీసీ సురేష్, పూర్ణ, ఎకౌంటెంట్ భాస్కరమ్మ, పలువురు వీవోఏలు పాల్గొన్నారు.

ఇంకొల్లు : డ్వాక్రా గ్రూపు సభ్యుల పూర్తి వివరాలను యాప్‌లో తప్పని సరిగా పొందుపరచాలని ఏపీఎం అనూరాధ సూచించారు. వెలుగు కార్యాలయంలో సోమవారం గ్రామ సంఘం లోకోస్ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏవో వేణుగోపాల్, సీసీ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

పోలీసు వృత్తి కత్తిమీద సామువంటిది



సీఐ శేషగిరిరావుకు జ్ఞాపికను అందిస్తున్న ప్రతినిధులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక యుగంలో పోలీసు వృత్తి కత్తిమీద సాములా ఉందని, ఎందరినో మెప్పించి సాహసోపేతంగా గమ్యాలు చేరుకోవడం అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఇటీవల ఎస్పీ తుషార్‌డూడీ చేతులమీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్న రూరల్ సీఐ శేషగిరిరావును పలువురు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. జ్ఞాపికను అందించి దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీస్ ఐక్య వేదిక అధ్యక్షుడు జ్యోతిరమేష్ బాబు, జిల్లా అధ్యక్షుడు జగన్నాథం, యోహాను, విజయ్‌కుమార్, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

గంజాయి పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా

వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు

చీరాలటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసుల్లోని పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం రాత్రి స్టేషన్ పరిధిలోని ఉజిలీపేట ప్రాంతంలో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో సీఐ మాట్లాడుతూ దాదాపు గంజాయికి అడ్డుకట్ట వేసినట్లు చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా పాత నేరస్థులపై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. గంజాయి విక్రయాలు, రవాణా జరిపితే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీఐ వెంట పలువురు స్టేషన్ సిబ్బంది ఉన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు

విద్యార్థుల భవితవ్యంపై దృష్టి సారించాలి

ఎమ్మెల్యే కొండయ్య

చీరాలటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలోని విద్యార్థుల భవితవ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. సోమవారం వేటపాలెం మండల పరిధిలోని అక్కయ్యపాలెం ఎంపీయూపీ స్కూల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈసందర్భంగా స్కూల్‌ను మోడల్‌గా మార్చేందుకు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో నివేదికను సిద్ధం చేయించాలని సూచించారు. అనంతరం కొండయ్య విద్యార్థులతో ముచ్చటించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. అలాగే చల్లారెడ్డి పాలెంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వాడరేవు గ్రామంలో నిరుపయోగంగా ఉన్న బీసీ సంక్షేమ హాస్టల్‌ను పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. అంతేకాకుండా వాడరేవుకు చెందిన మత్స్యకారుడు ఎరిపిల్లి రమణ(53) వేటకు వెళ్లి అదృశ్యమైన విషయం తెలిసిందే. దీంతో ఆకుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు. అంతకముందు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రూ.13లక్షల 20వేల సీఎం సహాయ నిధి చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు.



విద్యార్థినికి నోట్ పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

జీతాలు చెల్లించండి మహాప్రభో

11 పాఠశాలల్లో పనిచేస్తున్న

ఆయాలకు ఏడు నెలలుగా అందని వైనం

బల్లికురవ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలను ప్రతి రోజు పరిశుభ్రం చేస్తున్న 11 పాఠశాలల ఆయాలకు ఏడు మాసాలుగా జీతాలు చెల్లింపులు చేయలేదు. దీంతో ఆయాలు జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వైదన, కొత్తపాలెం, అంబడిపూడి, ఉప్పుమాగులూరు, జమ్ములమడక, వల్లాపల్లి, కోటవారిపాలెం, బల్లికురవ గ్రామాలలో ఉన్న 11 పాఠశాలలకు జూలైలో నూతనంగా ఆయాలను నియమించారు. వారికి అప్పటి నుంచి జీతాలు మాత్రం చెల్లింపులు చేయడం లేదు. తమకు ఏడు నెలలుగా జీతాలు రావడం లేదని వారు ఎంఈవో కార్యాలయాన్ని సంప్రదించగా వారు మేము జిల్లా కార్యాలయానికి జీతాల ఫైల్ పంపామని అక్కడ అధికారులు సరిగ్గా స్పందించడం లేదని సమాధానం చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచీ పాఠశాలల్లో ఉన్న మరుగుదొడ్లు, ప్రాంగణం పరిశుభ్రం చేసే తమకు జీతాలు ఇవ్వకుంటే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆయాలు వాపోతున్నారు. నెలకి రూ. 6వేల వంతున జీతం రావాల్సి ఉందని వారు తెలిపారు. తమ తోటి పనిచేసే ఇతర పాఠశాలల ఆయాలకు నెలనెలా జీతాలు వస్తున్నాయని తమకు మాత్రమే జీతాలు ఎందుకు చెల్లించడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. జిల్లా అధికారులు జీతాల చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టాలని 11 పాఠశాలలకు చెందిన ఆయాలు కోరుతున్నారు.



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో ప్రతినిధులు

పోటీలతో బహుళ ప్రయోజనాలు

చీరాలటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పోటీల్లో పాల్గొనడం వలన శరీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం ఉంటుందని సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో కాకినాడ జెఎన్‌టీయూ ఆధ్వర్యంలో పవర్ లిఫ్టింగ్ (స్త్రీ, పురుషులు) ఇంటర్ కాలేజీ సెలక్షన్స్ ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా వేటపాలెం ఎస్ఐ వెంకటేశ్వర్లు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోటీల్లో గెలుపు ఓటములు సహజమని, రెండింటినీ ఒకేలా స్వీకరించి విజయాలకు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.జగదీష్, వ్యాయామ ఉపాధ్యాయులు అన్నం శ్రీనివాసరావు, డా.శేషగిరిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచినీటి పథకాలను శుభ్రం చేయండి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాలల్లో ఉన్న రక్షిత మంచినీటి పథకాలను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని ఎంపీడీవో బత్తిని సింగయ్య గ్రామాలలోని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం మండలంలోని అన్ని గ్రామాలలోని రక్షిత మంచినీటి పథకాలను ఆయా గ్రామాలల పంచాయతీ కార్యదర్శులతో తనిఖీ చేయించారు. ట్యాంకులో పక్షుల కళేబరాలు, శరీరభాగాలు, పక్షుల మలం, ఇతర వ్యర్థాలు ఏమైనా ఉన్నాయని తనిఖీ చేశారు. వెంటనే ట్యాంక్‌లను శుభ్రం చేసి క్లోరినేషన్ చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలందరూ కాచి చల్లార్చి వడకట్టిన నీటిని తాగాలని ఎంపీడీవో తెలిపారు. బర్డ్‌ఫ్లూ వ్యాధి నివారణ దృష్ట్యా మరిగే నీటిలో బాగా ఉడికించిన చికెన్‌ను మాత్రమే తినాలని తెలిపారు.

రొంపేరు కాలువలోకి ట్రాక్టర్ బోల్తా

» ఒకరు మృతి, పలువురికి స్వల్పంగా గాయాలు

» ధాన్యం తరలించేందుకు వెళ్తుండగా ప్రమాదం

కారంచేడు (పర్చూరు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రొంపేరు వాగులో ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి చెందగా పలువురు కూలీలు గాయపడిన ఘటన సోమవారం కారంచేడులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కారంచేడు గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ గర్నెపూడి పోతురాజు(42) మరికొంత మంది కూలీలతో కలసి ధాన్యం తరలించేందుకు వెళుతున్న నేపథ్యంలో ఈప్రమాదం జరిగింది. పోలీస్ స్టేషన్ సమీపంలోని రొంపేరు వాగుపై ఉన్న బ్రిడ్జిని ఎక్కించే క్రమంలో ప్రమాదానికి గురై పక్కనే ఉన్న కాలువలోకి బోల్తాపడింది. ఈప్రమాదంలో పోతురాజు ట్రాక్టర్‌తో పాటు నీటిలో పడిపోయి అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటీన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గురై ప్రాణాపాయస్థితిలో ఉన్న పోతురాజును కానిస్టేబుల్ యనమల బాల శంకరావు సీపీఆర్ నిర్వహించి 108లో చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు.



కారంచేడు వద్ద రొంపేరు కాలువలో బోల్తాపడిన ట్రాక్టర్



పోతురాజు మృతదేహం

తప్పిన పెనుప్రమాదం

ప్రమాద సమయంలో ట్రాక్టర్‌లో ఐదుగురు కూలీలు ఉన్నారు. బ్రిడ్జిపై నుంచి కాలువలోకి ట్రాక్టర్ పడిపోయింది. అదృష్టవశాత్తు స్వల్పగాయాలతో కూలీలు బయట పడ్డారు. దీంతో పెను ప్రమాదం తప్పిందని ఊపిరిపీల్చుకున్నారు.

కాగా కొనఊపిరితో ఉన్న పోతురాజును కాపాడేందుకు కానిస్టేబుల్ బాలశంకరరావు అన్నివిధాలా ప్రయత్నించారు. నోటిలో నోరుపెట్టి ప్రాణ వాయువు అందించేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఆయన కృషిని స్థానికులు అభినందించారు.



కూలీలకు సూచనలిస్తున్న ఏపీవో సంతోషం

కొలతల ప్రకారం పనిచేస్తే రూ.300 కూలి

పంగులూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనులకు వచ్చేవారు పని ప్రదేశంలో నాలుగు గంటలపాటు ఉండాలని, కొలతల ప్రకారం పనిచేయాలని ఏపీవో సంతోషం అన్నారు. మండలంలోని బూదవాడ, కల్లంవారిపాలెం, ఆరికట్లవారిపాలెం గ్రామాలలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఏపీవో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలీలకు కేటాయించిన కొలతల ప్రకారం పని చేస్తే రూ.300 వస్తుందన్నారు. ఉపాధి పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. కూలీలకు పనిపట్ల అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఏ కావ్య, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

బల్లికురవ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళ, బుధ, గురువారం వరకూ శిక్షణ తరగతులు జరుగుతాయని సీడీపీవో సుధ తెలిపారు. బల్లికురవ, కొప్పెరపాడు ఉన్నత పాఠశాలల్లో ఈ శిక్షణ జరుగుతుందని సీడీపీవో తెలిపారు.


సంతమాగులూరు : అంగన్వాడీ కార్యకర్తలకు నేటి నుంచి 20వ తేదీ వరకు సంతమాగులూరులోని జడ్పీ హైస్కూల్, ఏల్చూరు హైస్కూల్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో సుధ తెలిపారు.

బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే చర్యలు

బల్లికురవ. ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాలలో ఎవరైనా మద్యం తాగి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు అని ఎస్ఐ జీవీ చౌదరి హెచ్చరించారు. సోమవారం బల్లికురవ బస్‌స్టేషన్ ఆవరణలో మద్యం సేవిస్తున్న వారికి ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. పాఠశాల, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం గ్రామాల్లో హోటళ్లను ఎస్ఐ తనిఖీ చేశారు.

వాలిన కరెంట్ పోల్

పొంచి ఉన్న ప్రమాదంపై ఆందోళన



ముక్తేశ్వరంలో పడి పోయేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ పోల్

బల్లికురవ. ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో విద్యుత్ స్తంభంతో ప్రమాదం పొంచి ఉంది. చెన్నుపల్లి నుంచి ముక్తేశ్వరం గ్రామానికి వచ్చే ప్రదాన మలుపు వద్ద ఉన్న కరెంట్ పోల్ వాలి ఉంది. దీంతో ఈస్తంభం కూలితే పక్కనున్న గృహాలపై పడి పెను ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్తంభాన్ని వెంటనే సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రైవేటు వైద్యుడు మృతి

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం గన్నవరం గ్రామంలో గత 30 ఏళ్ల నుంచి ఆర్ఎంపీగా వైద్య సేవలందిస్తున్న ద్రోణాదుల కోటేశ్వరరావు (58) అనారోగ్య కారణంగా మృతి చెందారు అతనికి భార్య కుమారుడు ఉన్నారు. అనారోగ్యంతో గుంటూరులోని ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందారు. సోమవారం పలువురు చుట్టుపక్కల గ్రామీణ వైద్యులు అతని మృతదేహానికి నివాళులర్పించారు.

కాల్వల్లో పూడికతీత

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం యనమదల గ్రామంలో సోమవారం పంచాయతీ అధికారులు సైడు కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టారు. వారం రోజులుగా గ్రామంలో పేరుకున్న చెత్తకుప్పలను, కాలువల్లోని మురుగును తొలగించారు. పారిశుధ్య పనులను ఈవోఆర్డీ కృష్ణ పరిశీలించగా, కార్యదర్శి రాణి, నాయకులు వీరభద్రయ్య, చంద్రయ్య పర్యవేక్షించారు.

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించండి

వేటపాలెం (చీరాలటౌన్), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వేటపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ప్రతినిధులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, మినీ సెంటర్‌లను మెయిన్ సెంటర్‌లుగా మార్చాలని అన్నారు. కార్యక్రమంలో ఎం.వసంతరావు, రేఖా ఎలిజబెత్, ప్రమీల, బ్యూలా, సుజీవన, పద్మ, శిరీష, జ్యోతి, భూలక్ష్మి, అనిత, నిర్మల పాల్గొన్నారు.

ఇంకొల్లు : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు సోమవారం ధర్నా చేపట్టారు.

2 లీటర్ల సారా స్వాధీనం

చీరాలటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : సారా నియంత్రణకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు అన్నారు. సిబ్బందితో కలిసి సోమవారం దాడులు నిర్వహించి ఆదినారాయణపురంలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 2 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు.

ఆదర్శనీయుడు మురళీసుధాకర్

అద్దంకి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పలు రకాల సేవా కార్యక్రమాలు చేస్తూ చుండూరి మురళీసుధాకరరావు ఆదర్శంగా నిలుస్తున్నారని సాహితీ కౌముది అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అన్నారు. గోశాల నిర్వహణకు ప్రోత్సాహం, రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ, సాహిత్యానికి ప్రోత్సాహం అందిస్తున్న చుండూరి మురళీసుధాకరరావు, ప్రసన్న దంపతులను సోమవారం పుట్టంరాజు కళాక్షేత్రంలో పలు సాహితీ సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అద్దంకి మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, 16 సంవత్సరాలుగా రక్తదానాన్ని ప్రోత్సహిస్తూ 441 రక్తదానాలు చేయించారన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు వారణాసి రఘురామశర్మ, రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, పోలిరెడ్డి, గాడేపల్లి దివాకర్‌దత్, డీవీఎం సత్యనారాయణ, కొండకావూరి కుమార్, కూరపాటి రామకోటేశ్వరరావు, రాజశేఖర్, కడియం పాపారావు, పీసీహెచ్ కోటయ్య, ఆర్వీ రాఘవరావు, చాగంటి శేషారెడ్డి, మలాది శ్రీనివాసరావు, నిమ్మరాజు నాగేశ్వరరావు, రామకోటేశ్వరరావు, న్యాయవాది రమేష్ పాల్గొన్నారు.



మురళీసుధాకరరావు, ప్రసన్న దంపతులను సన్మానిస్తున్న సాహితీ కౌముది సంస్థ ప్రతినిధులు



కందుకూరు మున్సిపాలిటీకి ఎన్నికలు?

- మే, జూన్‌లో నిర్వహణకు సన్నాహాలు
- సీఎం పర్యటన ఉద్దేశం అదేనా!?

- వివరాలు 6లో..

పేదల ఆసుపత్రుల్లో అత్యవసర మందులు కరువయ్యాయి. వైద్యశాలల్లో ఉన్న మందులనే డాక్టర్లు రోగులకు ఇస్తున్నారు. ఫలానా మందులు కావాలని రోగులు అడిగితే బయట కొనుగోలు చేసుకోమంటూ ఉచిత సలహా ఇస్తున్నారు. నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలతోపాటు ఆత్మకూరు, కావలి, కందుకూరులలోని ప్రధాన ఆసుపత్రులను సోమవారం 'ఆంధ్రజ్యోతి' బృందం విజిట్ చేసింది.

మందుల్లేవ్.. ఇన్సులిన్ సూదుల్లేవ్!

- పేదల ఆసుపత్రుల్లో ఇదీ పరిస్థితి



నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాకే తలమానికంగా ఉన్న నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో (జీజీహెచ్) మందుల కొరత తీవ్రంగా ఏర్పడింది. అత్యవసర మందులు సరఫరా కాకపోవడంతో పేద రోగులపై భారం పడుతోంది. జీజీహెచ్‌కు రోజుకు 1200 మంది రోగులు వస్తుండగా, 500 మంది వరకు ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతుంటారు. హిమోఫిలియా రోగులకు ఇచ్చే ఫ్యాక్టర్ ఇంజక్షన్‌లు ఇక్కడ లేవు. అలాగే మధుమేహ బాధితులకు ఇచ్చే నాలుగు రకాల ఇంజక్షన్ల కొరత కూడా ఉంది. ప్రభుత్వ వీటిని సరఫరా చేయక పోవటంతో జీజీహెచ్ అధికారులే కొనుగోలు చేస్తున్నారు. అది కూడా ఒక రకానికి చెందిన ఇన్సూలిన్ మాత్రమే. టెనిలిగ్లిప్లిన్ మాత్రలు కూడా సరఫరా కావటం లేదు. మల్టీవిటమిన్ ట్యాబ్లెట్‌లు రాస్తే వాటికి బదులు బీ కాంప్లెక్స్ మాత్రలు ఇస్తున్నారు. కంటికి సంబంధించి కొన్ని రకాల చుక్కల మందులను బయట కొనుక్కోమని చీటీ రాసిస్తున్నారు. కొన్ని యాంటీబయాటిక్ మందులు కూడా రోగులు బయటే కొనుగోలు చేస్తున్నారు.

ఆత్మకూరులో స్లిప్పుల్లేవ్!

ఆత్మకూరు : పట్టణంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో పాన్‌టాప్, బీకాంప్లెక్స్ మందులు అందుబాటులో లేవు. పాన్‌టాప్ బదులు రాన్‌టిడిన్ ఇస్తుండటంతో కొంత ఉపయుక్తంగా ఉంది. కాగా, డాక్టర్లు రాసిచ్చే మందుల చీటీల కొరతతో (స్లిప్పులు) రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోగులను డాక్టర్లు పరిశీలించి అవసరమైన మందులను కార్బన్ పేపరు పెట్టి రెండు చీటీలను రోగులకు రాసివ్వాలి. ఒక చీటీని ఫార్మసిస్టు వద్ద ఉంచుకుని రికార్డులో నమోదు చేసుకుంటారు. మరో చీటీ రోగుల వద్ద ఉంటుంది. కానీ స్లిప్‌ల కొరతతో డాక్టర్లు ఒక మందుల చీటీని మాత్రమే రాసిస్తున్నారు. ఫార్మసిస్టు ఆ చీటీని తీసుకుని తన వద్దనే ఉంచుకుంటున్నారు. దీంతో రోగులు ఆ మాత్రలను ఏ సమయంలో మింగాలో అర్థం కావడం లేదు. దీనికితోడు జబ్బు నయంకాని రోగులు తిరిగి డాక్టర్ల వద్దకు వస్తే ఏం మందులు వాడారో తెలియక ఇబ్బంది పడుతున్నారు.



ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో కౌంటర్ వద్ద మందుల తీసుకుంటున్న రోగులు

ఇన్సులిన్ లేదన్నారు!

మధుమేహ వ్యాధికి ఇన్సులిన్ కోసం జీజీహెచ్‌కి వెళితే అందుబాటులో లేవని చెప్పారు. విధిలేని స్థితిలో బయట కొనుగోలు చేస్తున్నా. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ఇన్సులిన్లను అందుబాటులో ఉంచాలి.

- వెంకటేశ్వర్లు

మందుల కొరత ఉంది

జీజీహెచ్‌లో మందుల కొరత ఉంది. చాలా వ్యాధులకు బయట కొనుగోలు చేయాలని వైద్యులు రాస్తున్నారు. ప్రభుత్వ నుంచి ఆశించిన స్థాయిలో మందులు రాకపోవటంతో అత్యవసర మందులను లోకల్‌గా కొనుగోలు చేస్తున్నాం.

- నరేంద్ర, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్

కావలిలో సిరప్‌ల్లేవ్!

కావలి (టౌన్) : కావలి ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో షుగర్‌కు సంబంధించి రెండు రకాల మందులు అవసరం కాగా ఒక రకం మాత్రమే ఏపీ పేషంట్లకు ఇస్తున్నారు. వీటి కోసం ఇండెంట్ పెట్టగా అవి ఖరీదైనవి కావటంతో ఇంకా సరఫరా కాలేదు. అలాగే కొన్ని యాంటీ బయటిక్ సిరప్‌లు కూడా అందుబాటులో లేవు. వైద్యశాలలో అందుబాటులో ఉన్న మందులను మాత్రమే రాసిస్తుండటంతో రోగులు బయట కొనాల్సిన పనిలేదు. మంచి మందులు కావాలని అడిగిన వారికి మాత్రం బయటకొనుగోలు చేసుకోమని రాసిస్తున్నారు.

- కందుకూరు : స్థానిక ఏరియా వైద్యశాలలో అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయి. కొన్ని రకాల మందులకు ప్రత్యామ్నాయంగా మార్కెట్లో ప్రాచుర్యం పొందిన మందులను మాత్రం పేషెంట్లు కోరుకుంటే బయటకు రాస్తున్నామని వైద్యాధికారులు వివరించారు. అంతకు మినహా ఎలాంటి మందుల కొరత లేదని వివరించారు.

ఇమ్యునోగ్లోబలిన్ ఇంజక్షన్లు ఏవీ?

గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసులు రాష్ట్రవ్యాప్తంగా నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో జీజీహెచ్‌లో తప్పనిసరిగా ఇమ్యునోగ్లోబలిన్ ఇంజక్షన్‌లు అందుబాటులో ఉండాలి. అయితే రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) వీటిని సరఫరా చేయటం లేదు. మరోవైపు మానసిక వ్యాధులకు కూడా అత్యసర మందులు లేకపోవటంతో వైద్యులు బయట కొనుగోలు చేయాలని రాస్తున్నారు. గుండెపోటు బాధితులకు తక్షణం ఇవ్వాల్సిన టెనెక్టెప్లేస్ ఇంజక్షన్ అందుబాటులో ఉంది. పక్షవాత రోగులకు కూడా ఈ ఇంజక్షన్‌ను వినియోగిస్తున్నారు. మిగిలిన వ్యాధులకు తక్షణం అందించాల్సిన మందులూ జీజీహెచ్‌లో లభించడం లేదు.

గులియన్ గుబులు!!

- జిల్లా వాసులను భయపెడుతున్న జీబీఎస్
- జీజీహెచ్‌లో ఏడాది కాలంలో 20 కేసులకు చికిత్స
- కానీ కేసులే లేవంటున్న వైద్య శాఖ!
- ఇమ్యునోగ్లోబలిన్ ఇంజక్షన్ల సరఫరా ఆపేసిన ప్రభుత్వం
- రోగులకు రూ.4 లక్షల నుంచి రూ. 12 లక్షల వరకు ఖర్చు
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయమే

గులియన్ బారే సింద్రోమ్ (జీబీఎస్) వ్యాధి జిల్లా వాసులను భయపెడుతోంది. వైద్య ఆరోగ్యశాఖ జిల్లాలో జీబీఎస్ కేసులు ఏమీ నమోదు కావటం లేదని చెబుతునప్పటికీ ఏడాది కాలంగా నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 20 మంది జీబీఎస్ వ్యాధిగ్రస్థులకు చికిత్స అందచేయటం గమనార్హం. ప్రస్తుతం వారంతా ఆరోగ్యంగా ఉన్నారు. తాజాగా జీబీఎస్ అనుమానంతో ఓ వ్యక్తికి జీజీహెచ్‌లో వైద్యం చేస్తున్నారు. అయితే ఈ వ్యాధి చికిత్సకు అవసరమైన ఇమ్యునోగ్లోబలిన్ ఇంజక్షన్ జీజీహెచ్‌లో అందుబాటులో లేకపోవటంతో వైద్య నిపుణులు రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు సిపార్సు చేస్తున్నట్లు తెలిసింది. ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలోనూ ఈ వ్యాధికి చాలా తక్కువ మొత్తంలో చెల్లింపులు ఉండటంతో ఆసుపత్రులు రోగుల నుంచి అదనంగా వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం.

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఇటీవల కాలంలో జీబీఎస్ వ్యాధి కారణంగా రెండు మరణాలు సంభవించడంతో, పదుల సంఖ్యలో బాధితులు ఆసుపత్రుల్లో చేరడంతో జిల్లా వాసుల్లో 'గులియన్' గుబులు పట్టుకుంది. ఈ వ్యాధి సోకితే కాళ్ల నుంచి నడుము, మెదడు వరకు నరాలు చచ్చుబడి కదల్లేని పరిస్థితి వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాధి జిల్లాలో చాపకంద నీరులా వ్యాపిస్తోందని అంచనా. ప్రస్తుతం జీజీహెచ్‌తోపాటు పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ వ్యాధిగ్రస్తులు చికిత్సలు పొందుతున్నారు. దీని నుంచి కోలుకునేందుకు నెల నుంచి ఆరు నెలల వరకు సమయం పడుతోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బాధితులు రూ.లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. వ్యాధిపై ఎలాంటి నిర్లక్ష్యం వహించినా ప్రాణాలు పోయే ప్రమాదం ఉన్నట్లు వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులే దిక్కు

జీబీఎస్‌కు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్య చికిత్సలు అందుబాటులో లేకపోవడంతో రోగులకు ప్రైవేటు ఆసుపత్రులే దిక్కవు తున్నాయి. ప్రస్తుతం వ్యాధిగ్రస్తులు నెల్లూరులోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నారు. వ్యాధికి అవసరమైన ఇమ్యునోగ్లోబిలిన్ ఇంజక్షన్ ఒక గ్రాము ఖరీదు రూ. 11వేలుగా ఉంది. వ్యాధిగ్రస్తునికి రోజుకు 5 ఇంజక్షన్లు ఇవ్వాలి. దీంతోపాటు ప్లాస్మాపెరిసిస్ చికిత్స చేస్తారు. ఆ చికిత్సకు ఒక్క సైకిల్‌కు రూ.లక్ష ఖర్చు అవుతుందని వైద్యులు చెబుతు న్నారు. దీంతో బాధితుని కండిషన్‌ను బట్టి రూ.4 లక్షల నుంచి రూ. 8 లక్షల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది.

జీజీహెచ్‌లో నిర్ధారణ పరీక్షలు నిల్?

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గులియన్ బారే సింద్రోమ్ వ్యాధిని నిర్ధారించే ఈఎన్ఎంజీ, ఎన్‌సీఎస్ పరీక్షలు చేయటం లేదు. అనుమానితులను ఈ పరీక్షల కోసం బయటకు పంపుతున్నారు. దీంతో బాధితులు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. వ్యాధి నిర్ధారణకు అవసరమైన పరికరాల కోసం జీజీహెచ్‌కు కేవలం రూ. 5 లక్షలు మంజూరు చేస్తే ఈ పరీక్షలు చేయవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవటంతో రోగులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు.

వ్యాధి లక్షణాలు

- జీబీఎస్ వ్యాధి సోకిన వారు బలహీనంగా ఉంటారు. • నడిచేటప్పుడు విపరీతమైన అలసటకు గురవుతారు. • ఊపిరితీసుకునే కండరాలు బలహీనపడతాయి. • మెదడు నుంచి శరీరమంతా ప్రయాణించే నరాలకు చెందిన మైలిన్ పొర దెబ్బతిని నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. • దీనివల్ల మాట్లాడేటప్పుడు, నడిచేటప్పుడు స్థిరత్వం ఉండదు. • గుండె స్పందనలు లయ తప్పుతాయి. జీర్ణశక్తి మందగిస్తుంది. • కండరాల నొప్పి, ఒళ్లంతా తిమ్మిరెక్కడం • కాళ్లు చచ్చుబడి నడవలేక పోవటం • పొత్తి కడుపు నొప్పి, డయేరియా. జ్వరం, వాంతులు, నీరసం • రోగ నిరోధక శక్తి తగ్గటం



ముందస్తు జాగ్రత్తలు

- కలుషిత ఆహారం తీసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి • ఇన్‌ఫ్లూయెంజా, టెటనస్ వంటి టీకాలపై అప్రమత్తంగా ఉండాలి • చిన్నపాటి కాళ్లనొప్పులు, తిమ్మిర్లు ఉన్నా వెంటనే వైద్యులను కలవాలి • ఈ వ్యాధి సోకిన ఒకట్రెండు వారాల తర్వాత బయటపడే అవకాశం ఉంది. • వెంటనే నరాల వ్యాధి నిపుణులను సంప్రదించి చికిత్స చేయించుకుంటే 4 వారాల్లో కోలుకునే అవకాశం ఉంది. వ్యాధి ముదిరితే కోలుకోవటానికి 6 నెలలు పట్టవచ్చు.

కొన్ని కేసులు పరిశీలిస్తే...

- నెల్లూరు రూరల్ మండలం వడ్డిపాళేనికి చెందిన ప్రశాంత్ (పేరు మార్చాం) అనే యువకుడికి రెండు నెలల క్రితం కాళ్లు చచ్చుబడి పోయా యి. క్రమేపి తిమ్మిర్లు వచ్చాయి. బాధితుడు నడవలేక పోవటంతో చెన్నై విజయ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ అన్నీ పరీక్షలు నిర్వహించి జీబీఎస్ వ్యాధిగా నిర్ధారించి చికిత్స చేశారు. వైద్యుల పర్యవేక్షణ కోసం నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఇప్పటి వరకు రూ.12 లక్షల వరకు ఖర్చు చేయాల్సి వచ్చింది.
- నెల్లూరులోని పొదలకూరు రోడ్డు పద్మావతి నగర్‌కు చెందిన 23 ఏళ్ల ఓ బ్యాంక్ ఉద్యోగినికి కాళ్ల నరాలు చచ్చుబడ్డాయి. దీంతో నగరంలోని ఓ న్యూరో స్పెషాలిటీ ఆసుత్రికి వెళ్లింది. అక్కడ వైద్యులు జీబీఎస్‌గా గుర్తించి వైద్య చికిత్సలు అందించటంతో ఆమె కోలుకున్నారు.
- నవలాకుల గార్డెన్‌కు చెందిన సాయి అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బెంగళూరులో ఉన్నారు. డిసెంబర్ నెలలో కాళ్లు తిమ్మిరెక్కి, నడవలేని స్థితికి వచ్చారు. దీంతో నగరంలోని ఓ న్యూరాలజిస్ట్ వద్ద చికిత్స చేయించుకుని కోలుకున్నారు. ఈ యువకునికి కూడా జీబీఎస్ వ్యాధిగా నిర్ధారణ అయి వైద్య ఖర్చుల కోసం రూ. 6 లక్షలు ఖర్చు పెట్టాల్సి వచ్చింది.
- నగరంలోని ఓ ఎలక్ట్రానిక్ మీడియా చానల్‌కు చెందిన యువకుడు నగరంలోని ఓ న్యూరో స్పెషాలిటీ వైద్యశాలలో జీబీఎస్ వ్యాధికి చికిత్స చేయించుకున్నారు. ఇందుకు రూ. 6 లక్షలు ఖర్చయింది. అదే చానల్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి కుటుంబంలోని 8వ తరగతి విద్యార్థి జీబీఎస్ బారిన పడటంతో తల్లిదండ్రులు హైదరాబాద్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించా రు. ప్రస్తుతం వారంతా కోలుకున్నారు.

జీజీహెచ్‌లో 20 మందికి చికిత్స



గత ఏడాది కాలంలో 20 మంది గులియన్ బారే సింద్రోమ్ బాధితులకు వైద్య చికిత్సలు విజయవంతంగా నిర్వహించాము. వ్యాధికి సంబంధించి అవసరమైన ఇమ్యునోగ్లోబలిన్ ఇంజక్షన్ కూడా ప్రభుత్వ సరఫరా చేయటంతో ఈ చికిత్సలు అందించటం జరిగింది. ప్రస్తుతం ఈ ఇంజక్షన్ సరఫరా ఆగిపోవటంతో వ్యాధిగ్రస్తులకు అవసరమైన చికిత్సలు పూర్తి స్థాయిలో అందించ లేకపోతున్నాము. వ్యాధి నిర్ధారణకు రూ.5 లక్షలు ఖర్చు చేస్తే ఈఎన్ఎంజీ, ఎన్‌సీఎస్ పరీక్షలు చేసే వీలుంటుంది.

- డాక్టర్ నరేంద్ర, జీజీహెజ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్

నేటి నుంచి బడిలో భాషల పండుగ

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం (21న) సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో భాషల పండుగ నిర్వహణకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 18 నుంచి 21వ తేదీ వరకు పలు భాషలకు సంబంధించి వివిధ పోటీలు నిర్వహించేలా మార్గదర్శకాలు జారీ చేసింది. జిల్లాలోని 345 పాఠశాలల్లో మంగళవారం నుంచి భాషల పండుగ కార్యక్రమాలను నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. దీనికోసంగా ఒక్కో పాఠశాలకు రూ.500 చొప్పున రూ.1.72 లక్షలు విడుదల చేశారు. ఎంపిక చేసిన భాషలకు సంబంధించి ఆయా తేదీల్లో పఠనం, పొట్టి కథలు చెప్పడం, రాయడం, చర్చావేదిక, వక్తృత్వం, ఉపన్యాసం, స్పెల్‌చెక్, రోల్‌ప్లే, బోధనోపకరణాల తయారీ వంటి అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తారు. సంస్కృతంలో శ్లోకాలు, ఉర్దూలో గజల్స్ చెప్పడానికి అవకాశం కల్పిస్తారు. సంప్రదాయ నృత్యాలు, పాటలు, ఆటలు నిర్వహిస్తారు. డిప్యూటీ ఈఓలు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎస్‌ఏ అధికారులంతా షెడ్యూల్ ప్రకారం భాషా ఉత్సవాలు నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చినట్లు డీఈవో బాలాజీరావు తెలిపారు.

కూరగాయలను మార్కెట్ ధరకే అమ్ముకోండి

నెల్లూరు (వ్యవసాయం), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సాగవుతున్న కాయగూరలకు సరైన ధర లేకపోతే మార్కెట్ ధరకే రైతు బజార్లలో నేరుగా అమ్ముకునేలా ఉన్నతాధికారులు అవకాశం కల్పించినట్లు మార్కెటింగ్ ఏడీ అనితకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యాన శాఖ, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శులను కలిసి వివరాలు తెలియజేయాలని తెలిపారు. తద్వారా ఆయా రైతులకు సమీప రైతుబజార్లలో నేరుగా అమ్ముకునే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఏవైనా సందేహాలకు 9182361352 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

21న కందుకూరులో సెమినార్

కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 21న జిల్లాస్థాయి క్రాప్ సెమినార్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెమినార్‌లో యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పాల్గొని మామిడి సాగు, పురుగులు, తెగుళ్లపై రైతులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మామిడి కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

అక్రమాలు నిజమే!

పెరంకొండలో విజిలెన్స్ విచారణ పూర్తి

భారీగా అవినీతి జరిగినట్లు నిర్ధారణ!

నెల్లూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : సుమారు రూ.వంద కోట్ల ప్రజాధనాన్ని పరిహారం రూపంలో స్వాహా చేసిన 'పెరంకొండ' ముంపు వ్యవహారం ఫైనల్ దశకు చేరుకుంది. రెండు నెలలపాటు జరిగిన విజిలెన్స్ విచారణ పూర్తయింది. ఇక ప్రభుత్వానికి నివేదిక సమర్పించడమే మిగిలింది. నాడు జాయింట్ కలెక్టర్ విచారణలో తేలిన అక్రమాలకంటే విజిలెన్స్ విచారణలో మరిన్ని అక్రమాలు బట్టబయలైనట్లు సమాచారం. 2023లోనే అప్పటి జేసీ రోణంకి కూర్మనాథ్.. ఈ ముంపు అక్రమాలపై సుదీర్ఘ విచారణ చేసి అక్రమాలు నిగ్గు తేల్చారు. ఈ గ్రామం ముంపు కిందకు వస్తుంది అనుకున్నా పరిహారం చెల్లింపులో అక్రమాలు జరిగాయని, సుమారు రూ.33 కోట్లకుపైగా ప్రజాధనం పక్కదారి పట్టిందని ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. అప్పట్లో అక్రమార్కులు ఈ నివేదికపై తదుపరి చర్యలు లేకుండా డబ్బులు వెదజల్లి అడ్డుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టాక ఈ నివేదికను విజిలెన్స్‌కు అప్పగించింది. మరింత లోతుగా విచారణ జరిపి నివేదిక అందించాలని ఆదేశించింది. అయితే ఇప్పుడు విజిలెన్స్ విజిలెన్స్ విచారణలో పెరంకొండ గ్రామంలో ఒక్క కాలనీ మినహా మిగిలిన ఊరు ముంపు కిందకు రాదని తేల్చినట్లు తెలిసింది. డీజీపీఎస్ సర్వేను చేసి కండలేరు కాంటూర్‌ను నిర్ణయించిన తర్వాత ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. దీంతో దోపిడీ జరిగిన ప్రజాధనం విలువ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి.



డెల్టాకు 2300 క్యూసెక్కుల విడుదల

అనంతసాగరం ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): డెల్టా ప్రాంతానికి సోమశిల జలాశయం నుంచి 2300 క్యూసెక్కుల నీటిని సోమవారం విడుదల చేశారు. కాగా, ఎగువ నుంచి 1,197 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, డ్యాంలో 62.652 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,800, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. అలాగే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 6వ నెంబరు క్రస్ట్‌గేట్ ఎత్తి నీటిని విడుదల చేశారు. దీంతో కలువాయి, నెల్లూరు, సోమశిలకు రాకపోకలు ఆగిపోయాయి. 11, 12 క్రస్ట్‌గేట్ల రోప్‌లు సక్రమంగా లేని కారణంగా ఈ నిర్ణయం తీసుకొన్నట్లు ఇంజనీర్లు తెలిపారు.

కండలేరులో 53.06 టీఎంసీల నీరు

రాపూరు : కండలేరు డ్యాంలో 53.06 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సోమశిల, ఇతర కాలువల నుంచి ఇన్‌ఫ్లో వస్తుండగా, 1,135 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

అధ్యాపకుడి నుంచి ఆర్థిక నేరస్థుడిగా..

షేక్ మహబూబ్ సుభానీ... అధ్యాపకుడిగా ప్రస్థానం ఆరంభమై ఆర్థిక నేరస్థుడిగా ముగిసింది. డబ్బుమీద వ్యామోహంతో పేదల కష్టార్జితాన్ని స్వాహా చేశాడు. షేర్ మార్కెట్ల పేరుతో తెలుగురాష్ట్రాల్లో రూ.కోట్లు వసూలు చేసి పరారీలో ఉన్న సుభానీని కావలి పోలీసులు అరెస్ట్ చేశారు. తీగ లాగితే డొంకంతా కదిలినట్టు సుభానీపై జరిపిన విచారణలో పోలీసులకే దిమ్మతిరిగే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఆ వివరాలు...

పేదల ధనాశే పెట్టుబడిగా స్కాం

- 'అనంతార్థ' నిర్వాహకుడు సుభానీ అరెస్ట్
- రూ.11.39 కోట్ల ఆస్తులు, నగదు సీజ్
- 150 మంది ఫిర్యాదు మేరకు రూ.25 కోట్ల సొమ్ము దోపిడీ
- ఎవరినీ వదిలే ప్రసక్తే లేదంటున్న పోలీసులు



మనీస్కాం గురించి వివరాలు వెల్లడిస్తున్న కావలి డీఎస్పీ శ్రీధర్, వెనుక నిందితులు (ముసుగులో ఉన్న వ్యక్తులు)

కావలి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో తెలుగు రాష్ట్రాల్లో ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న ఓ మోసగాడిని శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. కావలి డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ పీ.శ్రీధర్, కావలి రూరల్ సీఐ రాజేశ్వరరావు, సీఐలు ఫిరోజ్, గిరిబాబులు ఆర్థిక నేరగాడు షేక్ మహబూబ్ సుభానీ అరెస్ట్ వివరాలను వెల్లడించారు.

మూడు చోట్ల కేసులు...

బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ సుభానీ విజయవాడలో ఎంసీఏ పూర్తి చేసి కొంతకాలం నరసరావుపేటలో కంప్యూటర్ అధ్యాపకుడిగా పనిచేశారు. అనంతరం నెట్‌వర్క్ మార్కెటింగ్‌లోకి వచ్చి షేర్‌మార్కెటింగ్, ట్రేడింగ్ మీద అవగాహన పెంచుకున్నారు. 2014లో కాకినాడలో ఆన్‌లైన్ ట్రేడ్ మార్కెటింగ్ స్థాపించి తన నెట్‌వర్క్‌ను విస్తరింపజేసుకున్నారు. తన ఏజెంట్ల ద్వారా కోట్ల రూపాయల ప్రజల సొమ్ము దోపిడీ చేసి అక్కడ నుంచి పరారవడంతో కాకినాడ పోలీస్‌స్టేషన్‌లో సుభానీపై చీటింగ్ కేసు నమోదైంది. ఆ తర్వాత తెలంగాణలోని మక్తల్‌కు చేరుకుని చెప్పులు, ఫర్టిలైజర్స్ బంగారం వ్యాపారం కొంతకాలం చేశారు.

2021, నవంబరులో కావలి మునునూరులో 17 మంది సభ్యులతో అనంతార్థ అసోసియేట్స్ అనే ఏజెన్సీని సుభానీ స్థాపించి ప్రజలకు అధిక వడ్డీలు, ప్రత్యేక ఆఫర్లు చూపిస్తూ భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారు. దీంతో గత నెలలో మందాటి ప్రభాకర్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుభానీపై కేసు నమోదు చేశారు. అప్పటినుంచి తప్పించుకుని తిరుగుతున్న సుభానీని ఆదివారం రాత్రి 10.30 గంటలకు కావలి రూరల్ మండలం గౌరవరం జాతీయ రహదారి వద్ద అనుచరుడు యలసిరి బ్రహ్మానందంతోపాటు అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. ఈ స్కాం లావాదేవీలకు సంబంధించి బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.5,35,92,126 సీజ్ చేయడంతోపాటు రూ.5,74,51,000 విలువ గల ఆస్తులను గుర్తించారు. అలాగే రూ.28,48,600 నగదును కూడా సీజ్ చేసారు. ఇప్పటివరకు 150 మంది బాధితులు ఇచ్చిన పిర్యాదు మేరకు రూ.25 కోట్ల వరకు ప్రజల సొమ్ము దోపిడీ జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఇంకా ప్రజల నుంచి వచ్చే పిర్యాదుల మేరకు ఆ సొమ్ము మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని డీఎస్పీ చెబుతున్నారు.

మక్తల్‌లో కూడా కాకినాడలాగా ఆన్‌లైన్ మార్కెటింగ్ పేరుతో భారీగా నగదు వసూలు చేసి పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు మక్తల్‌లోనూ రెండు కేసులు నమోదయ్యాయి. పోలీస్‌లకు దొరక్కుండా అక్కడ నుంచి శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలోని ముసునూరుకు చేరుకున్నాడు. ఇక్కడ 17 మంది సభ్యులతో 'అనంతార్థ' అసోసియేట్స్ పేరుతో ఏజెన్సీ స్థాపించారు. ఇక్కడా మూడున్నర సంవత్సరాలుగా అధిక వడ్డీలు, రకరకాల ఆఫర్లతో మోసాలకు పాల్పడి పోలీస్‌లకు చిక్కాడు. ఇలా పదేళ్లుగా పోలీసులకు దొరకకుండా ప్రజలను చీటింగ్ చేస్తున్న సుభానీని కావలి పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ స్కాంలో సభ్యులతోపాటు ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలున్న ఎంతటివారినైనా వదిలే ప్రసక్తేలేదని పోలీసులు తెలిపారు.

అనంతార్థ సభ్యులు వీరే

అనంతార్థ అసోసియేట్స్ ఏజెన్సీ సంస్థ సభ్యుల పేర్లను పోలీసులు వెల్లడించారు. నిర్వాహకుడు షేక్ మహబూబ్ సుభానీ, దీపలపూడి కమలకుమార్, చలంచర్ల అనీల్, పిల్లి స్వామ్రాజ్, యలసిరి బ్రహ్మానందం, గోనె కిరణ్, యలసిరి ఆదినారాయణ, తలపల శివశంకర్, అబ్బూరి శీనయ్య, చౌటూరి అశోక్, నిమ్మగడ్డ రామ్ రామ్ రహీం, కాకాణి ప్రశాంతి, కానిస్టేబుల్ రాధాకృష్ణయ్య భార్య వట్టికాల ప్రశాంతి, వీ.శివాజుల, కొశెట్టి పుష్పలత, కానిస్టేబుల్ అయోధ్య భార్య జ్యోతి స్రవంతి, గుళ్లమూడి వంశి రెడ్డి సంస్థలో సభ్యులుగా ఉన్నట్లు తెలిపారు.

ఘటిక సిద్ధేశ్వరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తా

- ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కూటమి పార్టీల నాయకులు

ఉదయగిరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన ఘటిక సిద్ధేశ్వరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. సోమవారం ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఘటికసిద్ధేశ్వరం, భైరకోన క్షేత్రాలకు ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు, కూటమి నాయకులతో కలిసి బస్సును జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం డ్రైవర్ సీటులో కూర్చొని స్టీరింగ్ తిప్పారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఘటిక సిద్ధేశ్వ రంపై అభివృద్ధిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామన్నారు. ఈనెల 26న మహా శివరాత్రి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించామన్నారు. అనంతరం సీహెచ్‌సీని తనిఖీచేశారు. రోగులకు అత్యవసర వైద్యసేవలు సైతం అందేలా చూడాలని వైద్యులకు సూచించారు. ఆ తర్వాత టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, గూడూరు వెంకటేశ్వరావు నివాసాలకు వెళ్లి యోగక్షేమాలు తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బయ్యన్న, రియాజ్, బొజ్జా శ్రీనివాసులు, గడ్డం శ్రీనివాసులు, కదిరి వెంకటరంగారావు, ముడమాల రమేష్‌రెడ్డి, నెల్లూరు వెంకటస్వామి నాయుడు, మేకపాటి మాల్యాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీడీ సర్వేను పటిష్టంగా నిర్వహించాలి

- లేకుంటే కఠిన చర్యలు : డీఎంహెచ్‌వో



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది ఎన్‌సీడీ సీడీ 3.0 సర్వేను పటిష్టంగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత ఆదేశించారు. డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో సోమవారం వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌సీడీ కింద క్యాన్సర్, మధుమేహం, రక్తపోటు వ్యాధులను గుర్తించి, వారి వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు.ఇందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రస్తుతం ఉన్న 167 వైద్య బృందాలను 334కి పెంచామన్నారు. ప్రతి బృందం ప్రతి రోజూ 5 నుంచి 7 నివాసాలకు వెళ్లి వ్యాధి వివరాలను నమోదు చేయాలని చెప్పారు. ప్రతి బృందంలోనూ హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు ఉంటారన్నారు. సర్వేపై నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, డీపీఎంవో డాక్టర్ రమేష్, ఎన్‌సీడీ పీవో డాక్టర్ యశ్వంత్, డెమె కనకరత్నం, ఎస్‌వో సహన, వైద్యాధికారులు ఎన్‌సీడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు పంచాయతీ విద్యుత్ బకాయిలు రూ.3.6 కోట్లు

- గ్రామంలోని బిట్-1 సచివాలయానికి పవర్ కట్

పొదలకూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖకు పొదలకూరు పంచాయతీ రూ.3.60 కోట్ల విద్యుత్ బకాయిలు ఉంది. దీంతో తక్షణం బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్యాలయం కొనసాగుతున్న పొదలకూరు బిట్-1 సచివాలయానికి విద్యుత్ శాఖ అధికారులు సోమవారం పవర్ కట్ చేశారు. విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు.. పొదలకూరు పంచాయతీకి సంబంధించి వీధిలైట్లు, వాటర్ మోటార్ల మీటర్లు, తదితర విద్యుత్ బిల్లులు రూ.3.6 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. ఈ పంచాయతీలో వైసీపీకి చెందిన పాలక వర్గం కొనసాగుతోంది. కాగా పంచాయతీ బ్యాంకు ఖాతాలో సుమారు రూ.60 లక్షల ఉన్నట్లు సమాచారం. ఇందులో నుంచి కనీసం రూ.50లక్షలు చెల్లించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు. అయితే ప్రస్తుతం రూ.5లక్షలు చెల్లిస్తామని, పవర్ కట్ చేయవద్దని పాలకవర్గం కోరింది. దీనికి అంగీకరించని విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ కనెక్షన్ తొలగించారు. దీంతో పంచాయతీ కార్యాలయం కొనసాగుతున్న సచివాలయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలకు అవసరమైన పనులు స్తంభించాయి. సిబ్బంది అత్యవసర పనులను ఇతర సచివాలయాలకు వెళ్లి చేసుకోవాల్సి పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీసం కరెంటు బిల్లులు కూడా చెల్లించకపోవడంపై పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాట్య లిఖితం



బాల్యం నుంచే నాట్యంపై మక్కువతో కూచిపూడి నేర్చుకుంది. నేడు అదే కూచిపూడిలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తూ ఆ నృత్య కళను ఆపోశన పడుతోంది. నటరాజు అనుగ్రహంతో నాట్య మయూరిగా ఎందరి నుంచో ప్రశంసలు, పురస్కారాలు అందుకుంది. అంతటితో ఆగిపోకుండా తాను నేర్చుకున్న నర్తనాన్ని భావితరాలకు అందించాలన్న ఆశయంతో నృత్య కళానిలయాన్ని స్థాపించి ఉచితంగా బోధిస్తోంది. ఆమే కావలికి చెందిన గంగపట్నం లిఖిత.

- కూచిపూడిలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్
- ఎన్నో పురస్కారాలు, ప్రశంసలు
- 'నృత్యకళా నిలయం'లో శిక్షణ
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో 400 ప్రదర్శనలు



కావలి టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని తుఫాన్‌నగర్‌కు చెందిన గంగపట్నం సురేంద్ర, నిర్మల దంపతుల కుమార్తె లిఖిత. చిన్నతనం నుంచే కూచిపూడి నృత్యంపై మక్కువతో పాఠశాలల్లో జరిగే కార్యక్రమాల్లో ప్రదర్శనలిస్తూ ప్రతిభ కనబరిచింది. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న తండ్రి సురేంద్ర తన కుమార్తె లిఖితకు కూచిపూడిపై ఉన్న ఆసక్తిని గుర్తించి ఆర్థికస్థోమత లేకపోయినా తనవంతుగా ప్రోత్సహించారు. అంచెలంచెలుగా కూచిపూడి నృత్యంలో పట్టు సాధించిన లిఖిత జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇచ్చి ప్రముఖులతో శభాష్ అనిపించుకుంది. ప్రస్తుతం గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కూచిపూడి విభాగంలో పోస్టు గ్రాడ్యుయేషన్ రెండో ఏడాది చదువుతోంది. తను నేర్చుకున్న కూచిపూడి కళను భావి తరాలకు అందించాలన్న ఆశయంతో సంయుక్త నృత్య కళానిలయం పేరుతో పాఠశాలను స్థాపించి పది మందికి కూచిపూడిలో శిక్షణ ఇస్తూ నృత్యకళే తన జీవితంగా ముందుకు సాగుతోంది.

400కు పైగా ప్రదర్శనలు

లిఖిత ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో సుమారు 400 కుపైగా ప్రదర్శనలు ఇచ్చారు. శిష్యులతో కలసి కూడా ప్రదర్శనలిస్తు న్నారు. శ్రీనివాస కల్యాణం వంటి పౌరాణిక నృత్య రూపకాలతో పాటు సాంఘిక దురాచారాలను రూపుమాపే విధంగా ప్రజల్ని చైతన్యవంతం చేసేందుకు మృత్యు ఘోష వంటి నృత్యరూపకాలు రూపొందించి వేదికలపై ప్రదర్శిస్తున్నారు. శిష్య బృందంతో కలిసి ఇస్తున్న అలాంటి ప్రదర్శనలకు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల మన్ననలు పొందారు

ప్రముఖుల ప్రశంసలు

నెల్లూరు, విజయవాడ, హైదరాబాద్, బెంగుళూరు, తమిళనాడు, కేరళ, ఒరిస్సా తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలిచ్చి సుమన్, భానుచందర్, చంద్రబోస్, తనికెళ్లభరణి, శేఖర్ కమ్ముల వంటి సినీ ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. మంత్రులు నారాయణ, కొల్లు రవీంద్ర, మాజీ మంత్రులు సముద్రాల వేణుగోపాలాచారి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎంపీలు బీద మస్తాన్ రావు, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి , పలు వురు కలెక్టర్లు, ఉన్నతాధికారుల నుంచి సత్కారాలు, పురస్కారాలు పొందారు. కళాతరంగిణి, నాట్యమయూరి, అమేజింగ్ కిడ్ వంటి అవార్డులు, గిన్నిస్ వరల్డ్ రికార్డు, ప్రతిభ అవార్డు, పింగళి వెంకయ్య అవార్డులు అందుకున్నారు.

కూచిపూడి ఉపాధ్యాయురాలే లక్ష్యం...

కూచిపూడి ఉపాధ్యాయురాలిగా ప్రభుత్వ ఉద్యోగం పొందాలన్న సంకల్పంతో ఆ నాట్య కళలో పీజీ చదువుతున్నాను. కళను భావితరాలకు అందించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయినిగా మంచి అవకాశముంటుంది. లక్ష్యం సాధిస్తానన్న నమ్మకంతో ముందుకు సాగుతున్నాను.

- లిఖిత



హైదరాబాద్‌లో శ్రీనివాస కల్యాణం నృత్యరూపకం ప్రదర్శిస్తున్న లిఖిత శిష్యబృందం

స్టాక్ యార్డ్‌లో నిల్వ చేసిన రూ. కోటి విలువైన తెల్లరాయి మాయం



గతంలో తెల్లరాయి స్టాక్‌ను సీజ్ చేసిన అధికారులు (ఫైల్)



ప్రస్తుతం స్టాక్ యార్డ్‌లో సగమే ఉన్న తెల్లరాయి

చేజర్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్టాక్ యార్డ్‌లో నిల్వచేసిన కోటి రూపాయల విలువ చేసే తెల్లరాయి రాత్రికి రాత్రే మాయమైన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొలప నాయుడుపల్లి గ్రామ సమీపంలో గత ప్రభుత్వంలో స్థానిక వైసీపీ నాయకుడి కనుసన్నలలో శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ మినరల్స్ ఎమ్‌డిఎల్ స్టాక్ పాయింట్ పేరుతో అక్రమంగా సేకరించిన తెల్లరాయిని స్టాక్‌యార్డ్‌లో నిల్వఉంచారు. అయితే ప్రభుత్వం మారడంతో గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీ చేసిన మైనింగ్ అధికారులు అక్రమమని తేల్చి దాదాపు 1200 టన్నుల ఉన్న తెల్లరాయి స్టాక్‌యార్డ్‌ని సీజ్ చేసి అక్కడ మైనింగ్‌కు సంబంధించిన వారినే కాపలాగా పెట్టారు. అయితే ఆదివారం ఉదయం అటుగా పొలాలకు వెళ్లిన రైతులు స్టాక్ యార్డ్‌లో సగంకు పైగా తెల్లరాయిని అక్రమంగా రాత్రికి రాత్రే ఎత్తుకెళ్ళినట్లు గుర్తించారు. ఈసంఘటనపై మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చినా తమకు ఏమీ తెలియనట్లు వ్యవహరించారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ సంఘటనపై మైనింగ్ అధికారులను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జోరుగా గంజాయి విక్రయాలు

- మత్తులో జోగుతున్న యువత

లింగసముద్రం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో జోరుగా గంజాయి విక్రయాలు జరుగుతున్నాయి. మండలకేంద్రంలోని తాతా హోటల్ సమీపంలో ఓ కాలనీ, పెదపవని తో పాటు మరికొన్ని గ్రామాల్లో ఈ విక్రయాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఎక్కువగా కావలి, నెల్లూరు ప్రాంతాల నుంచి కొందరు వ్యక్తులు తెచ్చి చిన్న పొట్లాలను తయాఆరు చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఇరువురు యువకులు లింగసముద్రం పంచాయతీ కార్యాలయంలో రాత్రి 7గంటల సమయంలో గంజాయి సేవిస్తుండగా సర్పంచు వారిని మందలించి పంపించారు. అలాగే 15రోజుల క్రితం ఓ యువకుడు గంజాయి సేవించి జంపాలవారిపాలెం ఎస్సీ కాలనీ వద్ద రోడ్డు పక్కన ఉన్న బెంచీపై పడిపోయాడు. అలాగే మూడునెలల క్రితం పెదపవని హైస్కూల్ వద్ద కూడా రాత్రి వేళ గంజాయి సేవిస్తుండగా, కొందరు వారిని ప్రశ్నించగా వారిపై తిరగబడ్డారు. గంజాయి వాడకంతో యువత కూడా పెడతోవ పడుతున్నట్లు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శత వసంతాల సుబ్బయ్య బడి

- బ్రిటీష్ హయాంలో ప్రారంభమై హిందూ ఎయిడెడ్ పాఠశాలగా గుర్తింపు
- నేడు అల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలగా రూపాంతరం
- రేపు ఉత్సవాలకు కమిటీ ఏర్పాట్లు

అల్లూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పేటలో జడ్పీ ఉన్నత పాఠశాల (సుబ్బయ్య బడి) బుధవారంతో శత వసంతాలను పూర్తి చేసుకోనుంది. బ్రిటీష్ హయాంలోనే స్థానికుడైన వేమూ రు శేషయ్య అక్షరాస్యతను పెంచేందుకు 1925లో తన స్వగృహంలోనే కుమారుడు సుబ్బయ్య పేరుతో పాఠశాలను ప్రారంభించాడు.

● హిందూ ఎయిడెడ్ పాఠశాలగా గుర్తింపు..

అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఈ పాఠశాలకు హిందూ ఎయిడెడ్ పాఠశాలగా గుర్తింపునిచ్చింది. ఆ విధంగా ఏర్పాటు చేసిన బడిలో విద్యార్థులను చేర్చుకుంటూ వారిలో అక్షరాస్యతను పెంచుతూ ముందుకు సాగింది. ఆయన తదనంతరం శేషయ్య మనవళ్లు వెంకట సుబ్రహ్మణ్యం, శేషగిరిరావు కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయుడిగానూ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ వచ్చారు.

● 1979లో ప్రభుత్వంలో విలీనం..

స్వాతంత్ర్యం వచ్చాక విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు అప్పటి మన ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా ఈ పాఠశాలను 1979లో ప్రభుత్వంలో విలీనం చేశారు. అప్పటినుండి పంచాయతీ సమితి పాఠశాల కొనసాగింది.



● నేడు శాశ్వత గుర్తింపు..

1983లో ప్రాథమికోన్నత పాఠశాలగా, 2020లో జడ్పీ ఉన్నత పాఠశాలగా దినదినాభివృద్ధి చెందుతూ నేడు శాశ్వత గుర్తింపును పొందింది. అప్పటి మహానుభావుల పుణ్యఫలమే ఆనాటి విద్యార్థులకు విద్యనందించే విధంగా ఏర్పాటు చేసిన ఈ పాఠశాల ఈ ఏడాదితో శత వసంతాలను పూర్తి చేసుకుంది. ఇంతటి ఘన చరిత్రలు కలిగిన పాఠశాలలు అరుదుగా ఉన్నాయి. అలాంటి పాఠశాల అల్లూరుకు చెందినది కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల శత వసంతోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పాఠశాల కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 4,758 మంది హాజరు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు జరుగుతున్న ప్రయోగ పరీక్షలకు సోమవారం జిల్లా వ్యాప్తంగా 4,758 మంది హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు 2,685 మంది హాజరు కావాల్సి ఉండగా 2,612 మంది హాజరయ్యారు. 73 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్స్‌కు 2,216 మంది హాజరు కావాల్సి ఉండగా, 2,146 మంది హాజరయ్యారు. 70 మంది గైర్హాజరయ్యారు. ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు నాలుగు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి ప్రాక్టికల్స్ జరుగుతున్న తీరును పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఆర్ఐవోతో పాటు డీవీఈవో 2 కేంద్రాలను, డీఈసీ సభ్యులు ఐదు కేంద్రాలను, ఫ్లైయింగ్‌స్క్వాడ్ 12 సెంటర్లను పరిశీలించారు.

డిగ్రీ పరీక్షలకు 8 మంది గైర్హాజరు

వెంకటాచలం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో సోమవారం జరిగిన డిగ్రీ 1వ, 4వ సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో 172 మంది విద్యార్థులకు 164 మంది హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు.

రేపు మహిళల హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా జిల్లా జట్ల ఎంపికను నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ కార్యదర్శి డీ.శ్రీరేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు వచ్చేవారు ఆధార్, జననధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు. ఎంపికైన క్రీడాకారిణిలు కర్నూలులో ఈనెల 21 నుంచి 23 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

కందుకూరు మున్సిపాలిటీకి ఎన్నికలు?

- మే, జూన్‌లో నిర్వహణకు సన్నాహాలు
- సీఎం పర్యటన ఉద్దేశం కూడా అదేనా!?

కందుకూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కందుకూరు మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలన్న కృత నిశ్చయంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు కందుకూరును ఎంపిక చేసుకోవటం, మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల కోసం రూ.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడం కూడా ఎన్నికల సన్నాహాల్లో భాగమేనని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గత 13 సంవత్సరాలుగా పాలకవర్గం లేకుండా అధికారుల పాలనలో నడుస్తున్న కందుకూరు మున్సిపాలిటీకి ఎట్టిపరిస్థితుల్లో ఎన్నికలు జరిపి పాలకవర్గం ఏర్పాటయ్యేలా చూడాలన్న ఆలోచనతో ప్రభుత్వం ప్రయత్నిస్తుండటం వల్లే చంద్రబాబు కందుకూరు అభివృద్ధిపై దృష్టి సారించారని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి మున్సిపల్ శాఖామంత్రిగా జిల్లాకు చెందిన పొంగూరు నారాయణ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును పిలిపించుకుని కందుకూరు మున్సిపాలిటీకి 2, 3 నెలల్లో ఎన్నికలు జరపాల్సి ఉంటుందని అందుకోసం సిద్ధం కావాలని సూచన చేసిన విషయం తెలిసిందే. అప్పట్లో కొద్దిరోజులు మున్సిపల్ ఎన్నికలపై ఔత్సాహికులు హడావిడి చేసినా తర్వాతి కాలంలో ఆ విషయం మరుగునపడింది. ప్రస్తుతం మంత్రి నారాయణ అదే ప్రయత్నాల్లో ఉండటం, మే, జూన్ నెలల్లో జరగబోయే ఎన్నికల్లో కందుకూరు మున్సిపాలిటీలో జయకేతనం ఎగరవేసి మీకు గిఫ్ట్‌గా ఇస్తామని చంద్రబాబుకు ఎమ్మెల్యే ఇంటూరి విజ్ఞప్తి చేశారు. అంటే ఎన్నికలకు సన్నద్ధమవుతున్నట్లు ఎమ్మెల్యే బహిరంగంగానే చెప్పగా అందుకు అనుగుణంగానే సీఎం కూడా నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించటం విశేషం.



● కోర్టు కేసులు అడ్డంకి తొలగేనా?

కందుకూరు మున్సిపాలిటీకి చివరిసారిగా 2007లో ఎన్నికలు జరిగాయి. అప్పట్లో ఎన్నికైన పాలకవర్గం 2012 వరకు కొనసాగగా ఆ తర్వాతి నుంచి అధికారుల పాలనే నడుస్తోంది. ఆ ఎన్నికలకు ముందు అప్పటి వరకు మున్సిపాలిటీలో అంతర్భాగంగా ఉన్న గనిగుంట, దివివారిపాలెం, కంద్రావారిపాలెం, చుట్టుగుంట, గళ్లావారిపాలెం, ఆలావారిపాలెం, ఆనందపురం, శామీరపాలెం తదితర గ్రామాలను కందుకూరుకు సుదూరంగా ఉన్నాయన్న కారణంతో మున్సిపాలిటీ నుంచి తొలగించి ఎన్నికలు నిర్వహించారు. అయితే ఈ తొలగింపు ప్రక్రియ చట్టవిరుద్ధంగా జరిగిందని తిరిగి తమ గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టులో కేసు నడుస్తున్న కారణంగా ఎన్నికలు జరగలేదు. అనంతరం 2018లో ఆ గ్రామాల తొలగింపు ప్రక్రియ చట్టబద్ధంగా జరగనందున తిరిగి విలీనం చేయాలని తీర్పు ఇవ్వటంతో తిరిగి మున్సిపాలిటీలో విలీనం చేశారు. అయితే ఆ విలీనాన్ని సవాల్ చేస్తూ పలువురు కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారం ఇప్పటికీ కోర్టులోనే నడుస్తోంది. ప్రస్తుతం ఎన్నికలు జరపాలన్న పట్టుదలతో ప్రభుత్వం ఉన్నందున కోర్టులో వాజ్యం వేసి ఉన్నవారి చేత ఉపసంహరింజేసే దిశగా ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. ఆ ప్రయత్నం విఫలమైనా కోర్టు ఉత్తర్వుల మేరకే గ్రామాలను విలీనం చేశారు కనుక ఎన్నికల నిర్వహణకు ఎలాంటి అడ్డంకి ఉండబోదని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

గతంలో చేసి ఉన్న రిజర్వేషన్ ప్రకారమైతే కందుకూరు మున్సిపాలిటీ జనరల్ మహిళకు రిజర్వ్ అయి ఉంది. దీని ప్రకారమే ఎన్నికలు నిర్వహించవచ్చని సమాచారం.

ధాన్యం విక్రయించాలంటే
ఈ-క్రాప్ తప్పనిసరి


కలువాయి : ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

కలువాయి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించాలంటే తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకుని ఉండాలని మండల వ్యవసాయాధికారి వీ ప్రతాప్ తెలిపారు. స్థానిక సొసైటీ కార్యా లయంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభి ంచారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ తెలుగురాయపురం, వెరుబొట్లపల్లిలో ఏ-గ్రేడు, కలువాయి, కుల్లూరు, మాదన్నగారిపల్లె, బద్దెవోలులో బీ-గ్రేడు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు ఆయన వివరించారు. ఏ-గ్రేడు పుట్టి రూ.19,720, బీ-గ్రేడు పుట్టి రూ.19,550కు రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. రవాణా, హమాలీ, ప్యాకింగ్ ఖర్చులన్నీ కూడా అదనంగా రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ చేయబడుతుందని తెలిపారు. ప్రతి రైతూ తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో సుదర్శన్, టీడీపీ నాయకులు చల్లా రఘురామిరెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, తెలుగురాయపుం నీటి సంఘం అధ్యక్షుడు మల్లు విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెట్రోలు బంకు నిర్మాణం చేపట్టరాదు

● రాష్ట్ర టీడీపీ కార్యాలయంలో అభివృద్ధి మండలి ప్రతినిధుల ఫిర్యాదు


మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు

కందుకూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కార్యాలయాల ఆవరణలో ఏపీసీ పెట్రోలుబంకు ఏర్పాటుకు గత ప్రభుత్వంలో ఇచ్చిన అనుమతులను తక్షణం రద్దు చేసేలా చూడాలని నియోజకవర్గ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు సోమవారం మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. నామమాత్రపు లీజుతో ఎంతో విలువైన వాణిజ్య విలువున్న ప్రాంతంలో కోట్ల విలువైన స్థలాన్ని ఏపీసీ పెట్రోలు బంకుకు ఇవ్వటం దుర్మార్గపు చర్య అన్నారు. ఈ ప్రాంతంలో పెట్రోలుబంకు ఏర్పాటు చేస్తే ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుంద న్నారు. కార్యక్రమంలో తోకల వెంకటేశ్వర్లు, పొడపాటి శ్రీను, కె. మణి, పాలేటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన అవసరం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ఉదయగిరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గండిపాళెం పీహెచ్‌సీ ఆరోగ్య బోధకుడు కె వెంకటసుబ్బయ్య సూచించారు. సోమవారం జాతీయ క్షయవ్యాధి నివారణలో భాగంగా పట్టణంలోని ఎంఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హోలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మందులతో క్షయవ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఎల్ నారాయణస్వామి, వీ సుధాకర్, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనర్హులకు ఇళ్ల పట్టాల పంపిణీపై ఫిర్యాదు


డిప్యూటీ తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న షేక్ బాబు

సంగం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అనర్హులకు ఇళ్ల పట్టాల పంపిణీపై సంగం సాగునీటి సంఘం అధ్యక్షుడు షేక్ బాబు సోమవారం డిప్యూటీ తహసీల్దారు సంధ్యకు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో తలుపూరుపాడు గ్రామానికి చెందిన అనర్హులైన ఇద్దరు వైసీపీకి చెందిన వారికి సంగంలోని 252 సర్వే నెంబరులో ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఆమేరకు విచారించి ఆ పట్టాలను రద్దు చేసి అర్హులైన పేదలకు ఇవ్వాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రేపు దరఖాస్తుల పరిశీలన

దుత్తలూరు(ఉదయగిరి), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీసీ రుణాల మంజూరుకు సంబంధించి దరఖాస్తుల పరిశీలన బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో మీసాల వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు దరఖాస్తుతోపాటు జత పరిచిన అన్ని ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు.

మోటారు బైక్ - ఆర్టీసీ బస్సు ఢీ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న మోటారు బైకు, ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన సోమవారం గువ్వాడి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఉదయగిరి నుంచి ఆర్టీసీ బస్సు ప్రకాశం జిల్లా పామూరుకు వెళ్తుండగా గ్రామ సమీపంలోని మలుపు వద్ద కాంచెరువు గ్రామానికి చెందిన మందలపు కొండపనాయుడు దంపతులు వరికుంటపాడు నుంచి మోటారుబైకుపై స్వగ్రామానికి వస్తూ ఒక్కసారిగా ఎదురు పడడంతో ఆ వాహనాలు ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. దీంతో ఆ దంపతులకు గాయాలవడంతో చికిత్స నిమిత్తం పామూరుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


గాయపడిన లెక్కల ప్రసాద్

కలిగిరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కలిగిరి-వింజమూరు రహదారిలోని నాగిరెడ్డిపాలెం సెంటర్ వద్ద సోమవారం మోటార్‌సైకిల్‌ను కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో వీర్నకొల్లు గ్రామానికి చెందిన లెక్కల ప్రసాద్, మద్దినేని శ్రీను తీవ్రంగా గాయపడ్డారు. అలాగే కారులోని మహిళకు స్వల్పగాయాలయ్యాయి. కలిగిరి నుండి స్వగ్రామానికి వెళుతుండగా గుంటూరు నుండి బద్వేలు వెళ్తున్న కారు వెనకనుండి వచ్చి బైక్‌ను ఢీకొనడంతో సెంటర్‌లోని ఓ దుకాణంలోకి దూసుకెళ్లింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించి, కేసు నమోదు చేశారు. తీవ్రంగా గాయపడిన వారిని 108 వాహనంలో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం కావలిలోని ప్రవేటు వైద్యశాలకు తరలించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి



ఆత్మకూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడకండ్ల గ్రామ శివారు ప్రాంతంలో పేకాట స్థావరంపై సోమవారం దాడిచేసి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ షేక్ జిలాని తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 10,500 నగదు, నాలుగు మోటారుసైకిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఫ్లెక్సీ చింపివేశారని ఫిర్యాదు

అనంతసాగరం ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంగుంటలో టీడీపీ ఫ్లెక్సీ చింపివేశారని స్థానిక నాయకుడు పుల్లారెడ్డి స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు.

నాడెప్ తొట్టెల ధ్వంసంపై ఫిర్యాదు



కొండాపురం, ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్థిని ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలని ఇస్కదామెర్ల అన్నెం ఇంద్రసేనారెడ్డి, అన్నెం సుబ్బారెడ్డిలు సోమవారం ఎంపీడీవో ఆదినారాయణకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన నాడెప్ తొట్టెలను ఇస్కదామెర్ల సర్పంచ్ ఇరగల శేఖరరెడ్డి ఉద్దేశపూర్వకంగా కూల్చివేశారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

అనాథ మహిళకు ఆదరణ

బిట్రగుంట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ముంగ మూరు జాతీయ రహదారి పక్కన ఉన్న మహిళను సోమవారం భవానీ ఎడ్యు కేషనల్ సొసైటీ సభ్యులు గుర్తించారు. ఆమె ను కేంద్రానికి తీసుకెళ్లి స్నానం చేయించి భోజనం చేయించారు. అనంతరం ప్రథమ చికిత్స అందించారు. ఆమె ఆరోగ్యం కుదుట పడ్డాక వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామన్నారు.

శిథిలావస్థలో విద్యాలయ భవనాలు

● భయాందోళనలో ఉపాధ్యాయులు, విద్యార్థులు


శిథిలమైన మర్రిపాడు హైస్కూల్ భవనం

మర్రిపాడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డీసీపల్లి, పల్లిపాడు, మర్రిపాడు గ్రామాల్లో ఉన్న విద్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. డీసీపల్లి, పల్లిపాడులోని హైస్కూల్‌లో నాడు-నేడు కార్యక్రమంలో నూతన తరగతి గదులు నిర్మించగా, మర్రిపాడులో హైస్కూల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం నూతన భవనాలు నిర్మించడంతో కొంతకాలంగా వాటిలో తరగతులు కొనసాగుతున్నాయి. కాగా, శిథిలావస్థకు చేరిన భవనాలను మాత్రం కూల్చి వేయక పోవడంతో వాటి దరిదాపుల్లోకి వెళ్లేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు భయపడుతున్నారు. భవనాలను కూల్చివేస్తే విద్యార్థులు ఆటలాడుకునేందుకు విశాలమైన ఆట స్థలం ఏర్పడుతుందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ఆందోళన


ఉదయగిరి: ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఉదయగిరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృ తంగా ఉన్న అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్యకర్తలు, ఆయాలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కనీస వేతన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని, పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఆయాల పదోన్నతికి నిర్దిష్టమైన మార్గదర్శకాలను రూపొందించాలన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కోడె రమణయ్య, గడ్డం నాగేశ్వరరావు, రజియా, ప్రమీలాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

●కావలి టౌన్ : కనీస వేతనం 26వేలు ఇవ్వాలన్న డిమాండుతో సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వారు పెద్దసంఖ్యలో ధర్నాలో పాల్గొని ఆర్డీవో వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె రెహానా బేగం మాట్లాడారు. ఐసీడీఎస్ ఏర్పడి 50ఏళ్లు పూర్తయినా సమస్యల్లో ఏ ఒక్కటి పరిష్కారం కావడం లేదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కొన్నేళ్ల నుంచి ఉద్యమిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని వాపోయారు. తక్కువ జీతాలతో ఎక్కువ పనులు చేయించుకుంటూ శ్రమ దోపిడీ చేస్తున్నారని, మెనూ చార్జీలు పెంచడంలేదని, మెడికల్ లీవ్ ఇవ్వడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పెంచులయ్య, కార్యదర్శి కృష్ణమోహన్, సుభాషిణి, విజయలత, వెంకటరమణమ్మ, బిందు, జ్యోతిలక్ష్మి, సౌజన్య పాల్గొన్నారు.

●ఉలవపాడు: అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మండల అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం సీడీఎస్ ప్రాజెక్టు కార్యాయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఎన్నికల ముందు అంగన్‌వాడీల సమస్యలను పరష్కరిస్తామని మాట ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల అనంతరం అంగన్‌వాడీల గురించి పట్టదన్నట్లు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఆయాల గౌరవ వేతనంను గత ప్రభుత్వం రూ.12వేసి చేసి హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా ఆన్‌లైన్‌లో చేర్చారన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, అన్ని యాప్‌లను ఒకే యాప్ కిందకు తీసుకురావాలని, మట్టి ఖర్చుల కింద రూ.20 వేలు ఇవ్వాలనే డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీడీసీవో కార్యాలయంలో సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ప్రాజెక్టు లీడర్లు, సీఐటీయూ ఉలవపాడు, గుడ్లూరు కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య


కావలి : వినతిపత్రం ఇస్తున్న వర్కర్స్ యూనియన్ నాయకులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఆయన స్థానిక ఏఐటీయూసీ నాయకులతో కలిసి మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఏఐటియుసీ ఆధ్వర్యంలో మార్చి 9న చలో విజయవాడ కార్యక్రమానికి పెద్దఎత్తున కార్మికులు తరలివచ్చి ఆందోళన చేపడతామన్నారు. ఈకార్యక్రమంలో ఏఐటీయుసీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధు, ఆత్మకూరు మున్సిపాల్టీ ఏఐటీయుసీ నాయకులు బి హజరత్తయ్య, షేక్ మునీర్‌బాషా, జె నాగరాజు, ఎం చెంచయ్య, కె నాగేంద్ర పాల్గొన్నారు.

● కావలి : ఆప్కాస్‌ను రద్దు చేసి మున్సిపల్ కార్మికులను ప్రయివేట్ ఏజెన్సీ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్‌కు అప్పగించాలన్న ప్రభుత్వ ప్రతిపాదికన తగదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మాల్యా అంకయ్య అన్నారు. ఈ విషయంపై సోమవారం ఆయన సంఘం సభ్యులతో కలిసి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కావలి పారిశుధ్య, ఇంజనీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పర్మినెంట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న సరెండర్‌లీవ్‌లు, డీఏలు విడుదల చేయాలన్నారు. గత సమ్మె కాలంలో ఇచ్చిన హామీల మేరకు ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, జనాభా ప్రాతిపదికన కార్మికులను పెంచాలని కోరారు.

●కందుకూరు: స్థానిక మున్సిపాలిటీలోని పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు సోమవారం కమిషనర్ అనూషను కలిసి వినతపత్రం అందజేశారు. పట్టణంలో పెరిగిన జనాభా ప్రాతిపదికన పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని, పీఎఫ్, హెల్త్‌కార్డులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు బూసి సురేష్‌బాబు, ఎస్‌ఏ గౌస్, ఆనంద్‌మోహన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కాకుమాని రమణమ్మ, పులి నాగేశ్వరరావు, ఎద్దు కొండమ్మ, శేషమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూ ఆక్రమణదారులపై చర్య తీసుకోండి

● ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో సబ్ కలెక్టరుకు వినతి


ప్రజలనుంచి అర్జీ తీసుకుంటున్న సబ్ కలెక్టరు

కందుకూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కందుకూరు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజకు సోమవారం ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమంలో పలువురు వినతులు అందజేశారు. వలేటివారిపాలెం మండలం అయ్యవారిపల్లిలోని ప్రభుత్వ భూమిని కొందరు పలుకుబడి కలిగిన వ్యక్తులు ఆక్రమించి దానిపక్కనే ఉన్న తమ స్వంత భూమిలో కలిపి ప్లాట్లు వేసి అమ్మేస్తున్నారని షేక్ హుస్సేన్ ఫిర్యాదు చేశారు. అలాగే దాని సమీపంలోని మరో 5 ఎకరాలను ఆక్రమించి ఇటుక బట్టీలు నిర్వహిస్తూ వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. గుడ్లూరు మండలం దారకానిపాడులోని కుంటపోరంబోకు భూమిని ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నట్లు గౌడపేరు రాము ఫిర్యాదు చేశారు. రెండు భూ ఆక్రమణలపై తక్షణం చర్యలు తీసుకోవాల ని ఆమె అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయ్యవారిపల్లిలో ఫారెస్టు అధికారులతో కలిపి జాయింట్ సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని, దారకానిపా డులో అక్రమ నిర్మాణాలను తక్షణం కూల్చివేయాలని ఆదేశించారు.

'రామదూత' ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకోవాలి

గుడ్లూరు మండలం చేవూరు సమీపంలో అనాథ పిల్లల పాఠశాల పేరుతో రామదూత స్వామి ఆక్రమించిన చెరువు పోరంబోకు భూమిని, అటవీ భూమిని తక్షణం స్వాధీనం చేసుకోవాలని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2021లో రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆ భూముల అలైనేషన్ రదు ్దచేసి తక్షణం స్వాధీనం చేసుకోవాలని జారీ చేసిన ఉత్తర్వులను నేటివరకు స్థానిక అధికారులు అమలు చేయటం లేదని పేర్కొన్నారు.

గిరిజనుల శ్మశాన స్థలంలో ఆక్రమణలు తొలగించాలి

ఉలవపాడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కరేడు పంచాయతీ రామకృష్ణాపురం గిరిజన కాలనీవాసులకు కేటాయించిన శ్మశాన స్థలం కబ్జాకు గురైందని తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శిలకు పలుమార్లు వినతిపత్రాలు అందించినా పట్టించుకోవడం లేదని సీఐటీయూ మండల నాయకులు పొన్నం రామలక్ష్మమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గిరిజన సంఘం బాధితులు, సీఐటీయూ నాయకులతో కలిసి ఆక్రమణకు గురైన శ్మశాన స్థలాన్ని పరిశీలించారు. శ్రీనివాసులరెడ్డి, బ్రహ్మయ్యలు ఈ స్థలంలో జామాయిల్ మొక్కలు సాగు చేసుకున్నారని చెప్పారు. ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడం లేదని ఈ విషయాన్ని గిరిజన సంక్షేమ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసే వరకు ఉద్యమం చేస్తామన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

దుత్తలూరు (ఉదయగిరి), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలో సోమవారం రూ.5 లక్షల నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కదిరి వెంకట రంగారావు, కిసాన్‌మోర్చా జిల్లా మాజీ ఉపా ధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధితో పాటు మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు.

బడ్జెట్‌కు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆందోళన



ఆందోళన చేస్తున్న వామపక్ష పార్టీల నేతలు

కావలిటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల నాయకులు సోమవారం బ్రిడ్జికూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. సీపీఎం జిల్లా కమిటి సభ్యులు కత్తి శ్రీనివాసులు, సీపీఐ జిల్లా నాయకులు బలిజేపల్లి వెంక టేశ్వర్లు మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు వేలకోట్లు దోచిపెట్టేందుకే అని ఆరోపించారు. విభజన హామీల ప్రస్తావనే లేదన్నారు. ధనవంతులకు రాయితీలు ప్రకటించి పేదలపై భారాలు మోపారని విమర్శించారు. బీమా రంగంలో నూరు శాతం ప్రైవేట్ పెట్టుబడులు పెట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచులయ్య, సీపీఐ కార్యదర్శి నాగరాజు, శ్యామల, మధుసూదన్‌రావు, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుడికి ఉపయోగపడని కేంద్ర బడ్జెట్

బిట్రగుంట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యుడికి ఉపయోగపడేది కాదని సీపీఎం, బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం వారు బోగోలు ఇబ్రహీంపేటలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ సీనియర్ నేత తుమ్మలవెంకయ్య ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశం మాట్లాడారు. రైతన్నలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. ధాన్యానికి మద్దతు ధర సాధించేందుకు ఈ నెల 22న నెల్లూరులో జరుగు చలో నెల్లూరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నేతలు గడ్డంమాల్యాద్రి, రావిమాల్యాద్రి, ప్రాంతీయ రైతు కమిటీ సభ్యులు పీ.శ్రీనివాసులు బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షులు షేక్.నూరుద్దీన్ ఉన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

వింజమూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూ సమస్యలు, పట్టణంలోని కాలనీలో ఇంటి పట్టాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం తహసీల్దారు హమీద్‌కు టీడీపీ జిల్లా కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూసమస్యల వలన ఘర్షణ వాతావరణం ఏర్పడుతోందని, తక్షణం వాటిని పరిష్కరించాలని ఆయన తహసీల్దారును కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండపల్లి వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, దిద్దిగుంట శ్రీను, పెరుమాళ్, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతలో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యం

● ఎంపీడీవో పీ. ఐజాక్ ప్రవీణ్



ఆత్మకూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించి పరిశుభ్రతలో ఆత్మకూరు మండలాన్ని అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యమని ఎంపీడీవో పి ఐజాక్ ప్రవీణ్ సోమవారం తెలిపారు.

? పారిశుధ్యం మెరుగుదలకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

! మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం. మురుగు కాలువలను శుభ్రం చేయడంతో పాటు, వీధుల పరిశుభ్రతకు చర్యలు చేపడుతున్నాం.

? మండలంలో ఎన్ని ఇంకుడు గుంతలు మంజూరయ్యాయి.

! ఎన్‌ఆర్‌జీఎస్ ద్వారా మంజూరైన 397 సోప్‌పిట్స్‌లలో 250 ప్రారంభించాం. 100 పూర్తయ్యాయి. త్వరలో అన్ని ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి చేస్తాం.

? ఎంతమందికి సబ్సిడీ రుణాలు మంజూరయ్యాయి.

! మండలంలోని బీసీ, కమ్మ, కాపు, ఈబీసీ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా 46 మందికి సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరయ్యాయి. ఈనెల 19వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు రుణాలు మంజూరు చేస్తాం.

న్యూస్ బాక్స్

పదిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో-2 ఆనందరావు

కొండాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మార్చి నెలలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషిచేయాలని మండలవిద్యాధికారి-2 ఆనందరావు ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఆదర్శపాఠశాలలో రికార్డులను తనిఖీచేసి, మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించి ప్రిన్సిపల్ ఖాదర్‌భాషాకు పలు సూచనలిచ్చారు.

ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక


సీనియర్లను సత్కరిస్తున్న రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగులు

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కందు కూరు డిపో కమిటీ తృతీయ మహాసభ సోమవారం నిర్వహించారు. డిపో ప్రెసి డెంట్ అద్దంకి సుబ్బారావు అధ్యక్షతన జరిగి న సమావేశంలో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎం. హరిప్రసాదరావు ముఖ్య అతిథిగా పాల్గొని నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్‌కే.గౌస్ బాషాను, కార్య దర్శిగా ఉమ్మడిశెట్టి వెంకటేశ్వర్లు, కోశాధి కారిగా ఎం.ఆదిశేషులను ఎన్ను కున్నారు.

23న లింగసముద్రం మండల సర్వసభ్య సమావేశం

లింగసముద్రం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 23న మధ్యాహ్నం 3గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సోమవారం ఎం పీడీఓ కట్టా శ్రీనివాసులు తెలిపారు. ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో వివిధశాఖలపై సమీక్ష జరుగుతుందన్నారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పం చులు, మండలస్థాయి అధికారులు, కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

రాష్ట్రస్థాయి కూచిపూడి నృత్య పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కావలి టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కూడిపూడి నృత్య పోటీల్లో నలందా ఒలింపియాడ్ విద్యార్థినులు పర్నిక ప్రియ, నివృతిప్రియలు ప్రతిభ చూపి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరిని సోమవారం డీఎస్పీ శ్రీధర్ అభినందించారు. అనంతరం నలందా విద్యాసంస్థల డైరెక్టర్ ఎండీ వసీం మాట్లాడారు. శ్రీకృష్ణ దేవరాయ జయంతి పురస్కరించుకుని సిటిజన్ వేల్ఫేర్ ఫారమ్ ప్రైడ్ ఇండియా కల్చర్ వారు నిర్వహించిన పోటీల్లో చిన్నారులు ప్రతిభ చూపడం జిల్లాకు గర్వకారణం అన్నారు.